www.visalaandhra.com

శనివారం

25-1-2025

హైదరాబాద్ ప్రచురణ

సంపుటి : 09, సంచిక : 124

పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from Hyderabad,Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

విశాలాంధ్ర

స్థాపితం : 1952

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

రష్యా సైబర్ నేరగాళ్ల కొత్త పంథా...

మాస్కో: రష్యా సైబర్ నేరగాళ్లు కొత్త పంథా అనుసరిస్తున్నారు. మైక్రోసాఫ్ట్ ఉద్యోగులుగా నటిస్తూ హ్యాకింగ్‌కు పాల్పడుతున్నారంటూ బ్రిటిష్ సైబర్ సెక్యూరిటీ కంపెనీ సోఫోస్ వెల్లడించినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. తొలుత స్కామర్లు ఓ వ్యక్తి కంప్యూటర్‌కు వేల సంఖ్యలో స్పామ్ సందేశాలు పంపుతారు. ఆ సందేశాల తాకిడికి యూజర్ ఉక్కిరిబిక్కిరవుతున్న తరుణంలో తాము ఆ సమస్యను పరిష్కరిస్తామంటూ హ్యాకర్లు ఐటీ సపోర్ట్ ఉద్యోగులుగా సంప్రదిస్తారు. ఆ సిస్టమ్ యాక్సెస్ పొందగానే ర్యాన్సమ్‌వేర్ ఇన్‌స్టాల్ చేసి, సమాచారాన్ని చోరీ చేస్తారు. ఇదంతా రిమోట్‌గానే జరుగుతుంది.

హైకోర్టు అదనపు జడ్జీల ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో కొత్తగా నియమితులైన ఇద్దరు అదనపు న్యాయమూర్తులు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. జస్టిస్ అవధానం హరిహరనాథ శర్మ, జస్టిస్ డా.యడవల్లి లక్ష్మణరావుతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ప్రమాణం చేయించారు. వీరిద్దరితో హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 30కి చేరింది. హరిహరనాథ శర్మ, లక్ష్మణరావులను హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం ఇటీవల సిఫార్సు

- మిగతా 2 లో

ఇస్రో శత ప్రయోగానికి శ్రీకారం

విశాలాంధ్ర-సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ శ్రీహరికోట నుంచి శత ప్రయోగానికి సన్నద్ధమయ్యింది. ఈనెల 29వ తేదీ ఉదయం 6:23 గంటలకు రెండవ ప్రయోగ వేదిక నుంచి 100వ రాకెట్‌ను ఉపయోగించడానికి ఇస్రో సర్వం సిద్ధం చేసింది. జీఎస్ఎల్‌వీ-ఎఫ్ 15 రాకెట్ ద్వారా నావిగేషన్‌కు సంబంధించిన ఎన్వీఎస్-2 ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నది. ఈ ఉపగ్రహం ద్వారా భారత భూభాగంలోనూ భూభాగ తీరం

- మిగతా 2 లో

గణతంత్ర వేడుకలకు భారీ భద్రత

న్యూఢిల్లీ : గణతంత్ర వేడుకల కోసం రాజధాని అంతటా 70 కి పైగా పారామిలిటరీ కంపెనీలు, 15 వేల మందికి పైగా పోలీసు సిబ్బందిని మోహరించనున్నట్లు శుక్రవారం ఒక అధికారి ప్రకటించారు. డ్రోన్లు, సీసీటీవీ నిఘా ద్వారా నగరాన్ని పర్యవేక్షిస్తామని, సైబర్ స్పెషలిస్ట్ అధికారులు కార్యకలాపాలను పర్యవేక్షిస్తారని పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. 'బహుళ అంచెల బారికేడింగ్‌తో పాటు ఆరు అంచెల తనిఖీలు ఉన్నాయి. న్యూఢిల్లీ జిల్లాలో ముఖ గుర్తింపు వ్యవస్థలు

- మిగతా 2 లో

మత ఘర్షణల్లో బీజేపీ రాష్ట్రాలు టాప్

- అల్లర్లకు చిరునామాగా మహారాష్ట్ర
- తర్వాత స్థానాల్లో యూపీ, బీహార్
- 2024లో 84 శాతం పెరిగిన ఘటనలు

న్యూఢిల్లీ: భిన్నత్వంలో ఏకత్వానికి, మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే భారతదేశం ఎన్డీయే హయాంలో మత ఘర్షణలకు చిరునామాగా మారింది. ముస్లింలే లక్ష్యంగా హింస పేట్రేగింది. లవ్ జిహాద్, గో సంరక్షణ పేరిట హింస కొనసాగుతోంది. మూక హత్యలు పెరిగాయి. పండుగలప్పుడు అల్లర్లు జరగడం నిత్యకృత్యంగా మారిపోయింది. 2024లో దేశంలో మతఘర్షణలు 84 శాతం పెరిగినట్లు ది సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సొసైటీ అండ్ సెక్యులరిజం (సీఎస్ఎస్ఎస్) నివేదించింది. మత ఘర్షణల్లో బీజేపీ పాలిత రాష్ట్రాలే అగ్రస్థానంలో నిలిచినట్లు తెలిపింది. టాప్-5లో మహారాష్ట్ర, బీహార్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు ఉన్నాయని పేర్కొంది. మొత్తం 59 కేసుల్లో 49 బీజేపీ రాష్ట్రాల్లోనే నమోదైనట్లు తెలిపింది. ఏడు కేసులు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో, మూడు కేసులు తృణమూల్ పాలిత బెంగాల్‌లో నమోదైనట్లు వెల్లడించింది. మత ఘర్షణలు, అల్లర్లలో ముస్లింలు పెద్ద సంఖ్యలో ప్రాణాలు

- మిగతా 2 లో

రాజకీయాలకు విజయసాయిరెడ్డి గుడ్‌బై

నేడు రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా... వైసీపీలో కలకలం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాజకీయాలకు వైసీపీ సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి గుడ్‌బై చెప్పారు. తాను రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా శుక్రవారం ఆయన ప్రకటన చేశారు. తన రాజ్యసభ సభ్యత్వానికీ శనివారం రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. విజయసాయిరెడ్డి రాజీనామా వైసీపీకి పెద్ద షాక్‌గా మారింది. విజయసాయిరెడ్డి తన ట్వీట్‌లో... చంద్రబాబు కుటుంబంతో వ్యక్తిగత విభేదాలు లేవని, పవన్ కల్యాణ్‌తో చిరకాల స్నేహం ఉందని పేర్కొన్నారు. రెండుసార్లు రాజ్యసభ అవకాశం ఇచ్చిన జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 'రాజకీయాల నుంచి తప్పుకుంటున్నాను. రాజ్యసభ సభ్యత్వానికి రేపు 25న రాజీనామా చేస్తున్నాను. నేను ఏ రాజకీయపార్టీలోను చేరడం లేదు. వేరే పదవులో, ప్రయోజనాలో లేక డబ్బులో ఆశించి రాజీనామా చేయడం లేదు' అని విజయసాయిరెడ్డి పేర్కొన్నారు. ఈ నిర్ణయం పూర్తిగా తన వ్యక్తిగతమని, ఎలాంటి ఒత్తిళ్లు లేవని, ఎవరూ ప్రభావితం చేయలేదని తెలిపారు. నాలుగు దశాబ్దాలుగా, మూడు తరాలుగా తనను నమ్మి ఆదరించిన వైఎస్ కుటుంబానికి రుణపడి ఉన్నానని వివరించారు. రెండుసార్లు రాజ్యసభ సభ్యుడిగా అవకాశం ఇచ్చిన జగన్‌కు, తనను ఇంతటి ఉన్నతస్థాయికి తీసుకెళ్లిన



- మిగతా 2 లో

రేవంత్ రెడ్డికి ఘనస్వాగతం

విశాలాంధ్ర - హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అభివృద్దే లక్ష్యంగా పెట్టుబడుల సాధనకు విదేశీ పర్యటనకు వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ... దావోస్ పర్యటన విజయవంతంగా ముగించుకుని శుక్రవారం ఉదయం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా సీఎం రైజింగ్ బృందానికి కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కొద్ది రోజులుగా దావోస్ తదితర దేశాలలో పర్యటించిన ముఖ్యమంత్రి... లక్షన్నర కోట్లకు పైగా రికార్డు స్థాయిలో వ్యాపార దిగ్గజాలతో ఒప్పందం కుదుర్చుకుని సగర్వంగా రాష్ట్రానికి చేరుకున్న ముఖ్యమంత్రికి, రాష్ట్ర ప్రజలకు మంత్రులు, ఎమ్మెల్యేలు కృతజ్ఞతలు తెలిపారు.

బడ్జెట్‌లో ఏపీకి ప్రాధాన్యమివ్వండి

వచ్చేనెల 1వ తేదీన ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రాధాన్యత కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు.

2లో

రూ.55,652 కోట్ల సాయం

- కేంద్ర మంత్రికి సీఎం వినతి
- అర్బన్, పవర్ సెక్టార్లపై ఉన్నతాధికారులతో ఖట్టర్ సమీక్ష

విశాలాంధ్ర-హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు రూ.55,652 కోట్ల ఆర్థిక సహాయం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి... కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో 65 శాతం భూభాగం అర్బన్ ఏరియాలో ఉందన్నారు. హైదరాబాద్ సహా పురపాలక అభివృద్ధికి పూర్తి సహకారం అందించాలన్నారు. కాకతీయ లో అర్బన్, పవర్ సెక్టార్ లపై సంబంధిత ఉన్నతాధికారులతో కేంద్ర విద్యుత్, గృహ నిర్మాణ, పురపాలక వ్యవహారాల మంత్రి ఖట్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో పురపాలక శాఖ, హైదరాబాద్ అభివృద్ధిపై నిర్మించిన షార్ట్ ఫిల్మ్‌ను కేంద్ర మంత్రి తిలకించారు. అభివృద్ధి కార్యక్రమాలు, ప్రతిపాదిత ప్రాజెక్టులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్ర మంత్రికి పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిషోర్ వివరించారు. తెలంగాణను లక్ష కోట్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చేపట్టిన అర్బన్ మొబిలిటీ (హెచ్-సిటీ, ఎలివేటెడ్ కారిడార్స్, మెట్రో కనెక్టివిటీ ఈస్ట్ వెస్ట్ కారిడార్, ట్రిబుల్ ఆర్, మెట్రో కనెక్టివిటీ, గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్స్,) మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, అర్బన్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, సివిక్ సర్వీసెస్ (సరస్సుల పునరుజ్జీవనం, వాటర్ సెక్యూరిటీ సిటీ), భూ భారతి చట్టం మెట్రోపాలిటన్ అభివృద్ధి ప్లాన్-2050, బిల్డ్ నౌ, టౌన్షిప్ గ్రోత్ సెంటర్స్, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుల గురించి ముఖ్యమంత్రి... కేంద్ర మంత్రికి వివరించారు. మెట్రో రైల్ ఫేజ్-2కు రూ.24,269 కోట్లు, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు రూ.10 వేల కోట్లు, తెలంగాణ కోర్ అర్బన్ ఏరియా కోసం ఉద్దేశించిన సివరేజి మాస్టర్ ప్లాన్‌కు రూ.17,212 కోట్లు, వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ప్లాన్‌కు రూ.4,170 కోట్ల ఆర్థిక సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అటల్ మిషన్ ఫర్ రెజ్యూవే నేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్, అమృత్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ ఫండ్, స్వచ్ఛభారత్ మిషన్ 2.0, స్వచ్ఛభారత్ మిషన్ అర్బన్, స్మార్ట్ సిటీ మిషన్, పీఎం స్వానిధి కేంద్ర సౌజన్య పథకాల ప్రగతిని వివరించి పెండింగ్ పనుల పూర్తికి నిధులను మంజూరు చేయాలని సీఎం కోరారు.

సహకారమందిస్తాం: కేంద్ర మంత్రి

దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో ఈసారి ఏకంగా రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు కుదుర్చుకున్న

- మిగతా 2 లో

నిరాటంకంగా నాణ్యమైన విద్యుత్

- సీఎండీలు... ఎస్‌ఈలు క్షేత్రస్థాయి పర్యటన
- రైతులు, వినియోగదారుల భాగస్వామ్యం
- డివిజన్‌లలో సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష: భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్: వేసవిలో నిరాటంకంగా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు సీఎండీలు మొదలుకొని ఎస్‌ఈ స్థాయి అధికారుల వరకు రాష్ట్రవ్యాప్తంగా క్షేత్ర స్థాయిలో పర్యటించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రజాభవన్‌లో శుక్రవారం టాన్స్‌కో, ఎస్పీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవి ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేసేందుకు కార్యాచరణ ప్రారంభించాలని ఆదేశించారు. సమీక్షలు, అవగాహన సమావేశాలు నిర్వహించాలని కోరారు. రైతులు, వినియోగదారులు, మీడియా ప్రతిధులను భాగస్వాములను చేయాలని కోరారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని సమర్థవంతంగా విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వివరించాలని అన్నారు. ఫిర్యాదులు, సలహాలు స్వీకరించాలని పేర్కొన్నారు. ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 4 వరకు వేసవి ప్రణాళికపై క్షేత్రస్థాయిలో విస్తృత సమావేశాలు నిర్వహించాలన్నారు. 29న నోడల్ అధికారులు... ట్రాన్స్‌కో ఉన్నతాధికారులతో కలిసి జిల్లా, సబ్ డివిజన్ స్థాయిలో వేసవి కార్యాచరణపై సమీక్షించాలన్నారు. ఫిబ్రవరి 4న ఎస్‌ఈలు డివిజన్ స్థాయిలో సిబ్బందితో కలిసి సమ్మర్ యాక్షన్ ప్లాన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించాలన్నారు. సబ్‌స్టేషన్లలో ఓవర్ లోడ్ ఫీడర్లు, డీటీఆర్‌లలో ఎదురవుతున్న సమస్యలు, వాటిని ఎలా ఎదుర్కోబోతున్నారో వివరించాలని అధికారులకు సూచించారు. ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, ఎస్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి పాల్గొన్నారు.

రాజ్యాంగ విరుద్ధం

'పౌరసత్వం'పై ట్రంప్ ఉత్తర్వుల నిలుపుదల

14 రోజుల స్టే విధించిన ఫెడరల్ కోర్టు

వాషింగ్టన్: అమెరికా జన్మించే వలసదారుల పిల్లలకు పుట్టుకతో లభించే పౌరసత్వాన్ని రద్దు చేస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన ఉత్తర్వులు పూర్తిస్థాయిలో రాజ్యాంగానికి విరుద్ధమైనవి అని ఫెడరల్ కోర్టు తెలిపింది. ట్రంప్ ఆదేశాలపై 14 రోజుల పాటు స్టే విధిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ అమలునకు ట్రంప్ యంత్రాంగం ఎలాంటి చర్యలు తీసుకునేందుకు వీల్లేదంటూ సియాటెల్ ఫెడరల్ జడ్జి జాన్ కోగెనోర్ ఆదేశించారు. 'నాలుగు దశాబ్దాల నా అనుభవంలో ఇంత స్పష్టంగా ఉన్న ఏ కేసును చూడలేదు. ట్రంప్ తాజా ఉత్తర్వులు పూర్తిస్థాయిలో రాజ్యాంగానికి విరుద్ధంగా ఉన్నాయి' అని ఆయనన్నారు. ఈ ఉత్తర్వులపై దీర్ఘకాలం స్టే విధించాలా లేదా అన్నది ఫిబ్రవరి 6వ తేదీన జరగబోయే తదుపరి విచారణలో నిర్ణయిస్తామని జడ్జి తెలిపారు. అంతకుముందు అటార్నీ బ్రెట్ షుమాట్ వాదనలు వినిపించారు. ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ రాజ్యాంగబద్ధమేనా అని న్యాయమూర్తి ఆయనను ప్రశ్నిస్తే... కచ్చితంగా అంటూ షుమాట్ బదులిచ్చారు. దీనికి జడ్జి స్పందిస్తూ 'ఇది రాజ్యాంగపరమైన ఉత్తర్వు అని బార్ సభ్యుడు నిస్సందేహంగా ఎలా చెప్పగలడో అర్థం కావడం లేదు' అని వ్యాఖ్యానించారు. తాజా పరిణామం తనను కలచి వేసిందని ఆయనన్నారు. కాగా, ఫిబ్రవరి 20 నుంచి పుట్టుకతో లభించే పౌరసత్వం రద్దవుతుందని ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లో పేర్కొన్నారు. ఫెడరల్ కోర్టు ఉత్తర్వులతో ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ అమలు 14 రోజుల పాటు నిలిచిపోనుంది. ఫిబ్రవరి 6న తదుపరి విచారణ జరుగుతుంది.

ఫీజులు గుంజేద్దాం

- నారాయణ కాలేజీ విద్యార్థి ఆత్మహత్య కలకలం
- హాల్‌టికెట్ల నిలిపివేతకు ఆదేశాలు
- ఫిర్యాదులపై ఏపీ ప్రభుత్వం మౌనం

2లో

ఇదీ లోకం!

వామ్మో.. మా భూములు, మా ఇళ్ళు!

భవితవ్యం అంధకారం!

రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్సిటీల్లో దశాబ్దాలుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల భవితవ్యం అంధకారం కానుంది. జీతభత్యాల చెల్లింపులకు బడ్జెట్‌లో కేటాయింపులను ప్రభుత్వం నిలిపివేయడంతో వీరి జీవితాలు అగమ్యగోచరంగా మారనున్నాయి. ఎప్పటికైనా శాశ్వత ఉద్యోగులుగా పరిగణించబడతామన్న మినిమం టైం స్కేల్ ఉద్యోగుల ఆశ నిరాశైంది. వర్సిటీలే అంతర్గత నిధుల నుంచి వీరికి జీతాలు చెల్లించాలన్న ప్రతిపాదనను ఆమోదించడంతో ఆర్థికంగా కొట్టుమిట్టాడుతూ అంతంతమాత్రంగా నెట్టుకొస్తున్న వర్సిటీల నెత్తిపై తాటిపండు పడినట్లైంది. విద్య, పరిశోధనలు ప్రోత్సహిస్తూ వర్సిటీలను ఆదుకోవాల్సిన ప్రభుత్వమే... కాడి వదిలేయడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- మినిమం టైం స్కేల్ ఉద్యోగులకు ప్రభుత్వం షాక్
- బడ్జెట్ కేటాయింపు నిలిపివేత
- వర్సిటీలే జీతభత్యాలు చెల్లించాలని ఆదేశం
- డైలమాలో 1400 మంది వేతనజీవులు

2లో

ఎల్గార్ పరిషత్ కేసు...

రోనా విల్సన్, సుధీర్ విడుదల

ముంబై: ఎల్గార్ పరిషత్-మావోయిస్టు సంబంధాల కేసులో నిందితులుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న పరిశోధకుడు రోనా విల్సన్, సుధీర్ ధవాలే శుక్రవారం నవీ ముంబై జైలు నుంచి విడుదలయ్యారు. వారిద్దరు ఆరు సంవత్సరాల క్రితం అరెస్టయ్యారు. బాంబే హైకోర్టు బెయిల్ మంజూరు చేసిన పక్షం రోజుల తర్వాత, కేసును విచారిస్తున్న ప్రత్యేక ఎన్ఐఏ కోర్టు ముందు బెయిల్ లాంఛనాలు పూర్తి చేసుకుని, మధ్యాహ్నం 1:30 గంటల ప్రాంతంలో పొరుగున ఉన్న నవీ ముంబైలోని తలోజా నుంచి వారిద్దరూ బయటకు వచ్చారు. విల్సన్, ధవాలే 2018 నుంచి జైలులో ఉన్నారని, ఉగ్రవాద నిరోధక చట్టం 'ఉపా' ప్రయోగించబడిన కేసులో విచారణ ఇంకా ప్రారంభం కాలేదని పేర్కొంటూ హైకోర్టు జనవరి 8న వారికి బెయిల్ మంజూరు చేసింది. 'వారు 2018 నుంచి జైలులో ఉన్నారు. ఈ కేసులో ఇంకా అభియోగాలు మోపలేదు. ప్రాసిక్యూషన్ 300 మందికి పైగా

- మిగతా 2 లో

తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యం - 2

నిజాం హయాంలో తెలంగాణ ప్రాంతంలో రాజకీయాలకు తావేలేదు. కానీ మత మార్పిడులు జోరుగా సాగేవి. హిందువులను ముఖ్యంగా దళితులను ఇస్లాం మతం స్వీకరించేట్లు చేసేవారు. నిజాం ఆశీస్సులున్న రజాకార్లు ఈ మత మార్పిడులను ప్రోత్సహించేవారు. రజాకార్ల నాయకుడు కాశిం రజ్వీ "ప్రతి ముస్లిమూ రాజే" అనేవాడు.

ప్రత్యేక వ్యాసం 4వ పేజీలో

కిమ్ చాలా స్మార్ట్... తప్పక కలుస్తా: ట్రంప్

వాషింగ్టన్: ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్ చాలా తెలివిగలవారని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కితాబిచ్చారు. ఆయనను తప్పకుండా కలుస్తానని చెప్పారు. 'కిమ్‌కు నేనంటే చాలా ఇష్టం. ఆయన చాలా స్మార్ట్. మేమిద్దరం తప్పక భేటీ అవుతాం' అని ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో ట్రంప్ వెల్లడించారు. మేమిద్దరం ప్రేమలో పడిపోయామంటూ ఆయన చమత్కరించారు. దక్షిణ కొరియా, అమెరికా నుంచి ముప్పు ఉందని ఉత్తర కొరియా ఆరోపిస్తున్న నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలను ప్రాధాన్యత ఏర్పడింది. ట్రంప్ గతంలో అధికారంలో ఉన్నప్పుడు కిమ్ విషయంలో చూసీ చూడనట్లు వ్యవహరించారు. ట్రంప్, కిమ్ మూడు సార్లు భేటీ అయ్యారు. 2017 నుంచి 2021 వరకు వీరిద్దరి మధ్య అరుదైన దౌత్యపరమైన బంధం ఉంది. రెండు దేశాల మధ్య చర్చలపై ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడారు. 2019లో వియత్నాంలో వీరద్దరు భేటీ అయ్యారు. అణు నిరాయుధీకరణపై ఉత్తర కొరియా వెనక్కి తగ్గకపోవడంతో ఆ చర్చలు విఫలమయ్యాయి. బైడెన్ అధికారంలోకి వచ్చాక రెండు దేశాల మధ్య దూరం పెరిగింది. ట్రంప్ తిరిగి అధికారంలోకి వచ్చారు. అయితే వ్యక్తిగత దౌత్య పద్ధతుల్లో ముందుకెళ్లే ఉద్దేశం కిమ్‌కు లేదని తెలుస్తోంది.

జిన్‌పింగ్‌తో స్నేహపూర్వక చర్యలు...

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ఇటీవల జరిపిన ఫోన్ చర్చలు స్నేహపూర్వకంగా సాగినట్లు ట్రంప్ తెలిపారు. చైనాతో వాణిజ్య ఒప్పందం చేసుకోవాలని భావిస్తున్నట్లు చెప్పారు. టిక్‌టాక్, వాణిజ్యం, తైవాన్ తదితర కీలక అంశాలపై ఇద్దరు అధినేతలు చర్చించారు. 'జిన్‌పింగ్‌తో చర్చలు స్నేహపూర్వకంగా సాగాయి. అనేక అంశాలపై మాట్లాడుకున్నాం' అని ట్రంప్ అన్నారు. చైనాలో న్యాయమైన వాణిజ్య పద్ధతులపై ఒప్పందం కుదుర్చుకోవడం తనకు సాధ్యమేనని ఒక ప్రశ్నకు ఆయన బదులిచ్చారు.

పుతిన్ యుద్ధం ఆపేయడం మంచిది...

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉక్రెయిన్‌తో రాజీ కుదుర్చుకోవాలని ట్రంప్ సూచించారు. ఒపెక్ చమురు ధరల్లో కోతలతో రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపవచ్చన్నారు. ఆంక్షలు విధిస్తామన్న హెచ్చరికలకు పుతిన్ తలొగ్గుతారా అని జర్నలిస్టు ప్రశ్నించగా నాకు తెలియదు అని ట్రంప్ బదులిచ్చారు. 'ఉక్రెయిన్ రాజీకి సిద్ధంగా ఉంది. రష్యా కూడా అందుకు సానుకూలంగానే ఉందని అనుకుంటున్నా. ఈ విషయంలో పుతిన్ త్వరలోనే నన్ను కలవవచ్చు. సాధ్యమైనంత త్వరగా కలుస్తా' అని ట్రంప్ చెప్పారు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఇంతటి భారీ సంఖ్యలో సైనికుల మరణాలు సంభవించిన దాఖలాలు లేవని ఆందోళన వ్యక్తంచేశారు. నిత్యం పెద్దసంఖ్యలో సైనికులు చనిపోతున్నారని, ఈ యుద్ధాన్ని ఎంత త్వరగా ముగిస్తే అంత మంచిదని ట్రంప్ అన్నారు. యుద్ధానికి సంబంధించి తన వద్ద కొన్ని చిత్రాలు ఉన్నాయని, వాటిని చూడటానికి మీరు ఇష్టపడరన్నారు. 'ఈ యుద్ధంతో రెండు దేశాలు తీవ్రంగా నష్టపోతున్నాయి. రష్యా 8,00,000 మంది సైనికులను కోల్పోయింది' అని ట్రంప్ ఒక ప్రశ్నకు సమాధానం ఇచ్చారు. ఒపెక్ దేశాలు చమురు ధరను తగ్గిస్తే ఈ యుద్ధాన్ని ఆపేందుకు అవకాశం ఉంటుందన్నారు. చమురు ధరలు తగ్గించాలన్న ట్రంప్ మాటలతో ఉక్రెయిన్ కూడా ఏకీభవిస్తున్నట్లు ఆ దేశ అధ్యక్షుడికి చీఫ్ ఆఫ్ స్టాఫ్ అందిరియే యెర్మార్క్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

అక్రమ వలసదారులపై ట్రంప్ ఉక్కుపాదం

అమెరికా వ్యాప్తంగా 500 మందికి పైగా అక్రమ వలసదారులు అరెస్టు అయ్యారు. వందల మందిని దేశం నుంచి పంపించేశారు. ఈ వివరాలను శ్వేతసౌధం మీడియా కార్యదర్శి కరోలిన్ లీవిట్ వెల్లడించారు. అమెరికా చరిత్రలోనే అతిపెద్ద బహిష్కరణ ఆపరేషన్ కొనసాగుతోందని తెలిపారు.

వందల మంది అక్రమ వలసదారులను సైనిక విమానాల్లో దేశం నుంచి పంపించేశామని చెప్పారు. అధ్యక్ష ఎన్నికలప్పుడు డొనాల్డ్ ట్రంప్ ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నట్లు కరోలిన్ వెల్లడించారు. ఉగ్రవాదం, మాదకద్రవ్యాల రవాణా, లైంగిక నేరాల వంటి కేసుల్లో నిందితులు ఉన్న 538 మంది అక్రమ వలసదారులను ఇప్పటివరకు అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇదిలావుంటే, అక్రమ వలసదారులను అమెరికా వెనక్కి పంపేస్తుండటంతో మెక్సికో తన సరిహద్దు రాష్ట్రాల్లో శరణార్థుల కోసం శిబిరాలు ఏర్పాటు చేస్తోంది. టెక్సాస్‌లోని ఎల్‌పాసో సరిహద్దుకు వద్ద ఖాళీ స్థలంలో భారీగా శిబిరాల నిర్మాణాన్ని చేపట్టింది.

జేఎఫ్‌కే, ఆర్‌ఎఫ్‌కే, ఎంఎల్‌కే హత్యలపై వివరాలు వెలుగులోకి...

సంబంధిత ఫైళ్ల విడుదలకు ట్రంప్ ఆదేశం

వాషింగ్టన్: అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెనడీ, మాజీ సెనెటర్ రాబర్ట్ ఎఫ్ కెనడీ, పౌర హక్కుల కార్యకర్త మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ (ఎంఎల్‌కే) హత్యలకు సంబంధించిన వివరాలన్నీ వెలుగులోకి రానున్నాయి. ఇందుకు సంబంధించిన ఫైళ్లను బహిర్గతం చేసేందుకుగాను నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉత్తర్వులు జారీచేశారు. సంబంధిత వివరాలను గోప్యంగా ఉంచడం ప్రజా ప్రయోజనానికి విరుద్ధమన్న భావనతోనే ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో ట్రంప్ పేర్కొన్నారు. జాన్ ఎఫ్ కెనడీ హత్యకు సంబంధించిన రికార్డులను ఎలా బహిర్గతం చేయాలన్న దానిపై 15 రోజుల్లోపు ప్రణాళిక సమర్పించాలని నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్‌ను ఆదేశించారు. రాబర్ట్ ఎఫ్ కెనడీ, మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ హత్యలకు సంబంధించిన ఫైళ్ల విడుదలపై 45 రోజుల్లోగా ప్రణాళిక సమర్పించాలని ఉత్తర్వుల్లో ట్రంప్ స్పష్టంచేశారు. అమెరికాకు 35వ అధ్యక్షుడిగా జాన్ ఎఫ్.కెనడీ 1961లో బాధ్యతలు చేపట్టారు. 43 ఏళ్లకే ఆ పీఠాన్ని అధిరోహించిన అతి పిన్న వయస్కుడిగా ఘనత సాధించారు. 1963 నవంబరు 22న టెక్సాస్ పర్యటనకు వెళ్లినప్పుడు ఆయన కాన్వాయ్‌పై దాడి జరిగింది. దుండగుడు జరిపిన కాల్పులలో ఆయన ప్రాణాలు కోల్పోయారు. ఈ హత్య కేసులో తొలుత లీ హార్వే అనే వ్యక్తిని అరెస్టు కాగా... దర్యాప్తు సమయంలో అతడు హత్యకు గురయ్యాడు. హార్వేను చంపిన వ్యక్తిని అరెస్టు చేసి శిక్షించారు. అయితే. కొంతకాలం తర్వాత అతడు కేన్సర్‌తో మరణించాడు. నాటి నుంచి కెనడీ హత్య రహస్యంగానే ఉంది. అలాగే, అమెరికా అటార్నీ జనరల్, సెనెటర్ రాబర్ట్ ఎఫ్ కెనడీ 1968లో హత్యకు గురయ్యారు. అధ్యక్ష ఎన్నికలకు ముందు డెమొక్రటిక్ పార్టీ ప్రైమరీల సమయంలో ఈ ఘటన జరిగింది. లాస్ ఏంజిల్‌లోని హోటల్‌లో కార్యకర్తలనుద్దేశించి ప్రసంగించిన అనంతరం బయటకు వస్తుండగా రాబర్ట్‌పై కాల్పులు జరిగాయి. ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. నిందితుడిని పలస్తీనాకు చెందిన సిర్హాన్‌గా గుర్తించారు. ఇక, అమెరికా పౌర హక్కుల ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ 1968లో హత్యకు గురయ్యారు. ఒక ర్యాలీలో మాట్లాడుతున్న సమయంలో ఆయనను చంపేశారు.

ట్రంప్‌తో చర్చలకు పుతిన్ సిద్ధం: రష్యా

మాస్కో: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో చర్చలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సిద్ధంగా ఉన్నారని, వాషింగ్టన్ అంగీకారం కోసం వేచివున్నారని క్రెమ్లిన్ పేర్కొంది. క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ మేరకు వివరాలు తెలిపారు. 'పుతిన్ సిద్ధమే... ఇక అమెరికా స్పందనే తరువాయి' అని అన్నారు. ఉక్రెయిన్‌పై చర్చల కోసం పుతిన్‌తో భేటీకి సిద్ధంగా ఉన్నట్లు ట్రంప్ కూడా చెప్పారు.

అయితే ఈ సమావేశం ఎప్పుడు జరుగుతుందో చెప్పలేమని పెస్కోవ్ అన్నారు. అదే సమయంలో చమురు ధరలను తగ్గించడం వల్ల ఉక్రెయిన్-రష్యా యుద్ధాన్ని ముగించవచ్చు అని ట్రంప్ చెప్పడాన్ని పెస్కోవ్ తోసిపుచ్చారు. తమ పోరు చమురు ధరలపై ఆధారపడి సాగడం లేదని ఆయన అన్నారు. రష్యా భద్రతకు ముప్పు... ఉక్రెయిన్‌లోని రష్యన్లకు బెదిరింపులు, రష్యా పక్షాన్ని వినేందుకు అమెరికన్లు, యూరోపియన్లు విముఖంగా ఉండటం వంటి అంశాలు దీని వెనుక ఉన్నాయని పెస్కోవ్ నొక్కిచెప్పారు.

హైకోర్టు అదనపు జడ్జీల ప్రమాణ స్వీకారం

(మొదటిపేజీ తరువాయి)

చేసింది. దీనికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. దీంతో వారిద్దరూ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా ప్రమాణం చేశారు. హైకోర్టు మొదటి కోర్టు హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, ఏపీ బార్ కౌన్సిల్ అధ్యక్షులు ద్వారకానాథ్ రెడ్డి, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు కె.చిదంబరం, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ పి.పొన్నారావు, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ డా.వై.లక్ష్మణరావు, బార్ అసోసియేషన్, బార్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

రూ.55,652 కోట్ల సాయం

(మొదటిపేజీ తరువాయి)

విషయాన్ని కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్ ప్రస్తావిస్తూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అభినందించారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ... తెలంగాణ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకారం అందిస్తానని చెప్పారు. ఈటల మాట్లాడుతూ...హైదరాబాదులో ట్రాఫిక్ నిర్వహణ క్లిష్టతరంగా మారిందని, మెట్రో లైన్ విస్తరణకు సహకరించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. మేడ్చల్, శామీర్ పేట మెట్రో విస్తరణ ,ఎలివేటెడ్ కారిడార్లకు అనుమతులు మంజూరు చేయాలన్నారు. గ్రేటర్‌లో చెరువుల పునరుజ్జీవనంపై ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించారని కేంద్రమంత్రికి తెలిపారు. హైదరాబాదులో అర్బన్ హౌసింగ్‌కు పూర్తి సహకారం అందించాలని కోరారు.

మత ఘర్షణల్లో బీజేపీ రాష్ట్రాలు టాప్

(మొదటిపేజీ తరువాయి)

కోల్పోయినట్లు తెలిపింది. మత ఘర్షణలకు కేంద్రంగా మహారాష్ట్ర ఉందని, మొత్తం 59 ఘటనల్లో 12 ఈ రాష్ట్రంలోనే జరిగాయని సీఎస్ఎస్ఎస్ నివేదిక తెలిపింది. ఆ తర్వాత స్థానాల్లో ఉత్తరప్రదేశ్, బీహార్ ఉన్నాయని పేర్కొంది. ది హిందూ, టైమ్స్ ఆఫ్ ఇండియా, ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్, షహాఫత్, ది ఇంక్విలాబ్ వంటి పత్రికల ముంబై ఎడిషన్ల ఆధారంగా విడుదల చేసిన ఈ నివేదికను మానవ హక్కుల కార్యకర్తలు ఇర్ఫాన్ ఇంజినీర్, నేహా దభాడే, మిథులా రౌత్ రూపొందించారు. '2024 జనవరిలో మహారాష్ట్రలో హింస ఎక్కువగా జరిగింది. అయోధ్యలో రామమందిరం ప్రాణ ప్రతిష్ఠ సమయంలో నాలుగు అల్లర్లు జరిగాయి. ఫిబ్రవరిలో సరస్వతి పూజా సమయంలో విగ్రహాల నిమజ్జనం వేళ ఏడు... గణేశ్ ఉత్సవాల్లో నాలుగు... బక్రీద్ సమయంలో రెండు ఘటనలు జరిగాయి. విద్వేష ప్రసంగాలు, మూక హత్యల విషయానికొస్తే 2024లో తొమ్మిది మంది ముస్లింలు, ఒక క్రైస్తవుడు, ఒక హిందువుతో కలిపి 11 మంది చనిపోయారు. మొత్తం 13 ఘటనలు నమోదయ్యాయి. వీటిలో ఏడు ఘటనలు గో రక్షణ సాకుతో జరిగాయి. మిగతావి లవ్ జిహాద్ పేరిట చోటుచేసుకున్నాయి. ముస్లింలే లక్ష్యంగా హింస పేట్రేగింది. ఏప్రిల్/మేలో సార్వత్రిక ఎన్నికలతో పాటు మహారాష్ట్ర, హర్యానా, జార్ఖండ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉండటం కూడా మత ఘర్షణలకు ఆజ్యం పోశాయి. ఆయా సందర్భాల్లో మత విద్వేషం, అలర్లు, విద్వేష ప్రసంగాలకు అడ్డులేకుండా పోయింది' అని సీఎస్ఎస్ఎస్ నివేదిక వెల్లడించింది.

రోనా విల్సన్, సుధీర్ విడుదల

(మొదటిపేజీ తరువాయి)

సాక్షులను ఉదహరించింది. అందువల్ల విచారణ సమీప భవిష్యత్‌లో ముగిసే అవకాశం లేదు' అని వారికి ఉపశమనం ఇస్తూ హైకోర్టు వ్యాఖ్యానించింది. నేర కేసులో అభియోగాలు మోపిన తర్వాత విచారణ ప్రారంభమవుతుంది. ఈ కేసులో ధవాలే, విల్సన్ కాకుండా మరో 14 మంది కార్యకర్తలు, విద్యావేత్తలను అరెస్టు చేశారు. వారిలో ఎనిమిది మంది... వరవరరావు, సుధా భరద్వాజ్, ఆనంద్ తెల్తుంబ్డే, వెర్నాన్ గోన్సాల్వ్స్, అరుణ్ ఫెర్రీరా, షోమా సేన్, గౌతమ్ నవలఖా, మహేష్ రౌత్ ఇప్పటి వరకు బెయిల్ పొందారు. అయితే వారిలో రౌత్ బెయిల్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) దాఖలు చేసిన అప్పీల్ సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్నందున అతను ఇప్పటికీ జైలులోనే ఉన్నాడు. నిందితులలో ఒకరైన జెస్యూట్ పూజారి, కార్యకర్త స్టాన్ స్వామి 2021లో జ్యుడీషియల్ కస్టడీలో ఉండగా మరణించారు.

ఈ కేసు డిసెంబరు 31, 2017న పూనేలో జరిగిన ఎల్గార్ పరిషత్ సమావేశంలో రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని, ఆ తర్వాత రోజు పూనే నగరానికి వెలుపల ఉన్న కోరెగావ్-భీమా అనే గ్రామంలో హింసకు కారణమయ్యారని ఆరోపణలు వచ్చాయి. ఈ సమావేశానికి మావోయిస్టుల మద్దతు ఉందని పూనే పేర్కొన్నారు. తర్వాత ఎన్ఐఏ దర్యాప్తు చేపట్టింది.

భవితవ్యం అంధకారం!

విశాలాంధ్ర-విశాఖపట్నం: రాష్ట్రంలో విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న మినిమం టైం స్కేల్ ఉద్యోగుల (కాంట్రాక్ట్)కు రాష్ట్ర ప్రభుత్వం ఊహించని షాక్ ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అధ్వర్యంలో గురువారం జరిగిన అన్ని విశ్వవిద్యాలయాల బడ్జెట్ కేటాయింపుల సన్నాహక సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. వారికి జీతాలను ప్రతి నెల ఆయా వర్సిటీలే చెల్లించేలా ఆదేశాలు జారీ చేశారు. దీంతో వివిధ వర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగుల భవిత అంధకారంలోకి వెళ్లింది. ప్రతి ఏటా రాష్ట్ర ప్రభుత్వం ... జీతాలు, పెన్షన్లు చెల్లించేందుకు యూనివర్సిటీలకు దీంతో పర్మినెంట్ ఉద్యోగులు, పెన్షనర్లకు ఎలా అయితే జీతాలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందో అదేవిధంగా టైం స్కేల్ ఉద్యోగులు కూడా చెల్లించేవారు. ఇదే విధానం గత 20 ఏళ్లుగా కొనసాగుతోంది. 28 రోజులు వేతనదారులు, కన్సాలిడేటెడ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వారికి మాత్రం ఆయా యూనివర్సిటీలే జీతభత్యాలు చెల్లిస్తున్నాయి. దీనికి భిన్నంగా ఈసారి బడ్జెట్ ఆమోదించే సమయంలో ఉన్నత విద్యా మండలి అధికారులు అన్ని వర్సిటీలకి చెందిన ఉన్నత అధికారుల వద్ద ఒక ప్రతిపాదన పెట్టారు. అప్పటికే బడ్జెట్ ప్రతిపాదనలు తీసుకువచ్చిన ఆయా యూనివర్సిటీలు ఆయా జాబితాలోంచి మినిమం టైం స్కేల్ ఉద్యోగుల చెల్లింపులను తొలగిస్తూ ఇచ్చిన ప్రతిపాదనలు ఆమోదించారు. వారికి ఆయా వర్సిటీలే జీతభత్యాలు చెల్లించాలని ఆదేశించారు. ఈ నిర్ణయం వర్సిటీలకు చాలా నష్టం చేకూరుతుందని, ఆర్థికంగా ఇబ్బందికరమని విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు చెప్పినప్పటికీ ఉన్నత విద్యా మండలి అధికారులు ఇది రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం అంటూ పట్టించుకోలేదు. దీంతో ఏం చేయాలో పాలుపోని స్థితిలో వర్సిటీ అధికారులు మిన్నకుండిపోయారు.

రాష్ట్రవ్యాప్తంగా 1993 తర్వాత ఎటువంటి శాశ్వత పద్ధతిలో ఉద్యోగుల నియామకం జరగలేదు. దీంతో అవసరమైన సిబ్బందిని ఆయా వర్సిటీలు కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించుకునేవి. ఆంధ్ర యూనివర్సిటీలో 28 రోజుల పనివారు, కన్సాలిడేటెడ్ పే, ఇతర కాంట్రాక్ట్ ఉద్యోగులు కాలానుగుణంగా ప్రభుత్వాల హామీ మేరకు మినిమం టైం స్కేల్ ఉద్యోగులుగా పదోన్నతి పొందారు. వీరికి ఇంక్రిమెంటు, పెన్షన్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ మినహా పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా ఇతర సదుపాయాలు పొందుతూ ఉద్యోగ భద్రత కలిగి ఉంటారు. గతంలో మినిమం టైమ్ స్కేల్ ఉద్యోగులను శాశ్వత ఉద్యోగులుగా మారుస్తూ జీవో విడుదల చేసింది. దీంతో మిగిలిన వారందరూ ఎప్పటికైనా ఉద్యోగాలు పర్మినెంట్ అవుతాయని ఆశతో ఎదురుచూస్తున్నారు. మినిమం టైమ్స్ స్కేల్ ఉద్యోగులు ఏయూలో 700 మంది పనిచేస్తుండగా, రాష్ట్రంలోని ఇతర అన్ని యూనివర్సిటీలు కలిపి మరో 700 మంది... మొత్తం 1400 మంది పనిచేస్తున్నారు. వీరి జీతాలకు ప్రతి నెల సుమారు రూ.4.20 కోట్లు ఖర్చు అవుతుంది. ఇప్పటివరకు ఈ జీతభత్యాలు రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించేది. ఇకపై యూనివర్సిటీలే చెల్లించుకోవాలనే నిర్ణయం తీసుకోవడంతో ఆర్థికంగా పెద్ద ప్రభావమే చూపుతుంది. ఇప్పటికే నిర్వహణ, తాత్కాలిక ఉద్యోగులకు జీతభత్యాలు, మౌలిక సదుపాయాలు... యూనివర్సిటీలకు ఆర్థిక ఇబ్బంది కలుగజేస్తుండగా... రాష్ట్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న నిర్ణయంతో వర్సిటీల మనుగడ పై పెద్ద ప్రభావం చూపనుంది. మినిమం టైమ్స్ స్కేల్ ఉద్యోగుల జీతాలు కూడా యూనివర్సిటీలు చెల్లించాలి అంటే ఇప్పటికీ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న విశ్వవిద్యాలయాలను మరింత సంక్షోభంలోకి నెట్టినట్టే. ఒకవేళ జీతాలు చెల్లించలేని పరిస్థితి వస్తే మినిమమ్ టైం స్కేల్ ఉద్యోగులను తొలగిస్తారా.. ఆర్థిక భారం నెత్తిన వేసుకొని వారిని కొనసాగిస్తారా అనే మీమాంస నెలకొని ఉంది. విద్య, పరిశోధనలను ప్రోత్సహించేందుకు విశ్వవిద్యాలయాలను అన్ని విధాల ఆదుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఈ తరహా నిర్ణయం తీసుకోవడంపై సర్వత్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బడ్జెట్‌లో ఏపీకి ప్రాధాన్యమివ్వండి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : వచ్చేనెల 1వ తేదీన ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రాధాన్యత కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు విజ్ఞప్తి చేశారు. దావోస్ ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు పర్యటన నుంచి నేరుగా శుక్రవారం అర్ధరాత్రి దిల్లీ చేరుకున్న ఆయన శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో నార్త్ బ్లాక్‌లోని ఆర్థిక శాఖ కార్యాలయంలో నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. దావోస్ నుంచే ఆర్థిక మంత్రి అపాయింట్‌మెంట్ తీసుకున్న సీఎం... కేంద్ర బడ్జెట్‌లో ఏపీ కేటాయింపులపై మాట్లాడారు. సుమారు 45 నిమిషాలపాటు కొనసాగిన ఈ భేటీలో రాష్ట్రానికి ఆర్థిక సహకారంపై ముఖ్యమంత్రి చర్చించారు. ఫిబ్రవరి 1న పార్లమెంటులో ఆర్థిక మంత్రి బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి దావోస్ తిరుగు ప్రయాణాన్ని కూడా సద్వినియోగం చేసుకున్నారు. ఇప్పటికే రాష్ట్రం తరపున అందజేసిన విజ్ఞప్తులను మరోసారి ఆమె ముందుంచారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీ అమలు, పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం నుంచి రావాల్సిన నిధుల గురించి ప్రస్తావించినట్లు సమాచారం. అలాగే అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు నిధులు ఇప్పటికే మంజూరైనందున, కేంద్ర బడ్జెట్‌లోనూ నిధుల కేటాయింపులో ప్రాధాన్యత ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. ప్రస్తుతం అమరావతి రాజధాని ఔటర్‌రింగ్ రోడ్డు, బనకచర్ల భారీ సాగునీటి ప్రాజెక్టు, విజయవాడ, విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టులతో పాటు విభజన అంశాల్లో పెండింగ్ వాటిని కూడా సీఎం ప్రస్తావించినట్లు తెలిసింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఏపీ తీవ్రంగా నష్టపోయినందున తమను కేంద్రమే ఆదుకోవాలని చంద్రబాబు కోరారు. సీఎం వెంట కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ పాల్గొన్నారు.

అనంతరం మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. అనంతరం అమరావతికి తిరుగు ప్రయాణమయ్యారు.

రాజకీయాలకు విజయసాయిరెడ్డి గుడ్‌బై

(మొదటిపేజీ తరువాయి)

భారతికి సదా కృతజ్ఞుడినని, జగన్‌కు మంచి జరగాలని కోరుకుంటున్నాని పేర్కొన్నారు. పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా, రాజ్యసభలో ఫ్లోర్ లీడర్‌గా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, పార్టీ, రాష్ట్ర ప్రయోజనాల కోసం చిత్తశుద్ధితో శక్తివంచన లేకుండా కృషి చేశానన్నారు. కేంద్రానికి, రాష్ట్రానికి మధ్య వారధిలా పనిచేశానని విజయసాయిరెడ్డి వివరించారు. దాదాపు తొమ్మిది సంవత్సరాలు ప్రోత్సహించి కొండంత బలాన్ని, మనోధైర్యాన్నిచ్చి తెలుగురాష్ట్రాల్లో తనకు గుర్తింపునిచ్చిన ప్రధాని మోదీకి, హోంమంత్రి అమిత్ షాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 'నా భవిష్యత్తు వ్యవసాయం. సుదీర్ఘ రాజకీయ ప్రయాణంలో ఆదరించిన నా రాష్ట్ర ప్రజలకు, మిత్రులకు, సహచరులకు, పార్టీ కార్యకర్తలకు పేరు పేరునా నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియచేసుకుంటున్నాను' అని విజయసాయిరెడ్డి ట్వీట్ చేశారు. వైసీపీలో టాప్‌లీడర్‌గా ఉన్న విజయసాయిరెడ్డి అకస్మాత్తుగా రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించడం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

రాజ్యసభలో ఏడుకు తగ్గిన వైసీపీ బలం

విజయసాయిరెడ్డి రాజీనామాతో రాజ్యసభలో వైసీపీకి బలం తగ్గుతోంది. 2024 ఎన్నికల సమయంలో వైసీపీకి 11 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు. ఇటీవలే వైసీపీ సభ్యత్వానికి, రాజ్యసభకు ముగ్గురు రాజీనామా చేశారు. ఆర్.కృష్ణయ్య, మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్‌రావు తమ పదవులు వదులుకున్నారు. ఇప్పుడు రాజీనామా బాటలో విజయసాయిరెడ్డి ఉన్నారు. దీంతో వైసీపీ బలం ఏడుకు పడిపోతుంది.

అయోధ్య రామిరెడ్డి కూడా రాజీనామా చేస్తారంటూ ప్రచారం జరుగుతోంది. ఆయన కూడా రాజీనామా చేస్తే వైసీపీ సంఖ్య ఆరుకే పరిమితమవుతుంది. వాళ్లిద్దరు రాజీనామా చేస్తే కూటమి పార్టీలకే రాజ్యసభ సీట్లు దక్కనున్నాయి.

ఫీజులు గుంజేద్దాం

పరీక్షల ముందే కార్పొరేట్ యాజమాన్యాల బరితెగింపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఇంటర్మీడియట్ విద్యార్థుల ఫీజులన్నీ ముందే గుంజేద్దామన్న లక్ష్యంతో కార్పొరేట్/ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరును తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు తూర్పారబడుతున్నాయి. మార్చి ఒకటో తేదీ నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానుండడంతో ఇటీవల ఫీజుల ఒత్తిళ్లు మరింతగా పెరిగాయి. ఇంటర్, జేఈఈ, ఏపీఈఏపీసెట్‌కు నిర్వహించే వారంతరపు పరీక్షల్లో మార్కులు సరిగ్గా లేని వారిని విభజిస్తున్నారు. ఎగువ తరగతిలో ఉన్న వారిని దిగుకు ఇష్టానుసారంగా మార్చేస్తున్నారు. ర్యాంకులు, మార్కులే లక్ష్యంగా డబ్బులు వెచ్చించి కార్పొరేట్ కళాశాలల్లో తమ పిల్లలను తల్లిదండ్రులు చేర్పిస్తున్నారు. ఫీజుల చెల్లింపులు, మార్కులు, ర్యాంకుల వ్యత్యాసం ఒత్తిళ్లను విద్యార్థులు భరించలేక తల్లడిల్లిపోతున్నారు. ఇటీవల కృష్ణాజిల్లా పోరంకిలో ఫీజు చెల్లించలేదన్న నెపంతో అర్ధరాత్రి విద్యార్థిని గేటు బయటకు గెంటేసిన సంఘటన మరువకముందే... అనంతపురంలో మరో విద్యార్థి కళాశాల భవనం నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ రెండు సంఘటనలూ పేరొందిన కార్పొరేట్ యాజమాన్యం కళాశాలలో వెలుగు చూశాయి. దీనిపై ప్రభుత్వం ఇంతవరకూ చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థుల ట్యూషన్/హాస్టల్ ఫీజులను డిసెంబరు నుంచి జనవరి 15లోగా 100 శాతం వసూలు చేయాలన్న లక్ష్యంతో యాజమాన్యం ఉంది. వాస్తవంగా ప్రతేటా విద్యా సంవత్సరం జూన్ నుంచి ఏప్రిల్ వరకు ఉంటుంది. కార్పొరేట్ యాజమాన్య కళాశాలల్లో మాత్రమే మే నుంచే తరగతులు ప్రారంభించడం, జులై, ఆగస్టు వచ్చే సరికి 50శాతం లక్ష్యంతో ఫీజులు వసూలు చేసేశారు. ఆ దిశగా డిసెంబరు నాటికే 100 శాతం ఫీజులు చెల్లించాలన్న ఒత్తిళ్లు విద్యార్థులపై నెడుతున్నారు. అప్పటికీ కొంత పూర్తికాకుంటే జనవరి 15 వరకూ గడువిస్తున్నారు. ఆలోగా చెల్లించని వారిపై ఒత్తిళ్లు పెరిగిపోతున్నాయి. తాజాగా విజయవాడ సమీపాన గోసాల చైతన్య జూనియర్ కళాశాలలో ఫీజులు చెల్లించలేదన్న నెపంతో అర్ధరాత్రి విద్యార్థిని గేటు బయటకు గెంటేసిన సంఘటన తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. సామాజిక మాధ్యమంలోనూ గేటు బయట విద్యార్థి పడిగాపులు కాస్తున్న దృశ్యాలు దయనీయంగా మారాయి. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆబోతు టార్జాన్ కుమారుడు గౌతమ్...విజయవాడ సమీపంలోని గోసాల శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకి ఇంటికి వెళ్లిన గౌతమ్ ఆదివారం రాత్రి తన తండ్రితో కలసి కళాశాలకు తిరిగి వచ్చాడు. యాజమాన్యం మాత్రం ఫీజు చెల్లిస్తేనే లోనికి అనుమతిస్తామని తెగేసి చెప్పింది. దీంతో గౌతమ్ తండ్రి టార్జాన్ తన వద్ద ఉన్న రూ.20 వేలు నగదును ఫీజు కింద చెల్లించి..మిగిలిన రూ.50 వేల చెల్లింపునకు కొంత సమయం ఇవ్వాలని కళాశాల సిబ్బందిని బతిమలాడారు. అందుకు ససేమిరా అన్న యాజమాన్యం విద్యార్థిని కళాశాల నుంచి బయటకు పంపించేసి, గేట్లు మూసి వేసింది. దీంతో విద్యార్థి, అతని తండ్రి నిరసనగా అర్ధరాత్రి కళాశాల గేటు వద్దే కూర్చుని ఆందోళన చేశారు. ఇది మరువకముందే అనంతపురం జిల్లాలో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య హృదయ విదారకంగా నిలిచింది. ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న చరణ్ ఉన్న పళంగా తరగతి గది నుంచి బయటకు వచ్చి... అంతా చూస్తుండగానే మూడో అంతస్తు రెయిలింగ్ నుంచి కిందకు దూకగా... తీవ్రంగా గాయపడ్డ అతడిని ఆసుపత్రికి తరలిస్తుండగానే మార్గం మధ్యలోనే ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాలు కళాశాల ఎదుట ఆందోళన చేపట్టాయి. నారాయణ కళాశాలకు చెందిన విద్యార్థి ఉదయం 10.15 గంటల సమయంలో అకస్మాత్తుగా తరగతి మధ్యలో బయటకు వచ్చి ఈ చర్యకు దిగాడు. ఈ సంఘటనలోనూ ఫీజుల చెల్లింపు ఒత్తిడి తట్టుకోలేక విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ సంఘటనలపై తక్షణమే సమగ్ర విచారణకు ఆదేశించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇంటర్ వార్షిక పరీక్షలకు ముందు మొత్తం ఫీజు చెల్లించలేదన్న నెపంతో విద్యార్థుల హాల్ టికెట్లు నిలిపివేసే యాజమాన్య నిర్ణయాలపై తక్షణమే చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఇస్రో శత ప్రయోగానికి శ్రీకారం

(మొదటిపేజీ తరువాయి)

నుంచి 1500 కిలోమీటర్ల వరకు నావిగేషన్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువస్తుంది. ఈ 100వ ప్రయోగాన్ని ప్రత్యేకంగా వీక్షించడానికి ప్రజలు తమ పేర్లను నమోదు చేసుకునేందుకు ఇస్రో అవకాశం కల్పిస్తోంది. ఆన్ లైన్ ద్వారా నమోదు చేసుకోవడానికి గూగుల్‌లోకి వెళ్లి షార్ వెబ్ సైట్ లింకును క్లిక్ చేసి నమోదుకు అనుమతి పొందవచ్చని తెలిపింది.

గణతంత్ర వేడుకలకు భారీ భద్రత

(మొదటిపేజీ తరువాయి)

(ఎఫ్ఆర్ఎస్) కలిగిన వాటితో సహా వేలాది సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు' అని వివరించారు. అదనంగా ఎఫ్ఆర్ఎస్ వ్యవస్థలతో కూడిన వాహనాలను కూడా మోహరించనున్నట్లు అధికారి తెలిపారు. ఈ కెమెరాలు నేరస్తులను తక్షణమే గుర్తించడానికి డేటాబేస్‌కు అనుసంధానించబడి ఉన్నాయని ఉన్నాయన్నారు. 'ఏ పరిస్థితినైనా నిర్వహించడానికి దిల్లీ పోలీసులు పూర్తిగా సిద్ధంగా ఉన్నారు' అని పేర్కొన్నారు. రాజధానిలో పారామిలిటరీ దళాలు, పోలీసు సిబ్బందిని మోహరించడంతో పటిష్టమైన భద్రతను నిర్ధారిస్తూ, బహుళ భద్రతా సంస్థల సమన్వయంతో పోలీసు బృందాలు మాక్ డ్రిల్‌లను నిర్వహిస్తున్నాయి. జిల్లా డీసీపీలకు భద్రతా ఏర్పాట్లపై పూర్తిగా వివరించడం జరిగిందని, పోలీసు అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండి... ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే నివేదిస్తారని అధికారి తెలిపారు. భద్రతా చర్యలలో భాగంగా న్యూదిల్లీ ఉత్తర, మధ్య జిల్లాల్లో సుమారు 4 వేల రూఫ్‌టాప్ భద్రతా పాయింట్లను గుర్తించినట్లు మరొక అధికారి చెప్పారు. గణతంత్ర వేడుకలకు హాజరయ్యేవారికి భద్రతా స్టిక్కర్లు ఇస్తారు.

కవాతు మార్గం, పరిసర ప్రాంతాలలో ఎఫ్ఆర్ఎస్‌తో కూడిన దాదాపు 500 హై-రిజల్యూషన్ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు

తెలంగాణ ప్రభుత్వంతో జెఎస్‌డబ్ల్యూ డిఫెన్స్ ఒప్పందం

విశాలాంధ్ర/హైదరాబాద్: మానవ రహిత వైమానిక వ్యవస్థలను తయారు చేయటానికి జెఎస్ డబ్ల్యూ లిమిటెడ్‌తో, తెలంగాణ ప్రభుత్వం ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఈ వ్యూహాత్మక కార్యక్రమంలో భాగంగా, అమెరికాకు చెందిన ప్రముఖ రక్షణ సాంకేతిక సంస్థతో సాంకేతిక ఒప్పందం ద్వారా ఈ ప్రాజెక్టులో సుమారు రూ. 800 కోట్లు జెఎస్‌డబ్ల్యు, యుఏవీలో పెట్టుబడి పెట్టనుందన్నారు. దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉన్నతాధికారులు, జెఎస్‌డబ్ల్యు గ్రూప్‌కు చెందిన పార్థ్ జిందాల్ సమక్షంలో ఈ అవగాహన ఒప్పందంపై సంతకాలు జరిగాయన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, 'హైదరాబాద్, తెలంగాణ చాలా కాలంగా ప్రపంచ మార్కెట్‌లో సాఫ్ట్‌వేర్ ఫార్మా లీడర్‌గా స్థానం సంపాదించుకున్నాయన్నారు. అన్ని రంగాల తయారీలో పెట్టుబడుల కోసం స్పష్టమైన నాయకుడిగా మేము ఇప్పుడు తెలంగాణను తీర్చిదిద్దుతున్నామన్నారు. జెఎస్‌డబ్ల్యు గ్రూప్‌కు చెందిన పార్థ్ జిందాల్ మాట్లాడుతూ, భారతదేశంలో రక్షణ సాంకేతికతను స్వదేశీకరించడంలో కీలక పాత్ర పోషించాలనే తమ అచంచలమైన నిబద్ధతను ఈ అవగాహన ఒప్పందం నొక్కి చెబుతుందన్నారు.

ప్రజల పక్షాన నిలిచే పత్రిక విశాలాంధ్ర

విశాలాంధ్ర - గార్ల : అంతరాలు లేని సమాజం కోసం, బాధిత ప్రజల హక్కుల కోసం దశాబ్దాల నుంచి పాటుపడుతున్న ఏకైక జాతీయ పత్రిక విశాలాంధ్ర అని గార్ల -బయ్యారం సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. రవికుమార్ అన్నారు. అభ్యుదయ రచయితల, పాత్రికేయుల సారధ్యం లో నడిచే విశాలాంధ్ర పేద, బడుగు, బలహీన వర్గాల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లడంలో దీని పాత్ర వెలకట్టలేనిదన్నారు. శుక్రవారం బయ్యారం పోలీస్ స్టేషన్‌లో విశాలాంధ్ర క్యాలెండర్ రవికుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏడున్నర దశాబ్దాల కాలంగా ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా వుంటూ అనేక ప్రజా ఉద్యమాలకు ఈ పత్రిక వేదికగా మారిందన్నారు. సమాజంలో సమతుల్యం కోసం పాటుపడుతూ నిత్య నూతన కథనాలతో జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్రాల ప్రజా సమస్యలే పరిష్కార లక్ష్యంగా విధాలాంధ్ర పాత్రికేయులు కట్టుబడి ఉండటాన్ని సిఐ అభినందించారు. వివిధ మీడియా జర్నలిస్టులు ఎం. సురేష్, జనార్దన్, శ్రీకాంత్, థామస్, అజయ్, శివ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింలకు కాంగ్రెస్ పార్టీ అండ

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : గడచిన అసెంబ్లీ ఎన్నికల్లో ముస్లిం మైనారిటీలు ఏకపక్షంగా కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచారని పార్టీ విజయం సాధించడంలో కీలక పాత్ర వహించాలని ఫారెస్ట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పొడెం వీరయ్య అన్నారు. దేశంలో మైనార్టీ వర్గాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. తమ ప్రభుత్వం ముస్లిం మైనారిటీల అభివృద్ధి కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. శుక్రవారం కొత్తగూడెంలోని శ్రీనగర్ కాలనీ మెయిన్ రోడ్ లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనారిటీ జిల్లా విభాగం నూతన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. వీరయ్య మాట్లాడుతూ త్వరలో జరగబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఐక్యంగా పనిచే మెజారిటీ స్థానాలు గెలుచుకోవా లని కోరారు. రాష్ట్ర మైనారిటీ నాయకులు నయీమ్ ఖురేషి, టీపీసీసీ సభ్యులు నాగ సీతారాములు, మాజీ జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర రావు, డిసిసిబి చైర్మన్ కొత్వలా శ్రీనివాస్, ఎస్సి సెల్ జిల్లా అధ్యక్షులు చింత్రాల రవికుమాత, ఓబీసీ జిల్లా అధ్యక్షులు నర్సింహారావు, మహిళ జిల్లా అధ్యక్షులు దేవి ప్రసన్న, వైస్ ప్రెసిడెంట్ కరీం పాషా, కార్యదర్శి గౌస్ పాషా, పాల్వంచ అధ్యక్షులు నూకల రంగా రావు, ఏఐటీయూసీ నేత జలీల్, దొడ్డ ధనియాలు, అహ్మద్, సర్దార్, బషీరిద్దీన్, సుభాని, మాసూద్, జానీ, గోరె బాబు, అక్బర్, ఖమర్ భాయ్, అయూబ్ పాల్గొన్నారు.

అర్హులను అనర్హులుగా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - చర్ల : మేజర్ గ్రామ పంచాయతీలు మండల కేంద్రమైన చర్లలో అర్హులను జాబితాలో లేకుండా చేసి అర్హత లేని వారిని ఎంపిక చేసిన సర్వే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత ప్రజలు డిమాండ్ చేసారు. శుక్రవారం చర్లలో ప్రజా గ్రామసభ నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీడీఓ హాజరై లబ్ధిదారుల జాబితా ప్రకటించటంతో గందరగోళం ఏర్పడింది. అర్హుల పేర్లు అందులో లేకపోవడంతో బాధితుల ఆగ్రహ వేషాలు కట్టలు తెంచుకున్నాయి. ఆశతో ఇంతకాలం ఎదురు చూశారు. తీరా గ్రామసభలో రైతు భరోసా, ఇందిరమ్మఇళ్ళు, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ సమ్మేళన పథకాలు తమకు వస్తాయనుకున్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లతో పాటు ఇందిరమ్మ భరోసా పై నమ్మకం పెట్టుకున్నారు. జాబితాలో అర్హుల పేరు లేకపోవడంతో అధికారులపై గొడవకు దిగారు. వీరికి మద్దతుగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి మచ్చ రామారావు, బిఆర్ఎస్ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు నిలిచి అధికారులను నిలేశారు. దీంతో మళ్లీ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సర్వే చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

మున్నేరు రిటైనింగ్ వాల్ పనులు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - ఖమ్మం : మున్నేరు నది కిరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించేందుకు అవసరమైన భూ సేకరణ, నిర్మాణ పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో కలిసి మున్నేరు రిటైనింగ్ వాల్ కొరకు భూసేకరణ పురోగతి, జరుగుతున్న రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులను పరిశీలించారు. వచ్చే వానాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని జూలై నెలలోపు ఎట్టి పరిస్థితులలోనూ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిర్మాణంలో ఉపయోగించే సిమెంట్, ఐరన్, కాంక్రీట్, మెటీరియల్, వాల్ క్యూరింగ్ విషయాలలో పాటించాల్సిన జాగ్రత్తలను కలెక్టర్ అధికారులకు, గుత్తేదారులకు వివరించారు. ఇరిగేషన్ ఎస్ఇ యం. వెంకటేశ్వర్లు, ఇఇ అనన్య, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ రవికుమార్, ఆర్.ఐ. వహీద్, అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం : కలెక్టర్

విశాలాంధ్ర - కొమరం భీం : అర్హులైన అందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు అధికా రుల సమన్వయంతో కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లాలోని వాంకిడి మండలం జైత్‌పూర్ గ్రామంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల జాబితాలపై నిర్వహించిన ప్రజా పాలన గ్రామసభలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్ తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించేందుకు అధికారుల సమన్వయం తో కృషి చేస్తామని, ప్రజావాణి కార్యక్రమాలలో అందిన దరఖాస్తులను క్రోడీకరించి ఇంటింటా సర్వే, గ్రామాలలో సర్వే నిర్వహించి జాబితాలను రూపొందించడం జరిగిందన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం క్రింద అర్హులైన నిరుపేదలు, వ్యవసాయ కూలీలు, జాతీయ గ్రామీణ ఉపాధీ హామీ పథకంలో 20 రోజులు పని చేసిన భూమి లేని వారందరికీ పథకం వర్తిస్తుందని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేశారు. స్థానిక ఎస్సై ముత్యాల రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం 5 గంటలకు పోలేపల్లి వాగు నుండి కొండ మల్లేపల్లి కి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక లోడుతో వస్తున్న రెండు ట్రాక్టర్లని పట్టుకొని కేసు నమోదు చేయడం జరిగింది ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారి పైన చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని ఎస్ఐ తెలిపారు.

చిన్న జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలి

మంత్రులు కొండా సురేఖ, సీతక్క

విశాలాంధ్ర - ములుగు జిల్లా బ్యూరో : ఫిబ్రవరి 12 నుండి 15 వరకు జరిగే మినీ మేడారం జాతరపై సంబంధిత అధికారులు చిన్న చూపు వద్దని, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని పర్యావరణ, అటవీ, దేవాదాయ ధర్మాదాయ శాఖ కొండా సురేఖ, పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం మంత్రలు కొండ సురేఖ, సీతక్కలు మేడారంలోని సమ్మక్క సారలమ్మలను దర్శించుకున్నారు. అనంతరం రానున్న శ్రీ మేడారం సమక్క సారలమ్మ చిన్న జాతరకు పురస్కరించుకొని పర్యావరణ, అటవీ, దేవాదాయ ధర్మాదాయ శాఖ కొండా సురేఖ, పంచాయితి రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తాడ్వాయి ఐటి డి ఏ గెస్ట్ హౌస్‌లో దేవాదాయ శాఖ కమిషనర్ ఈ. శ్రీధర్, జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్, ఎస్పీ శభరీష్, ఐటీడీఏ పిఓ చిత్ర మిశ్రా, జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ లతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ మినీ మేడం జాతరకు దాదాపు 40 భక్తులు అమ్మ వాళ్ళను దర్శించుకునే అవకాశం ఉందని, అమ్మ వాళ్ళని దర్శించుకున్న సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అంగరంగ వైభవంగా జరిగే మినీ మేడం జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ మినీ మేడం జాతర అన్ని చిన్నచూపుకు చూడకుండా అన్ని శాఖల అధికారులు భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో నిమగ్నం కావాలని సూచించారు. ముఖ్యంగా పారిశుధ్య పనులు, గద్దెల ప్రాంతంలో భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు, నిరంతరం విద్యుత్ సరఫరా, త్రాగునీరు సరఫరా చేయాలని అన్నారు. మహా జాతర సందర్భంగా జరిగిన చిన్న చిన్న సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. ఈ సమావేశం లో ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి, అసిస్టెంట్ కమిషనర్ సునీత, ఈ ఓ రాజేందర్, పూజారుల సంఘం అధ్యక్షులుసిద్ద బోయిన జగ్గరావు, ఇంజనీరింగ్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఐటిడిఏ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నుంచి ప్రజలను అప్రమత్తం చేయాలి : ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : నేటి శాంకేతిక సమాజంలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయని వాటి నుంచి ప్రజలను నిత్యం అప్రమత్తం చేస్తూ ఉండాలని ఎస్పీ రోహిత్ రాజు పోలీసులు ఆదేశించారు. శుక్రవారం చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వివిధ సమస్యలతో వచ్చే బాధితులకు న్యాయం చేసేలా బాధ్యతగా మెలగాలన్నారు. స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ పోలీస్ స్టేషన్ పైన ఉన్న డిస్ట్రిక్ట్ సైబర్ క్రైమ్స్ కో-ఆర్డినేషన్ సెంటర్ ను సందర్శించారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో నమోదైన సైబర్ నేరాల వివరాలను, కేసుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు, సైబర్‌క్రైమ్స్ ఇన్స్పెక్టర్ జితేందర్, ఎస్సైలు రవి,జుబేదాబేగం పాల్గొన్నారు.

సంపాదకీయం

యోగీ విషవమనం

యోగి ఆదిత్యనాథ్ అంటే సంచలనం. యోగీ ఆదిత్యనాథ్ అంటే హిందూ ముస్లిం. యోగీ ఆదిత్యనాథ్ అంటే 80:20. యోగీ ఆదిత్యనాథ్ అంటే ముస్లింలపై అపారమైన విద్వేషం. ఆ యోగీ ఆదిత్యనాథ్ ఢిల్లీ శాసనసభ ఎన్నికల ప్రచారంలోకి దూకారు. ఆయన అయిదురోజులు ప్రచారం చేస్తారట. ఢిల్లీ శాసనసభ ఎన్నికలలో ఈ సారి ముక్కోణపు పోటీ ఉండబోతోంది. మూడుసార్లు వరసగా విజయం సాధించిన ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు అరవింద్ కేజ్రీవాల్ అధికారం నిలబెట్టుకోవడానికి తంటాలు పడుతున్నారు. ఆయనకు నిర్దిష్టమైన రాజకీయ సిద్ధాంతం ఏమీ లేదు. సాధారణంగా ఏ ప్రాంతీయ పార్టీకీ నిర్దిష్ట రాజకీయ సిద్ధాంతం కనిపించదు. అరవింద్ కేజ్రీవాల్ తాను చేసిన పనులను చూసి ఓటు వేయమంటున్నారు. ఆయన జైలులో ఉన్నప్పుడూ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయలేదు. విడుదలైన తరవాత రాజీనామా చేసి ఆతిశీని ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోబెట్టారు. మళ్లీ ప్రజల ఆమోదం పొందిన తరవాతే ముఖ్యమంత్రి పదవి స్వీకరిస్తానని ప్రతిజ్ఞ చేశారు. కేజ్రీవాల్ అధికారంలో ఉన్న సమయంలో ప్రజానుకూలమైన కొన్ని పనులు జరిగిన మాట నిజమే. బస్తీ దవాఖానాలు, విద్యాసంస్థలలో సానుకూలమైన సంస్కరణలు ఆయనకు మంచి పేరే తెచ్చాయి. ఆయన 2011లో అన్నా హజారే నాయకత్వంలో అవినీతి వ్యతిరేక పోరాటం ఆసరాగా రాజకీయాల్లోకి ప్రవేశించారు. నిజాయితీపరుడు అన్న కీర్తి ఆయనకు అధికారం సంపాదించిపెట్టింది. అధికారం చేపట్టే సమయంలో ఆయన ముఖ్యమంత్రికి అధికారికంగా ఉండే నివాసం స్వీకరించబోనని, ప్రభుత్వ వాహనం కూడా వాడబోనని శపథం చేశారు. కానీ ఈ శపథం మూణ్నాళ్ల ముచ్చటే అయింది. ఇప్పుడు కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి "శీష్ మహల్" నిర్మిస్తున్నారు. ఇందులో ఈతకొలను లాంటి వసతులు ఉన్నాయన్న ఆరోపణలు వచ్చాయి. దీని మీద వివాదం చెలరేగినప్పుడు ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు శీష్ మహల్‌లో ఎలాంటి వసతులున్నాయో, ప్రధానమంత్రి నివాసంలో ఎలాంటి వసతులున్నాయో పరిశీలించడానికి మూకుమ్మడిగా ప్రయత్నించారు. అయితే భద్రతా సిబ్బంది ఈ రెండిళ్లను పరిశీలించే అవకాశం ఇవ్వలేదు. కాని అది ఆమ్ ఆద్మీ "నిరాడంబరత"ను చాటుకోవడానికి ఉపకరించింది. కేజ్రీవాల్ మద్యం కేసులో ఇరుక్కున్నారు. ఆయనతో సహా మరో ముగ్గురు మంత్రులూ జైలు శిక్ష అనుభవించారు. ఆ కేసులు మాసి పోలేదు కానీ అందరూ బెయిలు మీద విడుదలయ్యారు. కేజ్రీవాల్, ఆయన అనుచరుల మీద వచ్చిన మద్యం కుంభకోణం చివరకు ఎలా తేలుతుందో లేదో ఇప్పటికైతే తెలియదు కానీ ఆమ్ ఆద్మీ పార్టీ కూడా పత్తిత్తు కాదనే అభిప్రాయం సర్వత్రా వ్యాపించింది. వచ్చే నెల అయిదవ తేదీన జరగనున్న శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రస్తుతం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల కొనసాగింపుతోపాటు అనేక కొత్త వాగ్దానాలు చేసింది. సంక్షేమ కార్యక్రమాలను ప్రధానమంత్రి మోదీ రేవడీలు (తాయిలాలు) అని ఎగతాళి చేస్తారు. కానీ బీజేపీ కూడా ఢిల్లీ ఎన్నికల సందర్భంలో అనేక సంక్షేమ పథకాలు ప్రకటించింది. మోదీ దృష్టిలో ప్రతిపక్షాలు అమలు చేసే సంక్షేమ కార్యక్రమాలే తాయిలాలుగా కనిపిస్తాయి. అలాంటి పథకాలే అమలు చేస్తామని బీజేపీ చేసిన వాగ్దానాలు మాత్రం తాయిలాల కిందకు రావు. మహిళలను ఆకట్టుకోవడానికి కేజ్రీవాల్ ప్రతి నెలా వారి బ్యాంకు ఖాతాలో 2100 రూపాయలు వేస్తామని హామీ ఇస్తే తాము అధికారంలోకి వస్తే మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామని బీజేపీ ప్రకటించింది. ఎన్నికల సమయంలో వాగ్దానాల వరద సర్వసామాన్యమైందే. గత సంవత్సరం జరిగిన లోక్‌సభ ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీ, కాంగ్రెస్ ఉమ్మడిగా పోటీ చేసినప్పటికీ ఢిల్లీలోని ఏడు లోకసభ సీట్లూ బీజేపీ దక్కించుకుంది. కానీ శాసన సభ ఎన్నికలదగ్గరకొచ్చే సరికి ఆమ్ ఆద్మీ పార్టీ 54 శాతం ఓట్లు సంపాదిస్తోంది. మహిళల మద్దతుతో పాటు కేజ్రీవాల్‌కు పూర్వాంచల్‌ల మద్దతూ ఉంది. పూర్వాంచలీలు అంటే ఉత్తరప్రదేశ్, ముఖ్యంగా ఉత్తర ప్రదేశ్ తూర్పు ప్రాంతం వారూ, బీహారీలు. వీరందరూ పొట్టకూటి కోసం ఢిల్లీ వచ్చిన వారు. వీరి ఓట్లు 35 నుంచి 40 శాతం దాకా ఉంటాయి. వారి మద్దతు సంపూర్ణంగా కేజ్రీవాల్‌కే ఉంది. ఈ లెక్కన కేజ్రీవాల్ విజయానికి ఏ ఆటంకమూ ఉండకూడదు. ప్రధానమైన పోటీ బీజేపీ-ఆమ్ ఆద్మీ పార్టీ మధ్యే ఉన్నా కాంగ్రెస్ కూడా పోటీలో ఉంది. ఇంతవరకు ముస్లింల మద్దతు కేజ్రీవాల్‌కే ఉంది. కానీ కాంగ్రెస్ రంగంలో ఉండడంతో ముస్లింల ఓట్లు కొంత శాతం కాంగ్రెస్‌కు పడొచ్చు. ఇది ఆమ్ ఆద్మీ పార్టీకే నష్టం. మహిళల ఓట్లలో కొన్నయినా బీజేపీ సంగ్రహించవచ్చు. హర్యానా, మహారాష్ట్ర ఎన్నికలలో మహిళలు బీజేపీకే మద్దతు ఇచ్చారు.

ఆమ్ ఆద్మీ పార్టీ లోక్‌సభ ఎన్నికలలో తెల్లమొహం వేసి ఉండొచ్చు. 2014, 2019 ఎన్నికలలోనూ లోక్‌సభలో విజయం బీజేపీనే వరించింది. అంటే ఢిల్లీ ప్రజలు లోక్‌సభ ఎన్నికలలో బీజేపీని, శాసనసభ ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీని సమర్థిస్తున్నారు. ఈ ధోరణి అనేక రాష్ట్రాలలో కనిపిస్తోంది. ఎన్నికల ప్రచారంలో ఆమ్ ఆద్మీ పార్టీ పూర్తిగా కేజ్రీవాల్ మీద ఆధారపడవలసిందే. బీజేపీ తరఫున మోదీ కూడా ప్రచారంలోకి దిగవచ్చు. కానీ యోగీ ఆదిత్యనాథ్ ప్రచారంలోకి దూకడంతో కొంత సంచలనం కలిగించక తప్పదు. యోగీ ఆదిత్యనాథ్ ప్రచారం నికార్సైన అబద్ధాలతో మొదలైంది. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుల ఇళ్లల్లో నకిలీ ఆధార్ కార్డులు తయారు చేసే యంత్రాలు ఉన్నాయంటున్నారు. అదే నిజమైతే ఢిల్లీలో శాంతిభద్రతలు కేంద్రం అధీనంలోనే ఉన్నాయి కనక అలాంటి చోట్ల దాడులు ఎందుకు చేయలేదు. ఆధార్ కార్డులు తయారు చేసే పరికరాలు ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుల ఇళ్లల్లో ఉన్నాయని యోగీ చెప్పింది అసత్యమే అయినా ఆయన అసలు గురి ముస్లింల మీద. రోహింగ్యాల మీద. ఓటు బ్యాంకు సృష్టించడానికి ఆమ్ ఆద్మీ పార్టీ ముస్లింలను, రోహింగ్యాలను చేరదీస్తోందని దుష్ప్రచారం చేయడం యోగీ ఆదిత్యనాథ్ అంతరార్థం. ముస్లింలను ద్వేషించడంలో భాగంగా బీజేపీ వారిని తీవ్రవాదులని, పాకిస్థాన్ అనుకూలురని ప్రచారం చేస్తూనే ఉంటుంది. యోగీ ఆదిత్యనాథ్ ప్రచార సరళి చూస్తే కేజ్రీవాల్ హయాంలో జరిగిన మంచిపనులను కాదనడానికి బీజేపీకి ఎంత మాత్రం శక్తి లేదు. మిగిలిందల్లా బీజేపీకి బాగా అలవాటైన ముస్లింల మీద విద్వేషమే. ఈ ఆయుధాన్ని యోగీ ఆదిత్యనాథ్ ఎడా పెడా ఉపయోగించగలరు. మధ్యతరగతి ప్రజలు సాధారణంగా బీజేపీనే సమర్థిస్తుంటారు. వారిని ఆకర్షించడం కోసం కేజ్రీవాలు తల చుట్టూ తిప్పి ముక్కు పట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. మధ్య తరగతి వారికోసం కేంద్ర ప్రభుత్వం ఏమేం చేయాలో పెద్ద జాబితా విడుదల చేశారు. అంటే ఆయన బంతిని బీజేపీ కోర్టులోకి తోసేశారు. ఢిల్లీలో వాతావరణాన్ని కలుషితం చేయడానికి యోగీ ఆదిత్యనాథ్ టన్నుల కొద్దీ విషం మోసుకొచ్చారు.

శ్రమజీవుల 'ప్రజా రిపబ్లిక్' ఉద్యమం

డి వి వి యస్ వర్మ

1950 జనవరి 26న రాజ్యాంగం అమలులోకి వచ్చింది. దేశం రిపబ్లిక్‌గా అవతరించింది. నాటి నుండి ప్రభుత్వ పరంగా రిపబ్లిక్ దినోత్సవాలు జరుగుతున్నాయి. అవి ప్రభుత్వ శాఖలు, సంస్థలకే పరిమితమై ప్రజల భాగస్వామ్యం లేకుండా సాగిపోతున్నాయి. రాజ్యాంగం మనందరిదీ. మనకు మనమే సమర్పించుకున్న రాజ్యాంగం. ఈ రాజ్యాంగానికి మనమే యజమానులం. దేశంలో అత్యధిక సంఖ్యాకులు శ్రమజీవులు. పరిశ్రమలలో కార్మికులుగా, అసంఘటితరంగ శ్రామికులుగా, వృత్తి సంఘాల సభ్యులుగా, వ్యవసాయకూలీలుగా, కౌలు రైతులుగా, స్వయంగా సాగు చేస్తున్న రైతులుగా అనేక రంగాల్లో వున్నారు. అలాగే వివిధ రంగాల్లో సమాజానికి సేవలు అందిస్తున్న వారు వున్నారు. దేశ సంపద ఉత్పత్తిలో ఈ శ్రమజీవులే కీలక పాత్ర పోషిస్తున్నారు. దేశంలో అన్ని రంగాలకు శిరోధార్యంగా వున్న రాజ్యాంగ కార్యకలాపాల్లో ప్రజల భాగస్వామ్యం వుండితీరాలి. అలాంటి భాగస్వామ్యాన్ని మనకు మనమే కల్పించుకోవాలి. ప్రజా రిపబ్లిక్ దినోత్సవం మనకోసం మనమే నిర్వహించుకోవాలి.

ఆర్థిక రంగంలో సంపద సృష్టిలో కీలక పాత్ర పోషిస్తున్న సకల రంగాల శ్రమజీవులు రాజకీయ రంగంలో కేవలం ఓటర్లుగానే మిగిలి పోకూడదు. రాజ్యాంగం మీద రాజకీయంగా జరుగుతున్న దాడిని రాజకీయంగా ప్రతిఘటించడానికి సిద్ధపడాలి. కేంద్రంలో అధికారంలో వున్న మోదీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని బలహీనపరిచి, దానిని మార్చడానికి అడుగులు వేస్తున్నది. మోదీ ఎలాంటి దాపరికం లేకుండా తనకు తాను హిందూ జాతీయవాదినని ప్రకటించుకున్నారు. మెజారిటీ జాతీయవాదానికి వీలుగా పౌరసత్వ చట్టాలను తెచ్చారు. మత విద్వేష రాజకీయాలు చేస్తున్నారు.

బీజేపీ మాతృసంస్థ ఆర్ ఎస్ ఎస్ బహిరంగంగానే రాజ్యాంగాన్ని సవాలు చేస్తున్నది. హిందూ రాష్ట్ర నినాదం త్వరలోనే సాకారం కానున్నదని ప్రకటించింది. భారత రాజ్యాంగం పట్ల ఆర్ ఎస్ ఎస్ వైఖరి అందరికీ తెలిసిందే. రాజ్యాంగం ఆమోదించినప్పుడే వారు వ్యతిరేకించారు. ఇది అతుకుల బొంత రాజ్యాంగం అన్నారు. దీనిలో జాతీయత లేదన్నారు. అంతటితో సరిపెట్టుకో లేదు. ప్రపంచ ప్రశంసలు పొందిన మనుధర్మ శాస్త్రమే దేశానికి తగిన రాజ్యాంగం అని ప్రకటించారు. ఇప్పుడు జరుగుతున్నది రాజ్యాంగానికి, ఆర్‌ఎస్‌ఎస్ హిందూ రాష్ట్ర నినాదానికి మధ్య సంఘర్షణ. రాజ్యాంగాన్ని మట్టు పెట్టాలనే ఈ సంఘర్షణలో శ్రమజీవులు పాత్రధారులు కావాలి.

ఆర్‌ఎస్‌ఎస్ హిందూ రాష్ట్ర నినాదం దేశాన్ని మత రాజ్యంగా మారుస్తుంది. మత రాజ్యాలలో రాజ్యాంగాలు వుండవు. మత గ్రంథాలే రాజ్యాంగం పాత్ర నిర్వహిస్తాయి. హిందూ రాష్ట్రంలో మనుధర్మ శాస్త్రం రాజ్యాంగం అవుతుంది. శ్రమజీవులు పని విభజన అర్హతను బట్టి కాకుండా కులాలనుబట్టి నిర్ణయమౌతుంది. హిందూ రాష్ట్రంలో శ్రమజీవులు శాశ్వతంగా కట్టు బానిసలౌతారు. కుల విభజన శ్రమజీవుల ఐక్యతకు భంగం కలిగిస్తుంది. మత రాజ్యాలలో ప్రజాస్వామ్యం వుండదు. పౌర హక్కులకు చట్టబద్ధత వుండదు. శిక్షలు తప్పును బట్టి కాకుండా కులాల ఆధారంగా వుంటాయి. మత రాజ్యాలలో ఓటు హక్కు, ఎన్నికలు వుండవు. నియంతలే వుంటారు ప్రస్తుతం ఓటు హక్కు వున్నందునే వివిధ పథకాల పేరుతో రాజకీయం శ్రమజీవులను పట్టించుకోక తప్పడంలేదు. ప్రభుత్వాలను మార్చే శక్తి మన ఓటులో వుంది. మత రాజ్యాలలో వివక్ష వుంటుంది. మైనారిటీ మతస్థులు సమాన హక్కులు లేని రెండవ తరగతి పౌరులౌతారు. మహిళలు, దళితులు, బహుజనుల పట్ల వివక్ష కొనసాగుతుంది. అందువల్ల శ్రమజీవులు సమైక్యంగా రాజ్యాంగ రక్షణకు పూనుకోవాలి. హిందూ రాష్ట్ర నినాదాన్ని రాజకీయంగా ఎదుర్కొనాలి. ఆర్‌ఎస్‌ఎస్ హిందూ రాష్ట్ర నినాదం దాడి నుంచి రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ఎంత అవసరమో రాజ్యాంగ ఫలాలను దక్కించుకోడానికి తగిన విధంగా దానిని అమలు చేయించడానికి ఉద్యమించడమూ అంతే అవసరం. ఈ ఉద్యమానికి కూడా ప్రజా రిపబ్లిక్ దినోత్సవం వేదిక కావాలి. రాజ్యాంగం పీఠిక ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం కల్పించాలని ప్రకటించింది. కాని సామాజిక రంగంలో కుల వివక్ష, మహిళల పట్ల వివక్ష, మైనారిటీల పట్ల వివక్ష నేటికీ కొనసాగుతున్నది. అమానుషమైన దాడులు, అత్యాచారాలు, హత్యాకాండ సాగిపోతున్నది. వివక్ష వున్నచోట సమానత్వం వుండదు. ప్రజాస్వామ్య విలువలు వుండవు. సమాన అవకాశాలు వుండవు. శ్రమజీవులు వివక్షకు తావులేని ప్రజా రిపబ్లికన్‌ను సాధించుకోవాలి.

రాజ్యాంగం అందరికీ ఆర్థిక న్యాయం జరగాలని ప్రకటించింది. దీనికి

బీజేపీ మాతృసంస్థ ఆర్ ఎస్ ఎస్ బహిరంగంగానే రాజ్యాంగాన్ని సవాలు చేస్తున్నది. హిందూ రాష్ట్ర నినాదం త్వరలోనే సాకారం కానున్నదని ప్రకటించింది. భారత రాజ్యాంగం పట్ల ఆర్ ఎస్ ఎస్ వైఖరి అందరికీ తెలిసిందే. రాజ్యాంగం ఆమోదించినప్పుడే వారు వ్యతిరేకించారు.

సమాజంలో అంతరాలు తగ్గాలి. అందరికీ అవకాశాలు లభించాలి. కాని గత 10 సంవత్సరాలలో అంతరాలు విపరీతంగా పెరిగాయి. 1 శాతం మంది కార్పొరేట్లు, బిలియనీర్ల దగ్గర 46 శాతం దేశ సంపద పోగుపడింది. 10 శాతం మంది దగ్గర 78 శాతం దేశ సంపద గుట్ట పడింది. ఈ కార్పొరేట్లకే కేంద్ర ప్రభుత్వం 20 లక్షల కోట్ల రూపాయలు పన్ను రాయితీలు, రుణమాఫీలు ఇచ్చింది. 60 శాతంగా వున్న సామాన్యులు, పేదల దగ్గర కేవలం 5 శాతం సంపద మాత్రమే వుంది. అత్యధిక ఆర్థిక అంతరాలున్న దేశాల్లో మన దేశం అగ్రస్థానంలో వుంది. దేశ ప్రజలకు ఆర్థిక న్యాయం అన్నది అర్థరహితంగా మారింది. సకల తరగతుల శ్రామికులు కేవలం నెల జీతగాళ్ళు, రోజు వారీ కూలీలు మాత్రమే కాదు. వీరే సరుకులను, సంపదను, సేవలను సృష్టిస్తున్నారు. ఈ సంపదలో తగిన వాటా వారికి దక్కడం లేదు. రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాల ప్రకారం దేశ సంపద, సహజవనరులు ప్రజలందరికీ చెందాలి. దీనికి విరుద్ధంగా మోదీ ప్రభుత్వం అడవులను, గనులను, సముద్రతీరాలను తన కార్పొరేట్ మిత్రులకు ధారాదత్తం చేసింది. వాటి నుంచి కోట్లాది సంపదను ప్రైవేటు వ్యక్తులు సొంతం చేసుకుంటున్నారు.

మరో ఆదేశిక సూత్రం ప్రకారం సంపద కొద్దిమంది దగ్గర పోగుపడకూడదు. కాని పోగు పడింది. దానిని వికేంద్రీకరించాలి. ఈ సంపదలలో తగిన వాటా శ్రమజీవులకు దక్కాలి. కార్పొరేట్ల దగ్గర పోగుపడ్డ సంపదను పునఃపంపిణీ చెయ్యాలి. కార్పొరేట్ పన్ను పెంచడం, వారసత్వ పన్ను, సంపద పన్ను విధించడం ద్వారా దాదాపు 20 లక్షల కోట్ల రూపాయల అదనపు ఆదాయం సమకూరుతుందని అనేక మంది నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ అదనపు నిధులతో జాతీయ సంక్షేమ నిధిని ఏర్పాటు చెయ్యాలి. ఈ సొమ్ముతో శ్రమ జీవులందరికీ హక్కుగా నివాసం, ఆహార భద్రత, విద్య-వైద్య సదుపాయాలు, కనీస మౌలిక ఆదాయం కల్పించాలి. ఈ నిధుల నుంచి రైతుల పంటలకు లాభసాటి ధరలు, నిరుద్యోగానికి శాశ్వత పరిష్కారాలు సాధించాలి. ఆదేశిక సూత్రాలలో కార్మికులకు పరిశ్రమల యాజమాన్యంలో భాగస్వామ్యం కల్పించాలని సూచిస్తే దానికి విరుద్ధంగా కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కార్మికుల హక్కులను హరించే లేబర్‌కోడ్‌లను ఈ ప్రభుత్వం తెచ్చింది. కార్మికులకు హేతుబద్ధమైన పని గంటలు వుండాలని ఆదేశిక సూత్రాలు ఘోషిస్తుంటే ఈ ప్రభుత్వం 12-16 గంటల పని దినానికి జెండా ఊపింది. ఈ తరహా రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకమైన ప్రతి చర్యను శ్రమజీవులు ప్రతిఘటించాలి. ప్రజా రిపబ్లిక్ అన్నది శ్రమజీవుల రాజకీయ నినాదం. బీజేపీ, ఆర్ ఎస్ ఎస్ రాజకీయాలను, భావజాలాలను ఓడించడం ఒక లక్ష్యం. కార్పొరేట్ల దగ్గర పోగుపడ్డ సంపద పునఃపంపిణీ ద్వారా శ్రమజీవులందరికీ గౌరవప్రదమైన స్వతంత్ర జీవనాన్ని సాధించడం మరో లక్ష్యం. దోపిడీ, వివక్షలు లేని సమాజాన్ని సాకారం చేసుకునే అంతిమ లక్ష్యానికి సాగిపోవాలి. వివిధ రంగాలలో చీలిపోయిన శ్రమజీవులు, వివక్ష తరగతుల సమూహాలు ఒక్కటైతే అది ప్రజా ఉద్యమం అవుతుంది, ఉప్పెనగా మారుతుంది.అసాధ్యాలను సుసాధ్యం చేస్తుంది.

దారి దీపం సంపాదకులు , 85006 78977

ఇదిగిదిగో... సోషల్ మీడియా... తస్మాత్ జాగ్రత్త

"నిప్పులు చిమ్ముకుంటూ
నింగికి నే నెగిరిపోతే
నిబిడాశ్చర్యంతో వీరు...
నెత్తురు కక్కుకుంటూ
నేలకు నే రాలిపోతే
నిర్దాక్షిణ్యంగా వీరే... "

ఇది మహాకవి శ్రీశ్రీ ఎప్పుడో రాసిన పద్యం. అప్పటికి... ఇప్పటికీ... ఎప్పటికీ... లోకం ఇలాగే ఉంటుంది అనడానికి ఎన్నో తార్కాణాలు. ముఖ్యంగా ఈ సోషల్ మీడియా వచ్చాక ఈ పద్యం రోజూ ఎన్నిసార్లయినా గుర్తుకు రాకమానదు. దేశంలో జరుగుతున్న మహా కుంభమేళా గురించి... ఆ సందర్భంగా ఓ అమ్మాయిని ఆకాశానికెత్తుతున్న సో.మీ (సోషల్ మీడియా) గురించే నే చెబుతున్నది. పూసలు అమ్ముకునే మోనా అనే అమ్మాయికి లిసాని తగిలించి ఈ సో.మీ మోనాలిసా చేసేసింది. పుణ్య స్నానాల మాట మహా శివుడితో పాటు మిగిలిన దేవుళ్లకెరుక, ఈ మోనాలిసా మాత్రం ముందు దేశ వ్యాప్తంగా చక్కర్లు కొడుతోంది. ఆనక ప్రపంచమంతా ఆ అమాయకపు కళ్లని తేరిపారి చూస్తుంటే, పూసలమ్ముకునే ఆ

చక్రవాకం

- ముక్కాముల చక్రధర్

మోనాని మోనాలిసా చేసిన ఈ సో.మీ ఓ వారం తర్వాత ఈ అమ్మాయి ముఖం కూడా చూడదు. ఇప్పుడు ఆకాశానికెత్తిన వారే ఆ మోనాలిసా వైపు తొంగి చూసి వంగి వాలరు. ఈలోగా ఆ పల్లె పడుచు జీవితం తన చేతుల్లోంచి ప్రపంచం చేతుల్లోకి పోతుంది. ఇప్పుడు హడావుడిగా వచ్చిన వాలిన బాలీవుడ్ ఆమె అందాన్ని కాసులకు అమ్ముకునే పనికి శ్రీకారం చుట్టేస్తుంది. ఆ మాయదారి సాలెగూడులో ఇరుక్కున్నాక ఇక తిరిగి రాలేక పూసల దండ పగిలినట్లుగా ఆమె జీవితం ఆమెది కాకుండా పోతుంది. ఈనాటి నింగికి ఎగరేస్తున్న వారందరూ ఆనాటి నేలకు రాలడానికి కూడా కారణమవుతారే తప్ప మరే విధంగానూ ఆమెను అక్కున చేర్చుకునే అవకాశాలుండవు. ఇలాంటివి గతంలో అనేకానేకం చూశాం. విన్నాం. చదివాం. అప్పుడు కూడా ఈ సో.మీ ముందుకు వచ్చి ఇష్టం వచ్చినట్లుగా ప్రచారం చేస్తుంది. మహా కుంభమేళ గురించి ఏ చానెల్‌లోనూ వార్తలు రావడం లేదంటూ కొందరు బుద్ధి జీవులు వేదన పడుతున్నారు కానీ... ఈ సోషల్ మీడియా ఉన్నంత వరకూ అసలు కంటే కొసరుకే ఎక్కువ ప్రచారం జరుగుతుందనే వాస్తవాన్ని మాత్రం గుర్తించడం లేదు. ఇప్పుడు జరుగుతున్న సో.మీ ప్రచారం ఎంత హద్దులు మీరుతోందంటే మోనా "లిసా" వ్యక్తిగత వ్యవహారాల్లోకి కూడా చొరబడి ఆ అమాయకపు అందాన్ని బజారుకీడుస్తున్నారు. మళ్లీ శ్రీశ్రీయే... "వ్యక్తుల ప్రైవేట్ బతుకులు వారి సొంతం... పబ్లిక్‌లో నిలబడితే ఏమైనా అంటాం" అన్నారు కానీ...పబ్లిక్‌లో నిలబడి జానెడు పొట్ట నింపుకునేందుకు వచ్చిన ఆ మోనా "లిసా" ప్రైవేట్ బతుకుని పబ్లిక్ చేసేసింది కూడా ఈ సో.మీ యే కావడం యాదృచ్ఛికం మాత్రం కాదు. ఈ సో.మీ బారిన పడి అంత ఎత్తుకు ఎదిగి ఆ తర్వాత అమాంతం కిందకి పడిపోయిన వారెందరో ఉన్నారు. అందంతా ఎక్కడో కూడా కాదు.. మన తెలుగు రాష్ట్రాల్లోనే కోకొల్లలు. ఇదిగో ఈ మోనా "లిసా"లాగే ఓ పల్లెటూరి గాయని ఓ బేబీని ఈ సో.మీ ఆకాశానికి ఎత్తేస్తూ వ్యాఖ్యానాలు చేసింది. ఈ గాయనిని సుశీల అంది. జానకి అని పొగిడింది. అలనాటి జిక్కికి ఈ బేబీ ఇంచుమించు సరిసాటి అంది. ఓ వారం రోజుల పాటు ఈ బేబీ తప్ప ప్రపంచంలో జరిగే ఏ యుద్ధాన్నీ, మరే విధ్వంసాన్నీ, నానాటికీ అడుగంటుతున్న మానవత్వం గురించి కానీ పట్టించుకోలేదు. అంతే ఆ వారం తర్వాత ఈ గాయని ఇంటి ముందు సినీ కాకులు వాలిపోయాయి. ఈ కోకిలకు వసంతం కంటే మరో గొప్పలోకాన్ని పరిచయం చేస్తాం అని వాగ్దానాల కీర్తనలు ఆలపించాయి. పాడించాయి. రికార్డులు విడుదల చేశాయి. అంతే వారి అవసరం తీరాక ఈ బేబీ తిరిగి గ్రామానికే వచ్చేసింది.

ఏపీ క్యాబినెట్‌లో ప్రస్తుతం మంత్రిగా ఉన్న మహిళను కూడా ఆనాడు ఈ సో.మీ ఒక్కరోజులోనే పదవి నుంచి తొలగించేలా చేసింది. ఆనాటి ప్రభుత్వం తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యురాలిగా నియమించింది ఈనాటి మంత్రి గారిని. టీటీడీ సభ్యురాలిగా ఇంకా ప్రమాణ స్వీకారం చేయకుండానే ఆమె మతం వేరంటూ, ఆమెకు సంబంధించిన ఓ పాత వీడియోను సో.మీ లో వైరల్ చేశారు. అంతే ఒక్కరోజులోనే పదవి వరించినంత వేగంగా ఆ పదవిని ఈ సో.మీ ఎత్తుకుపోయింది. ఇది ఓ మతానికి చెందిన వారికి ఆనందం కలిగించి ఉండవచ్చు. కానీ ఆ పదవి వచ్చి అలా గాల్లోకి ఎగిరిపోవడం వ్యక్తిగతంగా ఆమెకు పరాభవాన్నే మిగిల్చింది. ఇలా చెప్పుకుంటూ పోతే ఈ సో.మీ కారణంగా నిప్పులు చిమ్ముకుంటూ పైకెగసిన వారూ ఉన్నారు... నెత్తురు కక్కుకుంటూ నేలపై రాలిన వారూ ఉన్నారు. ఈ ఇద్దరిలోనూ నేలపై రాలిన వారే ఎక్కువ మంది కానరావడం సో.మీ పాప ఫలితమే. అదిగో... మీ పక్కనో, వెనుకో, మీకు అతి సమీపంలోనో ఎవరో చేతిలో స్మార్ట్‌ఫోన్‌తో మిమ్మల్ని ఇరుకును పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. తస్మాత్ జాగ్రత్త.

సీనియర్ జర్నలిస్టు, సెల్: 99120 19929

తెలంగాణ సాయుధ పోరాట నేపథ్యం - 2

ఆర్వీ రామారావ్

నిజాం హయాంలో తెలంగాణ ప్రాంతంలో రాజకీయాలకు తావేలేదు. కానీ మత మార్పిడులు జోరుగా సాగేవి. హిందువులను ముఖ్యంగా దళితులను ఇస్లాం మతం స్వీకరించేట్టు చేసేవారు. నిజాం ఆశీస్సులున్న రజాకార్లు ఈ మత మార్పిడులను ప్రోత్సహించేవారు. రజాకార్ల నాయకుడు కాశిం రజ్వీ "ప్రతి ముస్లిమూ రాజే" అనేవాడు. హిందువులను ఏరివేసి హైదరాబాద్ సంస్థానాన్ని ముస్లింల మయంగా మార్చాలని రజాకార్లు కలలు కనే వారు. 1892లో బహదూర్ యార్ జంగ్ నెలకొల్పిన మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ నిజాంకు మద్దతు ఇచ్చేది. మరో వేపు హిందూ మత సంక్షరణకోసం 1892లో స్వామీ దయానంద సరస్వతి ప్రారంభించిన ఆర్యసమాజ్ క్రియాశీలంగా పని చేసేది. రాజకీయాలకు నిజాం అనుమతించకపోయినా హిందూ మత పరిరక్షణ, సనాతన ధర్మ సంరక్షణ పేరుతో ఆర్య సమాజ్ కార్యకలాపాలు జోరుగానే కొనసాగేవి. హిందూ మతంలో పేరుకుపోయిన మౌఢ్యాన్ని తొలగించి హిందూ మతాన్ని సంస్కరించడం ఆర్య సమాజం లక్ష్యం కనక సంస్కరణాభిలాషులు ఆర్య సమాజ్‌లో చేరేవారు. ఆర్య సమాజం సంస్కరణలపేర పరిమితంగా రాజకీయాలు కూడా నడిపేది. పౌర హక్కుల కోసం పాటు పడేది. ముస్లిం వ్యతిరేక మత ప్రచార శక్తిగా ఆర్యసమాజ్ అవతరించింది.

రాజకీయ పార్టీలు రంగ ప్రవేశం చేయకముందు ఆర్య సమాజానిదే కీలక పాత్ర. ఇస్లాం మతం స్వీకరించే వారిని శుద్ధి చేసి మళ్లీ హిందువులుగా మార్చడం ఆర్య సమాజం కొనసాగించిన ప్రధాన కార్యక్రమం. ఇస్లాం మతంలోకి మారడాన్ని "తబ్లీక్" అనే వారు. ఇస్లాంలోకి మారిన ముస్లింలను శుద్ధి చేసి మళ్లీ హిందూ మతంలోకి మార్పించడాన్ని "తంజీం" అనే వారు.

రాజకీయాలకు అనుమతి లేకపోయినా సాహిత్యం, సంస్కృతి

పేర్లతో జనం సమీకృతం అయ్యే వారు. 1930లో ఆంధ్ర మహాసభ ఏర్పడకముందే 1928లో "అంజుమన్ -ఎ-తరక్కీ పసంద్" (ప్రగతి శీల కాంక్ష కలిగిన సంఘం) ఏర్పడింది. 1930లో స్వదేశీ లీగ్ అవతరించింది. 1935లో నిజాంస్ సబ్జెక్ట్స్ లీగ్ ఏర్పాటైంది. ఈ సంస్థల ఆధ్వర్యంలో ప్రజాస్వామ్యం, పౌరహక్కులు, జాతీయత కోసం ఉద్యమాలు ప్రారంభమయ్యాయి.

జాతీయవాది, విద్యావేత్త అలీయవార్ జంగ్, ఫజులుర్ రహమాన్, మందుముల నరసింగ రావు, బూర్గుల రామకృష్ణా రావు, దిల్సుఖ్ రాం, పద్మాజా నాయుడు ఈ ఉద్యమంలో పాల్గొనే వారు. మరో వేపు జాతీయ భావాలు, భాషా పరిరక్షణ కోసం పత్రికలు కూడా ప్రారంభమైనాయి. 1933లో ఖాజీ అబ్దుల్ గఫూర్ ఖాన్ సంపాదకత్వంలో "పయాం", మందుముల సంపాదకత్వంలో "రయ్యత్" సురవరం ప్రతాప రెడ్డి సంపాదకత్వంలో "గోలకొండ పత్రిక" ఈ ఉద్యమంలో కీలక పాత్ర నిర్వహించాయి. హైదరాబాద్, ఔరంగాబాద్, వరంగల్ ప్రాంతాలలో 1938లో వందేమాతరం ఉద్యమం ప్రారంభమైంది. ఇది ప్రజోద్యమానికి పూర్వ రంగంగా పనిచేసింది. నిజాం వందేమాతరం పాడడాన్ని నిషేధించాడు. పాడినందుకు వేలాదిమందిని కళాశాలల నుంచి బహిష్కరించారు. ఇలాంటి వారు నాగపూర్, జబల్ పూర్ వెళ్లి చదువుకున్నారు. పరీక్షలు రాశారు. ఈ రకంగా హైదరాబాద్ సంస్థాన్ విద్యార్థులకు జాతీయోద్యమ నాయకులతో సాన్నిహిత్యం ఏర్పడింది.

మఖ్దుం మొహియుద్దీన్

ఆలం ఖుందుమిరి

రాజ్ బహదూర్ గౌర్

స్టేట్ కాంగ్రెస్, ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ నాయకులలో అత్యధికులు వందేమాతరం ఉద్యమం నుంచి వచ్చిన వారే. 1939లో మఖ్దూం, రాజ్ బహదూర్ గౌర్, ఆలం ఖుందుమిరి, జవాద్ రజ్వీ కలిసి "కామ్రేడ్స్ అసోసియేషన్" ఏర్పాటు చేశారు. అతివాద భావాలు, రష్యాతో మైత్రి, స్వాతంత్ర్యం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామ్యవాదం ఈ సంస్థకు ఆదర్శం. కామ్రేడ్స్ అసోసియేషన్‌కు సరోజినీ నాయుడు అండ ఉండేది. కామ్రేడ్స్ అసోసియేషన్‌లో పనిచేసిన చాలా మంది కమ్యూనిస్టు పార్టీలో చేరారు. రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లా రెడ్డి, సర్వదేవభట్ల రామనాథం, ఆరుట్ల లక్ష్మీ నరసింహా రెడ్డి, ఆరుట్ల రామచంద్రా రెడ్డి వంటి కాంగ్రెస్ వాదులు కమ్యూనిస్టులుగా మారారు. చంద్రగుప్త చౌదరి, వి.డి.దేశ్ పాండే కూడా సీపీఐలో చేరారు. హరిజనోద్ధరణ నిధికోసం 1929లో గాంధీ హైదరాబాద్‌లో పర్యటించారు. అనేకమంది మహిళలు తమ ఒంటి మీదున్న బంగారాన్ని గాంధీజీకి అందజేశారు. 1934లో మరోసారి గాంధీ హైదరాబాద్ వచ్చారు. ఈ రెండు పర్యటనలు స్వాతంత్ర్యోద్యమంపై బలమైన ప్రభావం చూపాయి. 1938లో స్టేట్ కాంగ్రెస్ ఏర్పడగానే నిజాం దాన్ని నిషేధించాడు. కాంగ్రెస్ రహస్యంగా పని చేసేది. సాయుధ పోరాటం మొదలైన తరవాత 1946లో కాంగ్రెస్ మీద నిషేధం తొలగించారు.

1940లో కశ్మీర్ సింహం షేక్ అబ్దుల్లా వారం రోజులు హైదరాబాద్‌లో పర్యటించారు. అప్పుడు ఆయన సంస్థానాల ప్రజలు ఏర్పాటు చేసుకున్న సంఘానికి అధ్యక్షులుగా ఉండేవారు. రావి నారాయణ రెడ్డి, స్వామి రామానంద తీర్థ, షేక్ అబ్దుల్లా పర్యటనలు విజయవంతం కావడానికి కృషి చేశారు. మఖ్దూం, రాజ్ బహదూర్ గౌర్, వి.డి.దేశ్ పాండే, జవాద్ రజ్వీ కార్మిక సంఘాలు స్థాపించారు. చాలా కాలం కమ్యూనిస్టులు ఆంధ్రమహాసభనే పోరాట వేదిక చేసుకున్నారు. రెండో ప్రపంచ యుద్ధం తరవాత ప్రపంచ రాజకీయ చిత్రపటం మారిపోయింది. ఫాసిస్టు శక్తులు ఓడిపోయాయి.

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో పేలుడు 8 మంది మృతి

ముంబై: మహారాష్ట్రలోని భండారా జిల్లాలో ఓ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో శుక్రవారం ఉదయం భారీ పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఎనిమిది మంది మృతిచెందినట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. మరో ఏడుగురు గాయపడినట్లు తెలిపారు. ఈ ప్రమాదం ఉదయం 10.30 గంటల సమయంలో చోటుచేసుకున్నట్లు జిల్లా కలెక్టర్ సంజయ్ కోల్తే వెల్లడించారు. పేలుడు తీవ్రతకు ఫ్యాక్టరీ పైకప్పు కూలిపోయింది. ఈ శబ్దం ఐదు కిలోమీటర్ల వరకు వినిపించినట్లు స్థానికులు చెబుతున్నారు. ఘటన జరిగిన ప్రాంతంలో దట్టమైన పొగ కమ్ముకుంది. ఘటనాస్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. కూలిన పైకప్పు శిథిలాల కింద కొంతమంది చిక్కుకుని ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. వారి కోసం గాలింపు చేపట్టారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఘటనపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితులకు తక్షణ వైద్య సాయం అందిస్తున్నట్లు తెలిపారు.

టీడీఎస్ రద్దు పిల్‌ను తోసిపుచ్చిన సుప్రీం



న్యూఢిల్లీ: టీడీఎస్ రద్దు పిల్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఆదాయ పన్ను చట్టం కింద పన్ను వసూలుకు అనుసరిస్తున్న టీడీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఓ వ్యక్తి సుప్రీం కోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. దీనివల్ల ప్రాథమిక హక్కులకు భంగం కలుగుతోందని తన వ్యాజ్యంలో పేర్కొన్నారు. అయితే, ఈ పిటిషన్‌ను ధర్మాసనం తిరస్కరించింది. దిల్లీ హైకోర్టును ఆశ్రయించాలంటూ పిటిషనర్‌కు సూచించింది. ప్రతిచోటా అనుసరిస్తున్న టీడీఎస్ విధానాన్ని రద్దు చేయాలంటూ న్యాయవాది అశ్వినీ ఉపాధ్యాయ్ ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఆయన తరఫున మరో లాయర్ అశ్వినీ దూబే ఈ వ్యాజ్యాన్ని వేశారు. టీడీఎస్ విధానం సమానత్వపు హక్కుతో పాటు అనేక ప్రాథమిక హక్కుల్ని ఉల్లంఘిస్తోందని పేర్కొన్నారు. ఎలాగైనా దీన్ని రద్దు చేయాలని కోరారు. దీనిపై వాదనలు విన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల సారథ్యంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. లోపభూయిష్టంగా ఉన్న ఈ వ్యాజ్యాన్ని తాము విచారణకు స్వీకరించలేమని పేర్కొంది. టీడీఎస్ విధానం అన్ని దేశాల్లోనూ అమలవుతోందని గుర్తు చేసింది. కావాలంటే దిల్లీ హైకోర్టును ఆశ్రయించాలని పిటిషనర్‌కు ధర్మాసనం సూచించింది.

పాల ధరలు తగ్గించిన అమూల్

అహ్మదాబాద్: ప్రముఖ డెయిరీ బ్రాండ్ అమూల్ పాల ధరలు తగ్గించింది. మూడు రకాల పాలపై లీటరుకు రూపాయి చొప్పున తగ్గించినట్లు ప్రకటించింది. కంపెనీ అందిస్తోన్న ప్రధాన పాల ఉత్పత్తులు అమూల్ గోల్డ్, అమూల్ తాజా, అమూల్ టీ స్పెషల్‌పై ఈ తగ్గింపు ఉంటుందని పేర్కొంది. ఈ విషయాన్ని అమూల్ పేరుతో పాలు విక్రయించే గుజరాత్ కోపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఎండీ జయేన్ మెహతా వెల్లడించారు. ధరల తగ్గింపు తర్వాత అమూల్ గోల్డ్ ధర రూ.65 (ఒక లీటరు), అమూల్ టీ స్పెషల్ ధర రూ.61 (ఒక లీటరు), అమూల్ తాజా ధర రూ.53 (లీటరు)గా ఉంది. ధరల తగ్గింపు నిర్ణయం వెనుకున్న కారణాన్ని అమూల్ వెల్లడించలేదు. డెయిరీ విభాగంలో పోటీ పెరుగుతున్న తరుణంతో తన ఉనికిని బలోపేతం చేసుకుంటూ... ధరల తగ్గింపుతో వినియోగదారులకు ఉపశమనం కలిగించాలని కంపెనీ ఈ నిర్ణయం తీసుకొని ఉండొచ్చని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉండగా... గతేడాది జూన్‌లో అమూల్, మదర్ డెయిరీ లీటరు పాలపై రూ.2 చొప్పున పెంచుతున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

29న వీఐపీ జోన్ ఉండదు: యూపీ

ప్రయాగ్‌రాజ్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో కుంభమేళా వైభవోపేతంగా జరుగుతోంది. ఈ మహా కుంభమేళాకు దేశ, విదేశాల నుంచి భక్తులు వస్తున్నారు. గంగా, యమున, సరస్వతీ నదులు కలిసే త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. కాగా, ఈ నెల 29న మౌని అమావాస్య కావడంతో అందుకనుగుణంగా తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా మౌని అమావాస్య రోజున ఆ ప్రదేశంలో వీఐపీ జోన్ ఉండదని, ప్రముఖులకు ప్రత్యేక ఏర్పాట్లు ఉండవని ప్రభుత్వం తెలిపింది. ప్రయాగ్‌రాజ్‌లోకి వాహనాలను అనుమతించబోమని వెల్లడించింది. ప్రజల భద్రత దృష్ట్యా ఈ చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆ ఒక్కరోజే దాదాపు 8 నుంచి 10 కోట్ల మంది భక్తులు పుణ్యస్నానాలు(అమృత స్నానం) ఆచరించే అవకాశం ఉన్నందున 12 కిలోమీటర్ల పొడవైన ఘాట్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ట్రాఫిక్, జనం రద్దీని నియంత్రించేందుకు ప్రత్యేక సిబ్బందిని మోహరించామన్నారు. 144 ఏళ్ల తర్వాత గ్రహాల అరుదైన కలయిక ఏర్పడనున్న ఈ సందర్భానికి ప్రత్యేకత ఉండటంతో భారీ రద్దీ నెలకొనబోతోందని అధికారులు తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని అఖిల భారతీయ అఖాడా పరిషత్(ఏబీఏపీ) అఖాడాల(సాధువులు)కు ప్రత్యేక సూచన చేసింది. ఆ రోజున 'అమృత్ స్నాన్'కు తరలిరానున్న 13 లక్షల అఖాడాలు తమకు కేటాయించిన సమయంలోనే త్రివేణి సంగమంలో స్నానమాచరించే ప్రక్రియను ముగించాలని సూచించింది. దీనివల్ల ఇతర భక్తులకు అసౌకర్యం కలగదని పేర్కొంది. జనవరి 29 (మౌని అమావాస్య), ఫిబ్రవరి 3 (వసంత పంచమి), ఫిబ్రవరి 12 (మాఘ పూర్ణిమ), ఫిబ్రవరి 26 (మహా శివరాత్రి) పర్వదినాల్లో భక్తులు అమృత స్నానాలు ఆచరించనున్నారు.

యోగీ జీ... అమిత్ షాకు చెప్పండి

దిల్లీలో శాంతిభద్రతలపై కేజ్రీవాల్ హితవు

న్యూఢిల్లీ: దిల్లీలో శాంతిభద్రతలు క్షీణించాయన్న యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వ్యాఖ్యలతో ఏకీభవిస్తున్నానని ఆప్ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఏకీభవించారు. దిల్లీ నగరంలో శాంతిభద్రతలు అనేది కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతిలో ఉందని, ఆ విషయాన్ని ఆయనకే మీరు కాస్త కూర్చొని చెప్పండని కేజ్రీవాల్ ఎద్దేవా చేశారు. దిల్లీ నగరంలో శాంతిభద్రతలను ఎలా మరుగుపరుచాలో అమిత్ షాకు దిశా నిర్దేశం చేయండి యోగి జీ అంటూ కేజ్రీవాల్ సెటైర్లు వేశారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఫిబ్రవరి 5వ తేదీన జరగనున్న నేపథ్యంలో ఇటు ఆప్, అటు బీజేపీ తమ ప్రచార జోరును కొనసాగిస్తున్నాయి. మాటకు మాట అన్నట్లు రెండు పార్టీలు ప్రచారం చేస్తున్నాయి. దీనిలోభాగంగా యోగీ ఆదిత్యనాథ్ మాట్లాడిన మాటలకు కేజ్రీవాల్ దీటైన సమాధానం ఇచ్చారు. 'నిన్న యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ ఒక మంచి విషయం చెప్పారు. దీనికి దిల్లీ ప్రజలు కూడా మద్దతుగా నిలుస్తారు. దిల్లీలో శాంతిభద్రతలు బాగాలేవని యోగి అన్నారు. దాంతో దిల్లీ ప్రజలు వంద శాతం ఏకీభవిస్తారు. దిల్లీలో గ్యాంగ్‌స్టర్లు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. ఇక్కడ చాలా గ్యాంగ్‌స్టర్ గ్రూపులున్నాయి. వీరంతా దిల్లీ నగరాన్ని విభజించి వారి వారి కార్యకలాపాల్ని స్వేచ్ఛగా చేసుకుంటున్నారు. ఇక్కడ పెద్ద పెద్ద వ్యాపారవేత్తలను బెదిరించి అరాచకాలు సాగిస్తున్నాయి. ప్రధానంగా ఇక్కడ వ్యాపారాలు చేస్తున్న బడా వ్యాపారస్తులకు ఏ రోజు సుఖం లేదు. రోజూ ఏదొక గ్యాంగ్‌స్టర్ గ్రూప్ నుంచి వారు బెదిరింపు కాల్స్ రిసీవ్ చేసుకుంటూనే ఉన్నారు. వారి కుటుంబాల్ని చంపేస్తామంటూ మూడు నుంచి నాలుగు కోట్ల రూపాయల్ని గ్యాంగ్‌స్టర్ గ్రూపులు వసూలు చేస్తూ ఉంటాయి. దిల్లీలో జరిగే గ్యాంగ్ వార్స్‌కి అక్కడి రోడ్లే సాక్ష్యం. మహిళలు ఇళ్లుదాటి బయటకు రావాలంటే భయానక పరిస్థితులు ఉన్నాయి.

చిన్న పిల్లలు, మహిళలు తరచూ కిడ్నాప్‌లకు గురౌవుతున్నారు. ఇక్కడ గ్యాంగ్‌స్టర్‌లు కత్తులు, మారణాయుధాల్ని బహిరంగంగా వాడుతుంటారు. హత్యలు, చైన్ స్నాచింగ్‌లు, దొంగతనాలు నిత్యం ఏదో మూలన జరుగుతూనే ఉంటాయి. దిల్లీ ప్రజలు చాలా భయాందోళన మధ్య బ్రతుకుతున్నారనేది నిజం' అని కేజ్రీవాల్ పేర్కొన్నారు.

నన్ను సీఎం చేస్తానన్నారు

బీజేపీపై మనీశ్ సిసోదియా సంచలన ఆరోపణ

న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీలో అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయం మరోసారి రసవత్తరంగా మారింది. ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోదియా సంచలన వ్యాఖ్యలు చేశారు. లిక్కర్ స్కామ్ కేసులో తాను తీహార్ జైలులో ఉన్న సమయంలో బీజేపీ తనకు ముఖ్యమంత్రి పదవి ఇస్తానని ప్రతిపాదించిందని చెప్పారు. అయితే, తాను బీజేపీ ప్రతిపాదనను నిరాకరించినందుకే ఎక్కువ సమయం జైలులో గడపాల్సి వచ్చిందన్నారు. ఆయన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రకంపనలు రేపాయి. 'ఆప్‌పై బీజేపీ చేసిన కుట్రలు ఎవరికీ తెలియవు. ఇతర పార్టీల నుంచి నేతలను కొనుగోలు చేయడమే బీజేపీ విధానం. బీజేపీని వ్యతిరేకించే ప్రతిపక్ష నేతలను టార్గెట్ చేసుకుంటారు. వాళ్ల మాట వినకపోతే తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపిస్తారు. ప్రజాసంక్షేమం, పాఠశాలలు, ఆసుపత్రులు, ప్రజల అవసరాలతో కాషాయ పార్టీ నేతలకు అవసరం లేదు. కేవలం అధికారం కోసమే బీజేపీ ఆరాటపడుతుంది. లిక్కర్ స్కామ్ కేసులో నన్ను అన్యాయంగా జైలులో పెట్టారు. నేను జైలులో ఉన్న సమయంలో బీజేపీ నాకు సీఎం పదవి ఇస్తానని చెప్పింది. బీజేపీలో చేరాలని.., అలా అంగీకరిస్తే ఆప్ ఎమ్మెల్యేలను విడగొట్టి తనకు ముఖ్యమంత్రి పదవి ఇస్తానని ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను నిరాకరిస్తే ఎక్కువ కాలం కటకటాల వెనుక ఉంచుతామని బీజేపీకి చెందిన ఒక నేత బెదిరించారు' అని సిసోదియా చెప్పారు.

కేజ్రీవాల్ అంతానికి కేంద్రం కుట్ర: ఆప్

న్యూఢిల్లీ: మాజీ సీఎం కేజ్రీవాల్‌ను అంతం చేసేందుకు దిల్లీ పోలీసులు, కేంద్రంలోని బీజేపీ సర్కార్ కుట్ర పన్నుతున్నాయని ఆమ్‌ఆద్మీ పార్టీ ఆరోపించింది. పంజాబ్ పోలీసులు కల్పించిన భద్రతను పునరుద్ధరించాలని ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేసినట్లు పేర్కొంది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా నియంత్రణలో ఉండే దిల్లీ పోలీసులను తాము విశ్వసించడం లేదని తెలిపింది. అసెంబ్లీ ఎన్నికల ముందు బీజేపీ మురికి రాజకీయాలకు పాల్పడుతోందని విమర్శించింది. ఈ క్రమంలోనే కేజ్రీవాల్‌కు ముప్పు వాటిల్లేలా ఆయనకు భద్రత తొలగించారని మండిపడింది. కేజ్రీవాల్ భద్రతపై దిల్లీ సీఎం ఆతిశీ, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఫిబ్రవరి ఐదో తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీకి క్షేత్రస్థాయిలో సమాన అవకాశాలు కల్పించాలని ఎన్నికల సంఘాన్ని కోరినట్లు తెలిపారు. కేజ్రీవాల్‌పై జరిగిన దాడులపై దర్యాప్తుతోపాటు ఆయనకు పంజాబ్ పోలీసులు కల్పించిన భద్రతను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. గతంలో కేజ్రీవాల్‌పై బీజేపీ కార్యకర్తలు దాడి చేశారని దర్యాప్తులో తేలినప్పటికీ పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆతిశీ ఆరోపించారు. కేజ్రీవాల్‌పై జరుగుతున్న దాడులపై కేంద్ర ప్రభుత్వ అధ్వర్యంలో పనిచేసే దిల్లీ పోలీసులు దృష్టి సారించడం లేదన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు ఇలా నడుచుకుంటున్నారని మండిపడ్డారు.

50 లక్షల ఖరీదైన 20 వేల మద్యం బాటిళ్లు సీజ్

న్యూఢిల్లీ: దిల్లీలో అసెంబ్లీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు నేపథ్యంలో గత వారం రోజులుగా ఎక్సైజ్ అధికారులు సుమారు రూ.50 లక్షల ఖరీదైన 20 వేల మద్యం బాటిళ్లను సీజ్ చేశారు. వీటిల్లో 15,376 లీటర్ల దేశీయ, విదేశీ అక్రమ మద్యం ఉంది.

రూ.1.5 కోట్ల విలువైన 32 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యంపై ఇప్పటి వరకు 52 కేసులను రిజిస్టర్ చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత సీజ్ చేసిన మొత్తం మద్యంలో 25 శాతం ఎక్సైజ్ శాఖదే. హర్యానాతో పాటు ఇతర సరిహద్దు రాష్ట్రాల నుంచి వస్తున్న అక్రమ మద్యాన్ని పట్టుకునేందుకు ఎక్సైజ్ ఇంటెలిజెన్స్ బ్యూరో తీవ్రంగా పనిచేస్తోంది. 70 అసెంబ్లీ స్థానాలు ఉన్న దిల్లీలో ఫిబ్రవరి ఐదున ఎన్నికలు జరగనున్నాయి. ఎనిమిదో తేదీన లెక్కింపు జరగనుంది.

ఎమ్మెల్యే కుమారుడికి రూ.20 వేల జరిమానా

న్యూఢిల్లీ: ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే అమానతుల్లా ఖాన్ కుమారుడిపై దిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి రూ.20 వేల జరిమానా విధించారు. వివరాల్లోకి వెళితే... బాట్లా హౌజ్ వద్ద పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో.. ఇద్దరు ఇద్దరు వ్యక్తులు ఓ మోటర్‌సైకిల్‌పై రాంగ్ రూట్‌లో రైడింగ్ చేస్తూ కనిపించారు. సైలెన్సర్‌తో పెద్దగా సౌండ్ చేస్తూ దూసుకెళ్లారు. మోటర్‌సైకిల్‌ను అడ్డుకుని, పోలీసులు ఆ రైడర్లను విచారించారు. బైక్ రైడింగ్ చేస్తున్న వ్యక్తి పోలీసులతో అనుచితంగా ప్రవర్తించాడు. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ కావాలని పోలీసులు అడగ్గా, తాను లోకల్ ఎమ్మెల్యే కుమారుడిని అని చెప్పినట్లు తెలుస్తోంది. పోలీసు ఆఫీసర్‌తో ఫోన్‌లో ఎమ్మెల్యే దురుసుగా ప్రవర్తించాడని, నన్ను కూడా అరెస్టు చేయాలని ఆ ఎమ్మెల్యే బెదిరించినట్లు తెలుస్తోంది. ఈ కేసులో పోలీసులు బైక్‌ను స్వాధీనం చేసుకుని, మోటారు వెహికిల్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు. మార్చిన సైలెన్సర్‌పై రూ.ఐదువేలు, పోలీసుతో దురుసు ప్రవర్తనకు రెండు వేలు, డ్రైవింగ్ లైసెన్స్ లేనందుకు రూ.ఐదువేలు, హెల్మెట్ లేనందుకు రెండు వేలు, ప్రమాదకర డ్రైవింగ్‌కు వెయ్యి జరిమానా విధించారు.

పూర్వాంచల్ వాసులకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ

కాంగ్రెస్ హామీ

న్యూఢిల్లీ: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వచ్చినట్లయితే దిల్లీ పూర్వాంచల్ వాసులకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ, బడ్జెట్‌ను ఏర్పాటు చేస్తామని శుక్రవారం కాంగ్రెస్ ప్రకటించింది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ప్రభుత్వం దిల్లీ ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలను నాశనం చేసి చెత్తబుట్టగా మార్చిందని, ఆరోగ్య సంరక్షణ రంగంలో రూ.382 కోట్ల అవినీతికి పాల్పడిందని ఆరోపించింది. శుక్రవారం పార్టీ దిల్లీ కార్యాలయంలో పార్టీ బీహార్ విభాగం అధ్యక్షుడు, కేంద్ర మాజీ మంత్రి అఖిలేశ్ ప్రసాద్ సింగ్ విలేకరులతో మాట్లాడుతూ దిల్లీ ప్రపంచ స్థాయి నగరంగా మారితే, దేశ రాజధానిలో నివసించే ఇతరుల మాదిరిగానే పూర్వాంచలీయులకు కూడా ఇందులో పాత్ర ఉందని అన్నారు. 'ఈ రోజు, మేము రెండు ముఖ్యమైన ప్రకటనలు చేయాలనుకుంటున్నాం. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పూర్వాంచలీయుల కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ, ప్రత్యేక బడ్జెట్ ఉంటుంది. తద్వారా వారి ఆరోగ్యం, విద్యకు సంబంధించిన సమస్యలను పరిష్కరించవచ్చు' అని సింగ్ అన్నారు. దేశ రాజధానిలో తూర్పు ఉత్తర ప్రదేశ్, బీహార్, జార్ఖండ్‌కు చెందిన దిల్లీ వాసులను పూర్వాంచలీలుగా పిలుస్తారు. దిల్లీలోని అనేక నియోజకవర్గాలలో అభ్యర్థుల భవితవ్యాన్ని నిర్ణయించగల ఓటర్లలో వీరు గణనీయమైన శాతం ఉన్నారు. అందుకే కాంగ్రెస్, బీజేపీ, ఆప్ ఎన్నికల సమయంలో వారిని ఆకర్షిస్తున్నాయి. కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనాటే మాట్లాడుతూ పూర్వాంచలీలు ఈ దేశంలోని ప్రతి మూలకు వెళ్లి ఆ ప్రాంతాలను అభివృద్ధి చేశారని అన్నారు. కానీ వారి హక్కుల విషయానికి వస్తే, వారికి అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఫిబ్రవరి 5న దిల్లీలో పోలింగ్, 8న కౌంటింగ్ జరుగుతుందని ఆమె అన్నారు.

యమునా నీళ్లు తాగే ధైర్యం ఉందా?

యూపీ సీఎంకు అఖిలేశ్ ప్రశ్న

లక్నో: ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌పై సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ విమర్శలు గుప్పించారు. ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ యమునా నదిని మురుగు కాలువగా మార్చారని దిల్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా యూపీ సీఎం యోగి చేసిన విమర్శలపై అఖిలేశ్ స్పందిస్తూ... ముందు సొంత రాష్ట్రంలోని పరిస్థితులను ఆయన సరిచూసుకోవాలన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు. 'ఇతరులను సవాలు చేసే ముందు యూపీలో పరిస్థితి ఎలా ఉందో చూసుకోవాలి. మథుర నుంచి ప్రవహించే యమునా నది నీరు తాగేందుకు సిద్ధమా' అని యోగి పేరు ప్రస్తావించకుండా అఖిలేశ్ ప్రశ్నించారు. గురువారం బీజేపీ తరపున దిల్లీ ఎన్నికల ప్రచారంలో యోగి పాల్గొన్నారు. 'బంగ్లాదేశీయులు అక్రమంగా దేశంలోకి ప్రవేశిస్తున్నారు. వారికి అన్ని రకాల సౌకర్యాలను ఆప్ ప్రభుత్వం కల్పిస్తోంది. దిల్లీని డంపింగ్ యార్డ్‌లా చేసింది. యమునా నదిని మురుగు కాలువగా మార్చింది. కుంభమేళా సందర్భంగా మంత్రులతో కలిసి ఇటీవల ప్రయాగ్‌రాజ్‌లో పుణ్యస్నానం ఆచరించా. ఇక్కడున్న యమునా నదిలో కేజ్రీవాల్ మునగగలరా? దీనికి ఆయన నైతికంగా సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

కత్తితో పొడవడంతో విడిచిపెట్టా

పోలీసులకు వాంగ్మూలంలో సైఫ్ అలీఖాన్

ముంబై: దొంగ చేతిలో కత్తిపోట్లకు గురైన నటుడు సైఫ్ అలీఖాన్ వాంగ్మూలాన్ని పోలీసులు నమోదు చేశారు. తనపై ఏవిధంగా దాడి జరిగిందో పోలీసులకు వివరించాడు. నిందితుడిని గట్టిగా పట్టుకున్నానని, దాంతో అతడు పదేపదే వీపుపై కత్తితో పొడిచాడని, అందుకే అతడిని విడిచిపెట్టానని సైఫ్ ... పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో చెప్పినట్లు తెలుస్తోంది. 'నేను, కరీనా మా గదిలో ఉన్నాం. ఒక్కసారిగా మా చిన్న కుమారుడు జెహ్ ఏడుపు వినిపించింది. దాంతో బయటకు వచ్చి చూస్తే అక్కడ ఓ దుండగుడు స్టాఫ్ నర్సుపై దాడి చేస్తున్నాడు. నేను అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించా. వెంటనే అతడు నా వీపు, మెడ, చేతులపై కత్తితో దాడి చేశాడు. తెల్లవారుజామున 2.30 నుంచి 2.40 గంటల మధ్య ఈ ఘటన జరిగింది' అని పోలీసులకు సైఫ్ చెప్పారు. ఇప్పటికే ఈ ఘటనకు సంబంధించి సైఫ్ భార్య, నటి కరీనాకపూర్ వాంగ్మూలాన్ని కూడా పోలీసులు నమోదు చేశారు. మరోవైపు ముంబైలోని బాంద్రాలో ఉన్న ఆయన నివాసం వద్ద పోలీసులు భద్రతను ఏర్పాటు చేశారు. ఇద్దరు కానిస్టేబుళ్లు రెండు షిఫ్టుల్లో విధులు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. కాగా ఈ నెల 16న సైఫ్‌పై దుండగుడు కత్తితో దాడికి పాల్పడడంతో తీవ్రంగా గాయపడిన అతడి వెన్నెముక నుంచి కత్తిని తొలగించారు. పోలీసులు నిందితుడు మహ్మద్ షరీఫుల్ ఇస్లాం షెహజాద్‌ను అరెస్టు చేశారు. మహ్మద్ షరీఫుల్ ఏడు నెలల క్రితమే మేఘాలయలోని డౌకీ నది దాటి భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించినట్లు గుర్తించారు. అతడు భారత్‌లో విజయ్‌దాసుగా పేరు మార్చుకున్నట్లు తెలిపారు.

ఇక మూడో ఉప ముఖ్యమంత్రి

శివసేనలో చీలిక తప్పదు: రౌత్

ముంబై: శివసేన (యూబీటీ) నాయకుడు సంజయ్ రౌత్ శుక్రవారం శివసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై విమర్శలు గుప్పించారు. మహారాష్ట్రకు వారి నుంచి మూడో ఉప ముఖ్యమంత్రి ఉంటారని చెబుతూ, ఆయన పార్టీలో చీలిక ఏర్పడిందని అన్నారు.

శుక్రవారం రాజ్యసభ ఎంపీ విలేకరులతో మాట్లాడుతూ తెరవెనుక కార్యకలాపాలు ఎంతలా అంటే, భవిష్యత్‌లో రాష్ట్రానికి ముగ్గురు ఉప ముఖ్యమంత్రులు ఉండేలా ఉన్నాయని తెలిపారు. 'ఏక్‌నాథ్ షిండేను ఎవరూ సీరియస్‌గా తీసుకోకూడదు. ఆయన ఉప ముఖ్యమంత్రి. ఆయన నిన్న ముఖ్యమంత్రి. మహారాష్ట్రకు అదే పార్టీ నుంచి మూడవ ఉప ముఖ్యమంత్రి వస్తున్నందున ఆయన రేపు అక్కడ ఉండరు. ఆయన (షిండే) దీని గురించి ఆలోచించాలి' అని రౌత్ అన్నారు. పార్టీ మిత్రపక్షమైన బీజేపీని ఉద్దేశించి షిండే మహారాష్ట్ర 'శత్రువులకు' సేవ చేస్తున్నారని ఆయన ఆరోపించారు. పరిశ్రమల మంత్రి ఉదయ్ సమంత్... షిండే నేతృత్వంలోని శివసేనను విభజించగలరని, ఎందుకంటే ఆయనకు 20 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని రౌత్ పేర్కొన్న కొన్ని రోజుల తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గత ఏడాది నవంబరులో జరిగిన రాష్ట్ర ఎన్నికల తర్వాత షిండేకు ముఖ్యమంత్రి పదవి నిరాకరించడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నప్పుడు సమంత్‌ను పరిశీలించే ఆలోచనలు వచ్చాయని ఆయన తెలిపారు. అయితే పార్టీ అధ్యక్షుడు షిండే తనకు ఎలాంటి విభేదాలు లేవని, చీలిక సృష్టించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని సమంత్ పేర్కొన్నారు. మహారాష్ట్రలో ప్రస్తుతం షిండే, ఎన్‌సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రులుగా ఉన్నారు.

ఆడపిల్లల రక్షణ గాలికి...

నిలిచిన సీసీ కెమెరాల ఏర్పాటు

దాదర్: విద్యార్థులపై అత్యాచారాలు, లైంగిక దాడుల ఘటనలు తరుచూ వెలుగులోకి వస్తున్నప్పటికీ బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) స్కూళ్లలో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు ప్రక్రియ ఇంతవరకూ పూర్తికాలేదు. దీంతో విద్యార్థుల భద్రత ముఖ్యంగా ఆడపిల్లల రక్షణ గాలికి వదిలేసినట్టైంది సుమారు నాలుగు నెలల కిందట బద్లాపూర్‌లోని ఓ పాఠశాలలో ఇద్దరు చిన్నారులపై లైంగిక దాడుల ఘటన జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై ప్రజలు, ప్రతిపక్షాల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో ముంబై సహా తూర్పు, పశ్చిమ ఉప నగరాల్లో ఉన్న అన్ని బీఎంసీ పాఠశాలల్లోని తరగతి గదుల్లో, పాఠశాల ఆవరణలో సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని బీఎంసీ పరిపాలనా విభాగం నిర్ణయం తీసుకుంది. కానీ ముంబై సిటీ పరిధిలో ఉన్న బీఎంసీ పాఠశాలల్లో మాత్రమే సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంది. పశ్చిమ, తూర్పు ఉప నగరాల్లోని 356 పాఠశాలల్లో ఇంతవరకు వాటి ఊసే లేదు. నిధుల కొరత వల్ల వాటిని ఏర్పాటు చేయలేదని బీఎంసీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో విద్యార్థుల భద్రత మరోసారి తెరమీదకు వచ్చింది. ముంబై, ఉప నగరాల్లో బీఎంసీకి చెందిన ప్రాథమిక, సెకండరీ పాఠశాలల్లో దాదాపు మూడు నుంచి నాలుగు లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఏడున్నర వేలకుపైగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేస్తున్నారు. వీరిలో పురుషులతో పోలిస్తే మహిళా ఉపాధ్యాయుల సంఖ్య అధికం. దీంతో వారికి కూడా రక్షణ కల్పించాల్సిన బాధ్యత బీఎంసీపై ఉంది. పాఠశాల తరగతి గదుల్లో, స్కూల్ ఆవరణలో విద్యార్థులపై లైంగిక దాడులు, వేధింపులు చోటుచేసుకుంటే సీసీ టీవీ కెమెరాల్లో రికార్డయిన వీడియో దశ్యాలు నిందితులను గుర్తించడానికి ఎంతో దోహద పడతాయి. దీంతో బీఎంసీకి చెందిన అన్ని పాఠశాలల్లో సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని బీఎంసీ పరిపాలన విభాగం నిర్ణయం తీసుకుంది. గతంలో జరిగిన సంఘటనలతో అప్రమత్తమైన బీఎంసీ అన్ని స్కూళ్లలోనూ సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. కానీ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల కోడ్, మూడేళ్లుగా వాయిదా పడుతూ వస్తున్న బీఎంసీ ఎన్నికలు, ఇతర అనివార్యకారణాల వల్ల కెమెరాల ఏర్పాటు ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. కానీ బద్లాపూర్ ఘటనతో ఈ అంశం మళ్లీ తెరమీదకు రావడంతో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుకు సలహాదారుల కమిటీని నియమించి టెండర్ల ప్రక్రియను పూర్తిచేసింది. బీఎంసీ పరిధిలో మొత్తం 479 పాఠశాలుండగా వీటిలో ముంబై సిటీలో ఉన్న 123 పాఠశాలల్లో 2,832 సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేశారు. కానీ నిధుల కొరత వల్ల ఉప నగరాల్లో ఉన్న 356 పాఠశాలల్లో మాత్రం ఇంతవరకూ ఏర్పాటు చేయలేదు. చివరకు బీఎంసీ అదనపు కమిషనర్ అమిత్ సైనీ జోక్యం చేసుకుని నిధుల మంజూరుకు ఆదేశించారు. కానీ అదే సమయంలో అసెంబ్లీ ఎన్నికల నగారా మోగడంతో కోడ్ అమలులోకి వచ్చింది.

దీంతో నిధులు మంజూరు ప్రతిపాదన అటకెక్కింది. ఫలితంగా ఉప నగరాల్లోని 356 పాఠశాలల్లో సుమారు ఆరువేల సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటుచేసే ప్రక్రియ పెండింగులో పడిపోయింది. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు, ఫలితాల తంతు పూర్తయి కొత్త ప్రభుత్వం కూడా ఏర్పాటైంది. దీంతో ఈ పాఠశాలల్లో సీసీ టీవీ కెమెరాల ఏర్పాటుకు దాదాపు రూ.54 కోట్లు అవసరం కావడంతో ఈ ఏడాది ఫిబ్రవరి లేదా మార్చిలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో నిధులు మంజూరుచేసి పనులు ప్రారంభించాలని బీఎంసీ యోచిస్తోంది.

విశాలాంధ్ర హైదరాబాద్

ముఖ్యమంత్రిని కలిసిన మేయర్ విజయలక్ష్మి, ప్రభుత్వ సలహాదారు కేశవ్ రావు

విశాలాంధ్ర - హైదరాబాద్ : సింగపూర్, దావోస్ పర్యటనలు విజయవంతంగా ముగించుకొని తిరిగి హైదరాబాద్ చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వారి నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపిన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ప్రభుత్వ సలహాదారు కే.కేశవ్‌రావు తెలంగాణకు రూ.1,78,950 కోట్ల రికార్డుస్థాయిలో ముఖ్యమంత్రి పెట్టుబడులు తీసుకురావడంపై మేయర్ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి నమ్మకంతో రికార్డు స్థాయిల్లో పెట్టుబడులు పెట్టిన సంస్థల యజమానులకు కృషి చేసిన ప్రతిఒక్కరికీ మేయర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్‌హెచ్‌ఎంఆల్ డీఈఓలకు కనీస వేతనం చెల్లించాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : నేషనల్ హెల్త్ మిషన్ పనిచేస్తున్న కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఆల్ డాటా ఎంట్రీ ఆపరేటర్స్ (డీ.ఈ.ఓ) సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని 60 జీ.ఓ. ప్రకారం 22750 ఇవ్వాలి. ఈ సందర్భంగా ఏఐటీయుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి, ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర అధ్యక్షులు ఎం.నర్సింహా మాట్లాడుతూ నేషనల్ హెల్త్ మిషన్ డాటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వం వెంటనే సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేయుచున్న కాంట్రాక్టు అండ్ ఔట్సోర్సింగ్ ఏజెన్సీ డీ.ఈ.ఓ. కనీస వేతనాలు అమలు చేయకుండా శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారని ఏఐటీయూసీ అనుబంధం ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా విమర్శించారు. ఈ సందర్భంగా రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎంలో సరిపడా నిధులు ఉన్నప్పటికీ అంగట్లో అన్ని ఉన్నా అల్లుని నోట్లో సేని అన్నట్లు కార్మికుల వేతనాలు పెంచేందుకు మాత్రం అధికారులు చర్యలు తీసుకోవడం లేదని, గత రెండు సంవత్సరాల నుంచి డీ.ఈ.ఓ. అతి తక్కువ జీతాలతో కేవలం 15000 రూపాయలు చెల్లిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఔట్సోర్సింగ్ జీవో 60 ప్రకారం ఆల్ డీఈఓలకు రూపాయలు 22750 ఇవ్వాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోక వారు శ్రమ దోపిడీకి గురవుతున్నారని వారు తెలియజేశారు. కనీస వేతనం, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేయడం జరిగింది. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సారంగుల బాలసుబ్రమణ్యం, రాఘవేంద్ర, వెంకటేష్, ప్రవీణ్, మహేష్, అనిత, సౌమిత్రి, మురళి, రాజశేఖర్, ప్రవీణ, రామకృష, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మహోన్నత నాయకుడు పరిటాల రవి

విశాలాంధ్ర- దుండిగల్: మాజీ మంత్రి, దివంగత టీడీపీ నేత పరిటాల రవీంద్ర మహోన్నతమైన నేత అని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో శుక్రవారం పరిటాల రవి 20వ వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ ఆయన చిత్రపటానికి పూలమాల సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరిటాల రవి మంత్రిగా ఉన్న సమయంలో వారు ప్రజలకు చేసిన సేవలు మరువలేనివని గుర్తుచేశారు. పేద ప్రజలకు అండగా నిలిచిన ప్రజా నాయకుడు పరిటాల రవి అని, వారి సేవలు ఎల్లప్పుడూ ప్రజల మధ్యలో మెదులుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ జనరల్ సెక్రెటరీ జెట్టి కుసుం కుమార్, టీపీసీసీ జనరల్ సెక్రటరీ నర్సిరెడ్డి భూపతిరెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజవర్గం ఇంచార్జ్ కొలను రెడ్డి, కూకట్ పల్లి నియోజవర్గం ఇంచార్జ్ బండి రమేష్, బండి శ్రీనివాస్ గౌడ్, పులి సందీప్, మోతి శ్రీనివాస్ యాదవ్, అర్వ వెంకట్, గుమస్తా మధు, ప్రభాకర్ రెడ్డి నిర్వాహకులు నీలపాటి కరుణాకర్ రావు, సుందూరి అనంత చౌదరి, అంతయ్య, శశి, కోటేశ్వరరావు, వంశీ, రమేష్, శివాజీ, పరిటాల రవి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : కొలను

విశాలాంధ్ర- కుత్బుల్లాపూర్: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందిస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గం పరిధి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ రాజీవ్ గృహకల్ప 33వ డివిజన్ నందు శుక్రవారం ప్రజాపాలన వార్డు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొలను శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నిరుపేదలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని, ఇది ప్రజా ప్రభుత్వం ఇప్పటివరకు రాని వారికి ఇందిరమ్మ ఇల్లులు, రేషన్ కార్డులు అర్హులైన అందరికీ వచ్చేంతవరకు మళ్లీ ఇదే ప్రక్రియ కొనసాగుతుంటుందని ఆయన వెల్లడించారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సాబీర్ అలీ, పంగా శ్రీనివాసరావు, లక్ష్మణ్, ప్రభాకర్ రెడ్డి, బాలకృష్ణ, రామచంద్రనాయక్, పితాని శ్రీనివాసరావు, రాయుడు, సరిత రెడ్డి, నవ్య దేవి, రాణీ, ఉషా, ఎం సత్యవతి, ఎస్.సత్యవతి, వరలక్ష్మి, మయూనుద్దీన్, ప్రశాంత్ రెడ్డి శ్రీనివాసరాజు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకురాళ్ళు, డివిజన్ అధ్యక్షులు, అభిమానులు పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలి

విశాలాంధ్ర-బషీర్‌బాగ్: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అసెంబ్లీలో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని జాతీయ మాదిగ రాజకీయ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బిఎన్.రమేష్ కుమార్ మాదిగ కోరారు. శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మందకృష్ణ ఆధ్వర్యంలో ఏబిసిడి వర్గీకరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 7న ట్యాంక్‌బండ్‌పై తలపెట్టనున్న 'లక్ష డప్పులు-వేల గొంతుకలు' కార్యం కార్యక్రమానికి మాదిగ రాజకీయ పోరాట సమితి, మహాజన పోరాట సమితి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేతలు పి.సంపత్, గద్దల కుమార్, ఈరెల్లి శ్రీనివాస్, చిన్న అంజనీ, మల్లెపాక చంద్రమౌళి, ఆర్.బాగయ్య పాల్గొన్నారు.

సర్వాయి పాపన్న చరిత్రను దేశానికి చాటి చెప్తాం

మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : సర్దార్ సర్వాయి పాపన్న చరిత్రను దేశానికి చాటి చెపుతామని, కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం సర్వాయిపేట గ్రామంలోని సర్వాయి కోటను టూరిజం సర్కిల్‌గా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ అన్నారు. సైదాపూర్ మండలం సర్వాయిపేట గ్రామంలో రూ.4 కోట్ల 70 లక్షలతో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ కోట పర్యాటక అభివృద్ధికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్వాయిపేట కోటగుట్టపై సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేసి జోహర్లు అర్పించారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ రాబోయే తరాలు సర్దార్ పాపన్న తెలివి, ధైర్యం, తెగువను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అరాచకానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసి సామాజిక న్యాయం కోసం పోరాడిన సర్వాయి పాపన్న నేలనీ అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇక్కడి హనుమంతుని గుడి, మహమ్మదాపూర్ గుట్ట, మహాసముద్రం గండినీ అభివృద్ధి చేసి ఈ ప్రాంతాన్ని టూరిజం సర్కిల్‌గా మారుస్తామని తెలిపారు. సర్వాయి కోట పనులు పూర్తయ్యాక ముఖ్యమంత్రితో ప్రారంభోత్సవం చేస్తామని, మరిన్ని నిధులతో మరో దశ అభివృద్ధినీ కొనసాగిస్తామని తెలిపారు. ఇక్కడి ప్రాంత ప్రజల జీవన స్థితిగతులను మరింత మెరుగుపరుస్తామని తెలిపారు. వెన్నంపల్లిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవన కార్యాలయం ప్రారంభించిన అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థి విభాగం నుంచి వచ్చిన తాను సహకార రంగంలో సేవ చేశానని అన్నారు. రైతు బిడ్డనైన తనకు రైతు అవసరాలు తెలుసని అన్నారు. రాజకీయాలకు, సహకార సంఘాలకు సంబంధం లేదని, సహకార సంఘాల అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తానని తెలిపారు. వరద కాలువ ఫేస్ 2 ద్వారా సైదాపూర్, చిగురుమామిడి మండలాలకు సాగునీరు అందించనున్నని తెలిపారు. గౌరవెల్లి నుండి భీమదేవరపల్లి మండలానికి, దేవాదుల ద్వారా ఎల్కతుర్తి మండలానికి నీరు అందిస్తామని వివరించారు. రెండు లక్షల రూపాయల లోపు ఉన్న రైతు రుణాలన్నీ మాఫీ చేశామని, రెండు లక్షల పైన ఉన్న రుణాలన్నీ మాఫీ చేస్తామని తెలిపారు. సైదాపూర్‌లోని మోడల్ స్కూల్లో అభివృద్ధి పనులకు 60 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం మోడల్ స్కూల్ ని సందర్శించిన మంత్రి విద్యార్థులతో మాట్లాడారు. గతంలో వచ్చిన వరదను దృష్టితో ఉంచుకొని మోడల్ స్కూల్ కాంపౌండ్ వాల్ కోసం రూ.48 లక్షలు, వంట గది, టాయిలెట్ల నిర్మాణానికి రూ.12 లక్షలు మంజూరు చేస్తున్నామని అన్నారు. కరీంనగర్ జిల్లా యంత్రాంగం తరపున ఇప్పటికే విద్యార్థులందరికీ సులు పంపిణీ చేసినట్లు తెలిపారు. డైట్ చార్జీలు కాస్మోటిక్ చార్జీలు పెంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని హాస్టలలో కామన్ డైట్ మెనూ అమలు చేస్తున్నామని అన్నారు. విద్యార్థులు చదువుకొని వివిధ రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయి, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్, సహకార సంఘం అధ్యక్షులు వెంకటరెడ్డి, తిరుపతి రెడ్డి, తెలంగాణ గౌడ్ సంఘం అధ్యక్షులు భువనగిరి యాదగిరి గౌడ్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, బేరాల గోపాలరావు, ప్రభాకర్ రెడ్డి, సుధాకర్, రాజు తదితరులు పాల్గొన్నారు. రాజకీయాలకు అతీతంగా కరీంనగర్ జిల్లా అభివృద్ధిలో నెంబర్ వన్ ఉండేందుకు అందరూ సహకరించాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్రంలో ఎన్నోసార్లు మంత్రులను కలిశానని వెల్లడించారు.

జనం కోసం వీర మరణం పొందిన

గొప్ప భారతీయ విప్లవకారుడు తుర్రేబాజ్ ఖాన్

ఈటి నరసింహ

విశాలాంధ్ర - హైదరాబాద్ : జనం కోసం, బ్రిటిష్ పాలనా అంతం కోసం, నిరంకుశ నిజాం పాలనా నుండి విముక్తి కోసం వీర మరణం పొందిన తుర్రేబాజ్ ఖాన్ గొప్ప భారతీయ విప్లవకారుడు అని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టి.నరసింహ కొనియాడారు. 1857 సిపాయి తిరుగుబాటు, దేశ మొదటి స్వాతంత్ర్య యుద్ధ స్వతంత్ర సమరయోధుడు తుర్రేబాజ్ ఖాన్ 168వ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్, కోఠి, మొదటి స్వాతంత్ర్య యుద్ధ అమరవీరుల స్మారక స్తూపం వద్ద సిపిఐ హైదరాబాద్ జిల్లా సమితి శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ.టి. నరసింహతోపాటు సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, ప్రముఖ సామాజికవేత్త మోటూరి కృష్ణ ప్రసాద్, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, బి.స్టాలిన్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బి.వెంకటేశం తదితరులు తుర్రేబాజ్ ఖాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఈ.టి. నరసింహ మాట్లాడుతూ బ్రిటిష్ వారి పెత్తనాన్ని, నిజాం దోపిడీని తీవ్రంగా ద్వేషించిన తుర్రేబాజ్ ఖాన్ కోఠిలోని బ్రిటిష్ నివాసంపై దాడి చేయడానికి 6,000 మందిని సమీకరించిన ధైర్యవంతుడని, హైదరాబాద్ రాష్ట్రంలో బ్రిటిష్ వారికి, నిజాంకు వ్యతిరేకంగా పోరాడి బ్రిటిష్ వారిచే ఉరితీయబడ్డా గొప్ప గొప్ప దేశభక్తుడు అని గుర్తు చేసారు. మనమందరం మర్చిపోయిన తుర్రేబాజ్ ఖాన్ ప్రథమ భారత స్వాతంత్ర పోరాటంలో హైదరాబాద్ హీరో అని, రాష్ట్ర ప్రభుత్వం అయన సేవలను గుర్తించి హైద్రాబాద్వ్ ట్యాంక్ బండ్‌పై తుర్రేబాజ్ ఖాన్ విగ్రహం ఏర్పాటు చేయాలనీ ఈ.టి. నరసింహ విజ్ఞప్తి చేసారు. వి.ఎస్.బోస్ మాట్లాడుతూ బ్రిటీష్ వారి బారి నుండి నిజాం ఆధిపత్యాలను విముక్తి చేయడానికి తుర్రేబాజ్ ఖాన్ తన జీవితాన్ని వీరోచితంగా దేశానికి అర్పించాడని గుర్తు చేశారు. మోటూరి కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ 1857లో ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ జ్వాలలను హైదరాబాద్ రాష్ట్రంలో వ్యాపింపజేసింది తుర్రేబాజ్ ఖాన్ అని గుర్తు చేశారు. తుర్రేబాజ్ ఖాన్ పరాక్రమాలకు పెట్టింది పేరని, అందుకే ఆయనను "తురుం ఖాన్" అని ప్రజలు పిలిచేవారని, తుర్రేబాజ్ ఖాన్ వంటి త్యాగధనుల ఆకాంక్షలను, ఆశయాలను నేటితరం ముందుకు తీసుకెళ్లాలని మోటూరి కృష్ణ ప్రసాద్ కోరారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు నెర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, మహమద్ సలీం, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఆరుట్ల రాజ్ కుమార్ చెట్టుకింది శ్రీనివాస్, మహమూద్, జంగయ్య, గ్యార నరేష్, ఇమ్రాన్, చైతన్య, కళ్యాణ్, అనిల్, భవన నిర్మాణ కార్మిక నాయకులు కాశన్న, సి.శ్రీనివాస్, ఆటో యూనియన్ నాయకులు అశోక్, ఓయు నాయకుడు అశ్విన్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోతే ఆందోళన తప్పదు

విశాలాంధ్ర- హైదరాబాద్ : సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందకపోతే ఆందోళనలు తప్పవు. బికేయంయు జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న గ్రామసభలలో ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సంక్షేమ పథకాల లిస్టులలో పేరు రాని వాళ్ళు మళ్లీ దరఖాస్తులు పెడుతున్నారని వాటన్నిటి పరిశీలించి అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను అమలు జరపాలని లబ్ధిదారులను కుదించే ప్రయత్నం చేయడం ఎంత మాత్రం సమంజసం కాదన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మొదలైన పథకాలకు అనేక సార్లు దరఖాస్తులు పెట్టుకున్న వారు తమ పేర్లు రాకపోయే సరికి ఆందోళనలో ఉన్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం లబ్ధిదారుల సంఖ్యను తగ్గించి నామ మాత్రంగా కొద్దిమందికి మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నాలను మానుకోవాలని, అర్హత కలిగిన వ్యవసాయ కార్మికులందరికీ ఎలాంటి షరతులు లేకుండా ఇందిరమ్మ ఆత్మీయ భరోసాఅందించాలని, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు అర్హత కలిగిన వారందరికీ ఇవ్వాలని, పారదర్శకంగా ఈ పథకాలను రాజకీయాలకు అతీతంగా అమలు పరచాలన్నారు. సంక్షేమ పథకాల అమలులో పేదలకు అన్యాయం జరిగితే పోరాటాలు ఉద్ృతం అవుతాయని వెంకట్రాములు ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

రిజిస్ట్రేషన్ లే ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలి : కలెక్టర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ జిల్లాలో ఉన్న అన్ని ప్రైవేట్ ఆస్పత్రులు క్లినిక్లు, వెల్నెస్ సెంటర్లు, ఫిజియోథెరపీ సెంటర్లు, డెంటల్ క్లినిక్‌లు, ఎక్స్రే క్లినిక్, అలోపతి, ఆయుష్ క్లినిక్‌లు తప్పనిసరిగా, విధిగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో రిజిస్టర్ చేయించుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్లినికల్ ఎస్టాబ్లిషమెంట్ ఆక్ట్ సమావేశంలో చైర్మన్ హెూదాలో అయన పాల్గొన్నారు. ప్రైవేట్ క్లినిక్కులు, పోలీక్లినిక్కులు, హాస్పిటల్స్, ఫిజియోథెరపీ సెంటర్లు, డెంటల్ క్లినిక్స్, ఎక్స్రే క్లినిక్ నడిపే వారు తప్పనిసరిగా నియమ నిబంధనలు పాటించాలని సమావేశంలో జిల్లాస్థాయి క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్ కమిటీ సమావేశంలో ముఖ్య నిర్ణయాలు తీసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. జిల్లాలోని అన్ని క్లినిక్కులు, పోలీ క్లినిక్కులు, ల్యాబ్‌లు, హాస్పిటల్స్, వెల్నెస్ సెంటర్లు, ఫీజియోథెరఫీ సెంటర్లు, కంటి క్లినిక్కులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి, అలాగే జిల్లాలోని ఆయుర్వేద, యునాని, హెూమియో, సిద్ధ, యోగ, నేచురోపతి వంటి అన్ని హాస్పిటల్స్, క్లినిక్కులు కూడా తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని లేనిచో పెనాలిటీ, సీజ్ చేయటము మరియు అటువంటి క్లినిక్కులు, ఆసుపత్రలపై చట్టరీత్యా చర్యలు తీసుకోబడును అని తెలిపారు. అనుమతి రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులకు మొదటి విడతగా 50 వేల రూపాయలు ఫైన్ విధించి చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అర్హత లేకుండా అనుమతి లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆస్పత్రిలను సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు తమ పరిధిలో ప్రత్యేక సర్వే క్షేత్రస్థాయిలో నిర్వహించి అన్ని ప్రైవేట్ ఆస్పత్రులు రిజిస్ట్రేషన్ పొందుటకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రిజిస్ట్రేషన్ గడువు అయిపోయిన 28 ప్రైవేట్ ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు ఇచ్చి రిజిస్ట్రేషన్ రద్దు చేయాలన్నారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ క్యాలెండర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ కదిరివన్, అడిషనల్ డీసీపీ డాక్టర్ మనోహర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖా అధికారి డాక్టర్. జె.వెంకట్, ఐఎంఏ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీరంగ్ అబ్కారి, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు, సీనియర్ పబ్లిక్ హెల్త్ అధికారులు, డిప్యూటీ డెమో అంజయ్య, నర్సింహా, మాస్ మీడియా అధికారి రాములు పాల్గొన్నారు.

గాంధీని కలిసిన టీఎన్‌జీఓస్ కాలనీ వాసులు

విశాలాంధ్ర- శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని టీఎన్‌జీఓస్ కాలనీ వాసులు పలు సమస్యలు మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులపై పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీని వివేకానంద నగర్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన గాంధీ మాట్లాడుతూ త్వరలోనే టీఎన్‌జీఓస్ కాలనీలో పర్యటిస్తానని, టీఎన్‌జీఓస్ కాలనీలో నెలకొన్న అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్ల సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తామని, త్వరలోనే సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తామని, కాలనీలో అన్ని రకాల మౌలిక వసతులు కలిపించామని, అసంపూర్తిగా మిగిలిపోయిన రోడ్లను అతి త్వరలో చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, ప్రజలకు ఇబ్బంది లేకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని అన్ని రోడ్లను దశల వారిగా చెప్పటి పూర్తి స్థాయిలో రోడ్ల నిర్మాణం పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని, డ్రైనేజి వ్యవస్థను, మంచి నీటి వ్యవస్థను మెరుగుపరుస్తామని తెలియచేసారు. గ్రంథాలయ డైరెక్టర్ గణేష్ ముదిరాజ్, నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణ రావు,వేణు గోపాల్ రెడ్డి, శ్రీనివాస్, సల్లావుద్దీన్ సంజీవయ్య, హనుమ, సాయి రెడ్డి మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే యెన్నం

విశాలాంధ్ర - హైదరాబాద్ : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని, హన్వాడ మండలంలోని కొత్తపేటలో జరిగిన ప్రజాపాలన గ్రామ సభ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాపాలన గ్రామ సభలో ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులు కోసం ప్రతి ఒక్కరి నుంచి అధికారులు దరఖాస్తులు తీసుకొంటారని ఆయన చెప్పారు. ఏ ఒక్క పేదవాడు ప్రభుత్వ పథకాలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో పలుమార్లు దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని ఆయన చెప్పారు. గతంలో 180 ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చిందని, మళ్ళీ ఒకసారి పేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందించేందుకు, అర్హులైన వారికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసాతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్లు అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఏకకాలంలో ఏ ప్రభుత్వం కూడా చేయనిది రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ చేశామని, మహిళల కోసం ఉచితంగా బస్సు ప్రయాణం కల్పించామని ఆయన గుర్తు చేశారు. పేదవారికి ఇందిరమ్మ ప్రభుత్వం అండగా నిలబడుతుంది అని, ఈ ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి కూడా లాభం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డిఆర్డీఎ పిడి నర్సింహులు, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, డిసిసి కార్యదర్శి టంకర కృష్ణయ్య యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మక్సూద్, నాయకులు బుద్దారం సుధాకర్ రెడ్డి, మల్లయ్య, లింగం నాయక్, రాజేష్, శంకర్ నాయక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. జెపి ఐటిఐ కళాశాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తానని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని మోటార్ లైన్‌లో ఉన్న జెపి ఐటిఐ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల పరిసరాలను ఆయన తిరిగి పరిశీలించారు. కళాశాలకు కావల్సిన అవసరమైన మౌళిక సదుపాయాలను కళాశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ నడిబొడ్డున విశాలమైన స్థలంలో ఉన్న జెపి ఐటిఐ కళాశాల అభివృద్ధికి అన్ని విధాలా సహకరించి, అభివృద్ధి చేస్తానని అన్నారు. జెపి ఐటిఐ కళాశాలలో మూడు ట్రేడ్స్ నడిపిస్తున్నట్లు అన్ని ట్రేడ్‌లలో 60 మంది విద్యార్థులు చదువుతున్నారని

మల్లాపూర్‌లో రాజ బహదూర్ వెంకట రామారెడ్డి విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర - కాప్రా : మల్లాపూర్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో మల్లాపూర్‌లోని ఎలిఫెంట్ చౌరస్తాలో మన గౌరవ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి చేతుల మీదుగా జరిగినది. బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాజ బహదూర్ వెంకటరామిరెడ్డి సేవలను కొనియాడుతూ మనం కూడా అతని ఆశయాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని, అన్ని విధాల నేను సహాయం చేస్తానని తెలియజేయడం జరిగింది. కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ రెడ్డిలంతా ఐక్యంగా ఉంటూ అందరి పట్ల సేవా తత్పరతతో ఉండాలని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో బండారి నీలం రెడ్డి, పావని రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మైపాల్ రెడ్డి, సంఘం అధ్యక్షుడు కాసం రాజారెడ్డి, జనరల్ సెక్రెటరీ దోమ శ్రీనివాసరెడ్డి, ఆరకాల పద్మా రెడ్డి, ధర్మారెడ్డి, రంగారెడ్డి ముత్యం రెడ్డి ప్రభాకర్ రెడ్డి, కృష్ణారెడ్డి, దయాకర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, నర్సిరెడ్డి, శైలేష్ రెడ్డి, వెంకట్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25, 26 తేదీల్లో ఐహెచ్‌ఎంలో లిటిల్ ఇండియా ఉత్సవం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెూటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్‌ఎం) హైదరాబాద్‌లో ఈనెల 25, 26వ తేదీలలో లిటిల్ ఇండియా 2025 పేరుతో రెండు రోజుల ప్రత్యేక ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెూటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్‌ఎం) ప్రిన్సిపాల్ సంజయ్ కే ఠాకూర్ తెలిపారు. ఈ వివరాలు వెల్లడించేందుకు విద్యానగర్‌లోని ఐహెచ్‌ఎం క్యాంపస్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత పర్యాటక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో స్వతంత్ర సంస్థగా ఈ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెూటల్ మేనేజ్‌మెంట్ (ఐహెచ్‌ఎం) ఉందన్నారు. ఈ ఉత్సవం ఈ రెండు రోజులు మధ్యాహ్నం 12:30 నుంచి రాత్రి 10:30 గంటల వరకు జరుగుతుందన్నారు. ఉచిత ప్రవేశంతో అందరికీ అందుబాటులో కలదన్నారు. ఈ ఉత్సవంలో దేశంలోని వివిధ రుచులను ప్రదర్శించనున్నామని చెప్పారు. హాస్పిటాలిటీ రంగంలో ముందుకు రావాలనుకునే విద్యార్థులకు ఇది ఉత్తమ వేదికగా నిలుస్తుందన్నారు. ఆహారం మాత్రమే కాకుండా స్పోర్ట్స్ మీట్, సాంస్కృతిక కార్యక్రమాలు, స్టాండ్-అప్ కామెడీ, కెరీర్ ఆసక్తిగల వారికి ఓపెన్ డే వంటి అనేక వినోదాలతో లిటిల్ ఇండియా ప్రత్యేకంగా ఉండనుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ ఉత్సవానికి హాజరై భారత సాంస్కృతిక వైవిధ్యాన్ని ఆస్వాదించవచ్చని చెప్పారు. ఈ సంవత్సరం లిటిల్ ఇండియా 2025లో భారతదేశం నలుమూలల ప్రాంతీయ వంటకాలను అద్భుతంగా ప్రదర్శించడం జరుగుతుందన్నారు. ప్రతి వంటకం ఒక సంప్రదాయం, రుచితో కూడిన కథను చెప్పగలదన్నారు. ఒక్క వంటలు మాత్రమే కాకుండా.. అది ఆట పాటలు ఉత్సాహభరిత క్రీడలతో నిండనుందని చెప్పారు. ఆతిథ్య రంగంపై ఆసక్తి కలిగిన అభ్యాసకులకు ఉపాధి అవకాశాలపై విలువైన మార్గనిర్దేశం కూడా అందించనున్నామని తెలిపారు.

ఆంజనేయ స్వామి దేవాలయ నిర్మాణానికి సహాయమందిస్తా : మైనంపల్లి

విశాలాంధ్ర- మల్కాజిగిరి : మల్కాజిగిరి అంజనేయ స్వామి దేవయలం నూతన నిర్మాణ పనులను మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు శుక్రవారం పరిశీలించి అనంతరం గడప ఏర్పాటు పనులకు కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించడం జరిగింది. ఆలయ నిర్మాణ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడులకు కేరాఫ్‌గా మారిన తెలంగాణ

విశాలాంధ్ర - హైదరాబాద్ : పెట్టుబడులకు కేరాఫ్ అడ్రస్‌గా తెలంగాణ రాష్ట్రం మారిందనే విషయం సీఎం బృందం దావోస్ పర్యటన రుజువు చేసిందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వచ్చిన పెట్టుబడులు ఒక సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వచ్చిన పెట్టుబడులపై చర్చించేందుకు బీఆర్ఎస్ సిద్దమా అని సవాలు విసిరారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బలమురి వెంకట్, ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, సాట్ ఛైర్మన్ శివసేనరెడ్డి తదితరులతో కలిసి మాట్లాడారు. పెట్టుబడులు రావాలంటే కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమని దావోస్ వేదికగా మరోసారి రుజువైందన్నారు. దావోస్‌లో తెలంగాణ పెవిలియన్ వద్ద పెట్టుబడులు పెట్టడానికి ప్రముఖ కంపెనీలు పెద్ద ఎత్తున క్యూ కట్టడం హర్షించదగ్గ విషయం అన్నారు. తెలంగాణలో భారీ ఎత్తున పెట్టుబడులకు కృషి చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని తెలంగాణ బృందానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ప్రసిద్ధ ఐటీ, ఎనర్జీ, సోలార్, ఏయిర్‌స్పేస్, మౌలిక సదుపాయల కల్పన, ఫార్మా, హెల్త్‌కేర్ రంగానికి చెందిన కంపెనీలు దావోస్‌లో తెలంగాణ పెవిలియన్ వద్ద క్యూ కట్టి పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడం స్వాగతించాల్సిన అంశంగా పేర్కొన్నారు. దావోస్ వేదికగా తెలంగాణకు భారీగా పెట్టుబడులు రావడంతో రాష్ట్రంలో రియల్ ఎస్టేట్‌కు కూడా 'భూం' వచ్చే అవకాశాలున్నాయని అభిప్రాయపడ్డారు. దావోస్‌లో 16 సంస్థలతో రూ.1,64,050 కోట్ల ఒప్పందాలు కుదరడంతో, రాష్ట్రంలో యువతకు 50 వేలకు పైగా ఉద్యోగాలు వచ్చే అవకాశాలు ఏర్పడ్డాయన్నారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత ఇంత భారీగా పెట్టుబడులు రావడం ఇదే మొదటిసారి అన్నారు. గతేడాది దావోస్‌లో తెలంగాణకు రూ.40,232 కోట్ల పెట్టుబడులు రాగా, ఈసారి భారీ పెట్టుబడులు రావడం సంతోషించాల్సిన విషయమన్నారు. దావోస్‌లో గతేడాది జరిగిన సమావేశంలో 14 కంపెనీలతో తెలంగాణ ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలకు అనుగుణంగా 18 ప్రాజెక్టుల ఏర్పాటుకు కంపెనీలు ముందుకు రాగా, వాటిలో 17 పనులు ప్రారంభమై పురోగతిలో ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి ప్రాధాన్యతిస్తుండడంతో పాటు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేస్తుండడంతో పలు కంపెనీలు తెలంగాణపై ఆసక్తి చూపాయని తెలిపారు. ప్రభుత్వం ముందు చూపుతూ రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం, నగరంలో మెట్రో విస్తరణకు అధిక ప్రాధన్యతివ్వడం కూడా తెలంగాణలో పెట్టుబడులకు కంపెనీలు ఆసక్తి చూపాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్న 'తెలంగాణ రైజింగ్ 2050 విజన్' రాష్ట్రానికి గేమ్ ఛేంజర్‌గా మారిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సరళతర పారిశ్రామిక విధానంతోపాటు ఇటీవల ప్రకటించిన క్లీన్ అండ్ గ్రీన్ పాలసీ ప్రపంచ పారిశ్రామిక వేత్తల దృష్టిని ఆకర్షించిందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రూ.25,750 కోట్ల పెట్టుబడులు రాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండేళ్లలో రూ.2 లక్షలకుపైగా పెట్టుబడులు రావడం విశేషమన్నారు. అమేజాన్ వెబ్ సర్వీసెస్ రూ.60 కోట్ల పెట్టుబడులతో ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్, క్లౌడ్ సర్వీసెస్ అండ్ డేటా సెంటర్ ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చాయి. సన్ పెట్రోల్ కెమికల్స్ రూ.45,500 కోట్లు పెట్టుబడులు పెడుతుండడంతో 7 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుందన్నారు. ఏజిలిటి కంపెనీ రూ. 400 కోట్లు పెట్టుబడి పెట్టనుందని, ఇన్ఫోసిస్ రూ.750 కోట్లు పెట్టుబడులతో 17 వేల మందికి ఉద్యోగాలు రానున్నట్లు వెల్లడించారు.

పర్యావరణ పరిక్షణపై పిసిబి అవగాహన

విశాలాంధ్ర - హైదరాబాద్ : నుమాయిష్-2025 తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (పిసిబి) 84 ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్‌లో ఒక స్టాల్‌ను ఏర్పాటు చేసింది. ఇది పర్యావరణ పరిరక్షణ గురించి అవగాహన కల్పించడానికి ఒక చొరవ చూపారు. ఇ-వ్యర్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, బయోమెడికల్ వ్యర్థాలు, మున్సిపల్ ఘన వ్యర్థాలు, బయోమాస్ బర్నింగ్ పొల్యూషన్, ఇండోర్ వాయు కాలుష్యం, పారిశ్రామిక వాయు కాలుష్యం, నీటి సంరక్షణ, సరస్సు సంరక్షణ, నిర్మాణం, కూల్చివేత వ్యర్థాలు. సందర్శకులకు అవగాహన కల్పిస్తుంది. కాలుష్య నియంత్రణ ప్రాముఖ్యత, కాలుష్యాన్ని, పర్యావరణ పాదముద్రను తగ్గించడానికి సందర్శకులకు, ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. స్టాల్‌కు పెద్ద సంఖ్యలో సందర్శకు లను ఆకర్షించి క్లీనర్, ఆరోగ్యకరమైన తెలంగాణ నిర్మించడానికి పిసిబి చెపట్టిన కార్యక్రమాల గురించి తెలుసుకోవడంలో సందర్శకులు ఆసక్తి చూపారు.

అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌కు శంకుస్థాపన

విశాలాంధ్ర - మేడిపల్లి : బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 16వ డివిజన్లో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ 1.43 కోట్లు, 14వ డివిజన్లో జంతు జనన నియంత్రణ పనులకు 40 లక్షల నిధులతో శుక్రవారం ఉదయం శంకుస్థాపన చేసిన బోడుప్పల్ మున్సిపాల్ కార్పొరేషన్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్. ఈ కార్యక్రమంలో వారితో పాటు డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిషోర్ గౌడ్, మున్సిపల్ కమీషనర్ జి.రామలింగం, బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహా రెడ్డి, కార్పొరేటర్లు కొత్త దుర్గమ్మ గౌడ్, సింగిరెడ్డి పద్మా రెడ్డి, కొత్త చందర్ గౌడ్, సుమన్ నాయక్, మహేశ్వరి కృపా సాగర్, కుంభం కిరణ్ కుమార్ రెడ్డి, లావణ్య శేఖర్ రెడ్డి, సీసా వెంకటేష్ గౌడ్, బొమ్మక్ కళ్యాణ్, చీరాల నర్సింహా, దానగళ్ల అనిత యాదగిరి, కో ఆప్షన్ సభ్యులు బ్రహ్మణ గౌడ్, కంటెస్టెడ్ కార్పొరేటర్ పోగుల దిలీప్ రెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నుండి మహేందర్ సస్పెండ్

విశాలాంధ్ర - కొత్తూరు : కాంగ్రెస్ పార్టీ కొత్తూరు మున్సిపాలిటీ ఉపాధ్యక్షుడు తిమ్మాపూర్ మహేందర్‌ను కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేసినట్టు మండల పార్టీ అధ్యక్షుడు గొంగోళ్ల హరినాథ్ రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు జే సుదర్శన్ గౌడ్ శుక్రవారం కొత్తూరు పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల అనేక అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటు ఓ మహిళ కేసు వ్యవహారంలో పోలీసులు అరెస్టు చేసి గురువారం రిమాండ్‌కి తరలించారు. ఈ విషయమై మహేందర్ వ్యవహారాల పట్ల అసంతృప్తి చెందుతూ పార్టీకి చెడ్డ పేరు వస్తుందని పార్టీ సస్పెన్షన్ వేడు వేసినట్టు వారు వివరించారు. ఇకనుండి మహేందర్ వ్యాపార, ఇతర లావాదేవీలకు, కేసులకు పార్టీకి ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. అతని వ్యక్తిగత వ్యవహారాలపై అతనిదే బాధ్యత తప్ప పార్టీకి లేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కుర్రోళ్ళ సురేందర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నాడ శివ శంకర్ గౌడ్, మున్సిపాలిటీ కోశాధికారి చింత సాయి తేజేశ్వర్, నాయకులు జెనిగె శివ, పాశం కృష్ణ, అక్కివేనిగూడ రాజు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

31 నుండి హైటెక్స్‌లో "కిడ్స్ ఫెయిర్"

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: జనవరి 31 నుండి ఫిబ్రవరి 2 వరకు మూడు రోజుల పాటు కిడ్స్ ఫెయిర్ తొలి కిడ్స్ బిజినెస్ కార్నివాల్ జరగనుంది. హైటెక్స్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో హైటెక్స్ బిజినెస్ హెడ్ టిజి శ్రీకాంత్ మాట్లాడుతూ, పెటెక్స్, కిడ్స్ ఫెయిర్ కిడ్స్ బిజినెస్ కార్నివాల్‌తో పాటు భారతదేశంలోని ప్రధాన పెట్ ట్రేడ్ ఫెయిర్ కూడా నడుస్తుందని అన్నారు. కార్నివెల్ మద్దతుతో, పెటెక్స్ 60-ప్లస్ ఎగ్జిబిటర్లను కలిగి ఉంటుంది. కొంతమంది ఎగ్జిబిటర్లు టర్కీ చెక్ రిపబ్లిక్, జపాన్, సింగపూర్, జర్మనీ వంటి వివిధ దేశాల నుండి వచ్చారు. ఇది పెంపుడు జంతువుల తల్లిదండ్రులు, పెంపుడు జంతువుల ప్రేమికులు మరియు ఔత్సాహికులను ఒకచోట చేర్చుతుంది. సందర్శకులు ప్రదర్శనలో 70-ప్లస్ రకాల అలంకారమైన చేపలు, గుర్రాలు, పక్షులు, అంతర్జాతీయ పిల్లుల ఛాంపియన్‌షిప్, కుక్కల ఫ్యాషన్ షో, K9 స్కూల్ ద్వారా కుక్కలా చురుకుదనం, విధేయత ప్రదర్శనలు మరియు స్కూపీ స్క్రబ్ ద్వారా కుక్కల కోసం ఉచిత బేసిక్ గ్రూమింగ్ మున్నగునవి సందర్శించవచ్చును. క్యాట్ ఛాంపియన్‌షిప్ ను ఇండియన్ క్యాట్ క్లబ్ నిర్వహిస్తుంది. ఇందులో 200-ప్లస్ రకాల పిల్లులు ఉంటాయి. కొన్ని అరుదైన జాతులలో మైనేకూన్ (ప్రపంచంలో అతిపెద్ద-పరిమాణ పెంపుడు పిల్లిగా పరిగణించబడుతుంది) ఉన్నాయి. ఇవి చాలా పొడవాటి చెవులు మరియు మందపాటి బరువైన పొరలతో శరీరాన్ని కలిగి ఉంటారు. వీటి ధర రూ.1.1 లక్షల నుంచి 2 లక్షల వరకు ఉంటుంది. మరొక అరుదైన జాతి బ్రిటిష్ చిన్న జుట్టు పిల్లి. ఈ జాతి భారతదేశంలో పెరుగుతున్న జాతి. ఈ జాతులు ప్రత్యేకమైన పూర్తి బుగ్గలతో చిన్న మరియు మందపాటి బొచ్చు గల పిల్లులు. వాటిలో చాలా వరకు నీలం రంగులో రాగి-రంగు కళ్లతో ఉంటాయి. దీని ధర రూ.80,000 నుంచి రూ.1.5 లక్షల వరకు ఉంటుంది.

విద్యార్థులను ప్రోత్సహిస్తే అనుకున్న లక్ష్యాలను సాధిస్తారు

విశాలాంధ్ర - కొత్తూరు : ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను ప్రోత్సహిస్తే అనుకున్న లక్ష్యాలను సాధిస్తారని యూత్ కాంగ్రెస్ కొత్తూరు మండల అధ్యక్షుడు వన్నాడ శివశంకర్ గౌడ్ అన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోగల విద్యార్థులకు నిర్వహిస్తున్న ఆటలు పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రోత్సాహం అందించేందుకు బహుమతుల కోసం శుక్రవారం ఆయన మండల ఎంఈఓ అంగుర్ నాయక్ ను కలుసుకొని రూ.8,000 వేలు అందజేశారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించే విధంగ కృషిచేయాలని కోరారు.

హైదరాబాద్ అభివృద్ధిలో కీలకం కానున్న 'మెట్రో రైల్

విశాలాంధ్ర - హైదరాబాద్ : హైదరాబాద్ ప్రపంచంలోని ప్రముఖ నగరాలతో పోటీ పడాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పానికి అనుగుణంగా హైదరాబాద్‌లో మెట్రో రైల్ వ్యవస్థను నలుదిక్కులా విస్తరిస్తున్నట్లు హైదరాబాద్ ఎయిర్ పోర్ట్ మెట్రో లిమిటెడ్ ఎండీ ఎన్‌విఎస్ రెడ్డి తెలిపారు. 69 కిలోమీటర్ల తొలి అడుగుతో ప్రారంభమైన హైదరాబాద్ మెట్రోని దాదాపు 200 కిలోమీటర్లకు పైగా విస్తరించడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని ఆయన వెల్లడించారు. ఈవీ జిప్ సంస్థ హైదరాబాద్‌లో 'మొదటి - చివరి మైల్ కనెక్టివిటీ'లో భాగంగా ప్రవేశపెట్టిన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు, క్యాబ్‌లను ఎల్ ఎండ్ టీ ఎండీ కేవీబీ రెడ్డితో కలిసి ఎన్‌విఎస్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్‌విఎస్ రెడ్డి మాట్లాడుతూ ఈవీ జిప్‌తో సహా ఇప్పటి వరకు 9 సంస్థలు 'మొదటి-చివరి మైల్ కనెక్టివిటీ' కింద తమ సేవలు అందిస్తున్నాయని చెప్పారు. రోజూ మెట్రో రైల్‌లో ప్రయాణం చేస్తున్న సుమారు 5 లక్షల మందిలో 1.25 లక్షల మందిని ఈ సంస్థల వాహనాలు వారి వారి గమ్యాలకు చేరుస్తున్నాయని తెలిపారు. వీటిలో మహిళా ప్రయాణీకుల కోసం కూడా ప్రత్యేకంగా మహిళలే నడిపే ద్విచక్ర ఎలెక్ట్రిక్ వాహనాలను ఇప్పుడు తొలిసారిగా 'ఈవీ జిప్ ఈషా' పేరున వారు ప్రవేశపెట్టడం జరిగిందని మెట్రో ఎండీ ఎన్‌విఎస్ రెడ్డి చెప్పారు. ఈ వాహనాలను వందకు పైగా పరేడ్ గ్రౌండ్స్, సికింద్రాబాద్ ఈస్ట్ స్టేషన్ల నుండి మల్కాజిగిరి, సైనిక్‌పురి, ఈసీఐఎల్ వంటి ప్రాంతాలకు ఎక్కువగా నాడుపుచున్నారు. హైదరాబాద్‌ని ప్రపంచ నగరాలకు దీటుగా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి రేవెంత్ రెడ్డి దార్శనికతను అందిపుచ్చుకుని మెట్రో రైల్‌ని విస్తరిస్తున్నామని ఆయన చెప్పారు. ఇప్పటికే పాత నగరంలో ఎంజీబీఎస్ నుండి చంద్రాయణ్ గుట్ట వరకు ప్రారంభించిన రహదారి విస్తరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని తెలిపారు. మొత్తం ప్రభావిత 1100 ఆస్తులకు గాను 170 ఆస్తులకు నష్టపరిహారం రు.80 కోట్లు చెల్లించామని ఎన్‌విఎస్ రెడ్డి వెల్లడించారు. వచ్చే కొద్ది రోజుల్లో మరో 80 కోట్ల పరిహారం చెల్లించేలా ప్రభావిత ఆస్తుల ఓనర్షిప్ డాక్యుమెంట్ల పరిశీలన జరుగుతోందని ఆయన అన్నారు. మొత్తం 270 మంది యజమానులు ఇప్పటికే స్వచ్ఛందంగా తమ ఆస్తులను మెట్రో రైల్ నిర్మాణం కోసం ఇవ్వడానికి ముందుకు వచ్చారని చెప్పారు. ఎల్ అండ్ టీ మెట్రో రైల్ సీనియర్ అధికారులు మురళీ వరదరాజన్, రిషి వర్మ, కియోలిస్ మెట్రో ఎండీ ఎస్.సి. మిశ్రా, ఈవీ జిప్ సంస్థ వ్యవస్థాపకులు శ్రీధర్ శివలెంక, సీతారాం చెరుకుపల్లి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చిత్తారమ్మ దేవి స్వర్ణోత్సవాలు

విశాలాంధ్ర-కుత్బుల్లాపూర్ : హైదరాబాద్ నగరంలో అతిపెద్ద జాతరగా పేరుపొందిన గాజులరామారం శ్రీ చిత్తారమ్మ దేవి జాతర ప్రారంభమై అంగరంగ వైభవంగా కొనసాగు తుంది. జనవరి 17 నుండి 25 వరకు జరుగుతున్న అమ్మవారి జాతరకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భారీ ఏర్పాట్లు చేశారు. ఈ జాతరలో ఎలాంటి అవంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తుగా జీడిమెట్ల సిఐ గడ్డం మల్లేష్, జగద్గిరిగుట్ట సీఐ నరసింహులు, ఆలయ కమిటీ చైర్మన్ కూన అనంతయ్య గౌడ్, కమిటీ మెంబర్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ జాతర శాంతియుత వాతావరణం లో జరిగేందుకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ కూన అంతయ్య గౌడ్ మాట్లాడుతూ అమ్మవారి ఆలయం స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సంవత్సరం అత్యంత వైభవంగా అమ్మవారి ఉత్సవాలు జరుపుతున్నట్లు తెలిపారు. అమ్మవారిని దర్శించుకునే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని జాతరలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పలు జాగ్రత్తలు చేపడుతున్నట్లు వెల్లడించారు. జాతర ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయంలో గణపతి పూజ, పుణ్యవచకం, పంచగవ్య ప్రాశన, దీక్ష దారుణ మంటపారదన, అగ్ని ప్రతిష్టాపన నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ వ్యక్తం చేశారు. 18 వ తేదీన గవ్యంత పూజలు, మూల మంత్రజపం,దేవత హెూమాలు, చండీ హెూమం, పూర్ణాహుతి, బలి ప్రధానం, బుత్విక్ స్మనం,

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి

విశాలాంధ్ర - మొయినాబాద్ : గత పది సంవత్సరాల అధికారంలో ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వం నిరుపేద ప్రజలకు ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని ఇప్పుడైనా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన నిజమైన పేద ప్రజలకు లబ్ధించే విధంగా గుర్తించి వారికి లబ్ధి పొందే విధంగా చేయాలని భారతీయ జనతా పార్టీ ఓబిసి చేవెళ్ల నియోజకవర్గం కన్వీనర్ ఎల్గని వెంకటేష్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన హిమాయత్ నగర్ కేంద్రంలో మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా నిరుపేదల వివరాలను పూర్తిగా సేకరించి స్వీకరించి పూర్తి స్థాయిలో వివరాలు నమోదు చేసుకొని అర్హులను గుర్తించి వారికి లబ్ధి చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పేదవాళ్లు ఏ పార్టీకి చెందిన వారైనా నిజమైన లబ్ధిదారులకు నిరుపేద కుటుంబాల అందరిక రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. అలాగే గత పది సంవత్సరాలలో అర్హులైన అనేకమంది పేదల కార్డులు రద్దు చేయడం జరిగిందని వాటిని కూడా పరిశీలించి అర్హులైన అందరికీ మరల కార్డులు ఇచ్చే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరారు. లబ్ధిదారులకు సాయం అందించేది కేంద్ర ప్రభుత్వమే కాబట్టి మీరు చేయవలసిందిగా నిజమైన లబ్ధిదాలను గుర్తించి రేషన్ కార్డులు ఇవ్వాల్సిందేనని వెంకటేష్ గౌడ్ స్పష్టం చేశారు. లేకుంటే పార్టీ పరంగా నిరసన ధర్నా ఇతర కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుంది హెచ్చరించారు.

ఆడ పిల్లలను చదివించాలి : కలెక్టరు

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్యర్యంలో నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ వద్ద నుండి విద్యార్ధినుల మరియు మహిళలు తో నిర్వహించిన ర్యాలీని జిల్లా కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా బేటీ బచావో బేటీ పడావోపై ఏర్పాటుచేసిన పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడ పిల్లలను చదివించాలని, వారు చదువుకుంటే ఏదైనా సాధ్యమని అన్నారు. ప్రధానమంత్రి, ఉపాధ్యాయులు కావాలన్నా లక్ష్యాలను తేలికగా సాధించగలరని అన్నారు. ఆడపిల్లలు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని అన్నారు. చదువు వలన కలిగే లాభాలను, ఎందుకోసం చదువుకోవాలి అనే విషయాల పట్ల కలెక్టరు విద్యార్థులను అడిగి వారిలో ఆసక్తి కలిగించారు. 2015 నుండి ప్రారంభమైన జాతీయ బాలికా దినోత్సవం పది సంవత్సరాలు పూర్తి చేసుకున్నందున పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలలో మహిళలకు, విద్యార్థినులకు వచ్చే మార్చి 8 వ తేదీ వరకు భ్రూణ హత్యలను నివారించడం, బాలికా విద్యను పోత్సహించడం, మహిళా సాధికారత దిశగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, లింగ వివక్షత లేకుండా మహిళా సాధికారతను పోత్సహించడం దీని లక్ష్యాలని తెలిపారు. జిల్లా న్యాయ సేవా అధారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బి.దీప్తి మాట్లాడుతూ తల్లిదండ్రుల పెంపకంలో అమ్మాయిల పట్ల ఎలాంటి వివక్షత చూపకుండా అన్ని రంగాలలో సమానంగా పోత్సహించాలని అన్నారు. ఆడపిల్లలకు ఆస్తి హక్కు చట్టాలు పటిష్టంగా ఉన్నాయని, తల్లిదండులు తమ ఆస్తిలో పిల్లల పట్ల ఎలాంటి వివక్ష చూపవద్దని అన్నారు. ఆడపిల్లలు బాగా చదువుకోవాలని, చదువు ద్వరానే సాదధికారత సాధ్యమని అన్నారు.

రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి

విశాలాంధ్ర - నేరేడుచర్ల : రైతు భరోసా పథకానికి కొత్తగా భూమీ పట్టా పొందినవారు వేంటనే వ్యవసాయ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలనీ వ్యవసాయ అధికారి జావేద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే 26 నుండి ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని ప్రారంభించనుంది. ఈ పథకం కింద, అర్హుడైన ప్రతి రైతుకు సంవత్సరానికి 12,000 పెట్టుబడి సాయం అందించబడుతుంది. రైతులు ఇంకా రైతు భరోసా పథకం కింద దరఖాస్తు చేయకపోతే రైతులు వేంటనే పట్టా పాస్ బుక్ ప్రతులు ఆధార్ కార్డు బ్యాంక్ ఖాతా జిరాక్సు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అందుబాటులోకి అత్యాధునిక న్యూరో సంబంధిత వైద్య సేవలు

విశాలాంధ్ర - జూబిలీహిల్స్ : తెలుగు రాష్ట్రాల ప్రజలకు న్యూరో సంబంధిత అత్యుత్తమ వైద్య చికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. రెనోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరోలాజికల్ సైన్సెస్‌ను రెనోవా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ప్రారంభించింది. బంజారాహిల్స్, రోడ్ నంబర్ 12లో ఉన్న రెనోవా సెంచరీ హాస్పిటల్‌లో ఈ కొత్త న్యూరో బ్లాక్ ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ న్యూరో సర్జన్, నిమ్స్ మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ డి.రాజారెడ్డి చేతుల మీదుగా ఈ న్యూరో బ్లాక్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా మాట్లాడిన డా. డి.రాజారెడ్డి, ఇలాంటి అత్యాధునిక న్యూరో సైన్స్ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించే అవకాశం రావడం తనకు గౌరవమని చెప్పారు. తాను 1967 నుంచి ప్రాక్టీస్ చేస్తున్నాని, ప్రపంచంలో చాలా దేశాలు తిరిగి చాలా ఆసుపత్రులు చూశానని, వాటన్నిటికంటే ఉత్తమ సాంకేతికత, పరికరాలను చూస్తున్నానని వెల్లడించారు. ఇక్కడ అత్యుత్తమ వైద్య సదుపాయాలు ఉన్నాయని చెప్పిన డా. డి.రాజారెడ్డి, బ్రెయిన్ ట్యూమర్లు, న్యూరో సర్జరీలు, వెన్నెముక సమస్యలకు మాత్రమేగాక చాలా ఆరోగ్య సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు. రెనోవా హాస్పిటల్స్, ఎండీ, సీఈవో డా. శ్రీధర్ పెద్దిరెడ్డి మాట్లాడుతూ, ఇతర ఆసుపత్రులు ఎలాంటి వైద్య సేవలపై దృష్టి పెట్టలేదో, తాము వాటిపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. అందులో భాగంగా, మధ్య స్థాయి మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు, కేన్సర్ చికిత్సలు, నాడీ సంబంధిత చికిత్సలను అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. వీళ్లందరి సహకారంతో నాడీ చికిత్సల్లో అవసరమైన అన్ని వైద్య సేవలను ఒకేచోట అందుబాటులోకి తీసుకొచ్చినట్లు వివరించారు. అన్ని ఆధునిక సదుపాయాలను ఒకచోట చేర్చామన్నారు.

బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించండి

దాతలు ముందుకు రావాలి :: మంత్రి పొన్నం ప్రభాకర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : శ్రీ లక్ష్మీ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని బీసీ సంక్షేమ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్డు శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంత్రి, కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్ ప్రత్యేక పూజలు చేశారు. వారికి వేద పండితులు ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం వచ్చేనెల 3 నుంచి పదో తేదీ వరకు నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులు, ప్రజలు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. గతేడాది మాదిరి దాతలు కూడా ముందుకొచ్చి స్వామివారి సేవకు విరాళాలు అందించాలని కోరారు. గతేడాది దాతలు విరాళాలతోనే వేడుకలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా రూట్లను మళ్లించి బందోబస్తు నిర్వహించాలన్నారు. ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ వేడుకలు నిర్వహించాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఉందని అన్నారు.

అఖిలభారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ క్యాలెండర్ విడుదల

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: జెట్టి శ్రీనివాస్ అధ్యక్షులు, కంటే శివకుమార్ సెక్రటరీ అధ్వర్యంలో నూతన సంవత్సరం సందర్భంగా క్యాలెండర్ విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులు శేరిలింగంపల్లి మండల కార్యదర్శ టి.రామకృష్ణ, ప్రజానాట్య మండలి కూన సుధాకర్, ఇజ్జత్ నగర్ సెక్రటరీ ఎం.వెంకటేష్, దళిత హక్కుల సమితి ఎస్.కొండలయ్య, జే తిరుపతి, నాయకులు టినితీష్ ధర్మతేజలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - తుర్కయంజాల్ : ప్రజా సంక్షేమమే తన లక్ష్యమని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. తుర్కయాంజాల్ పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం శుక్రవారం చైర్మెన్ మల్‌రెడ్డి అనురాధ అధ్యక్షుతన మున్సిపాలిటీలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలంగాణ రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజలందరికీ చేరే విధంగా కౌన్సిలర్లు అధికారులు కృషి చేయాలని అన్నారు. గడిచిన ఐదేళ్ల కాలంలో పాలకవర్గం చేసిన అభివృద్ధిని గుర్తు చేస్తూ పాలకవర్గాన్ని అభినందిం తచారు. సమావేశంలో 50 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి, టి సాట్ ఛైర్మన్ వేణుగోపాల్ రెడ్డి. కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ ఓటరు దినోత్సవం

విధిగా ఓటర్లు ప్రతిజ్ఞ చేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర- హైదరాబాద్ : జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవంను పురస్కరించుకొని జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ ఓటర్స్ డే ప్రతిజ్ఞ చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ఓటర్ డే సందర్భంగా జిల్లా అధికారులు తమ తమ కార్యాలయాల్లో సిబ్బందిచే ఓటరు ప్రతిజ్ఞ చేయించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

జెపి దర్గాను దర్శించుకున్న నాగరి ప్రీతం

విశాలాంధ్ర - కొత్తూరు : కొత్తూరు మండలం, ఇనుముల్ నర్వ శివారులోని హజ్రత్ జహంగీర్ పీర్ దర్గాను శుక్రవారం దర్శించుకోవడానికి విచ్చేసిన రాష్ట్ర ఎస్సీ సెల్ కార్పొరేషన్ చైర్మన్ నాగరి ప్రీతం కు కాంగ్రెస్ పార్టీ షాద్నగర్ నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కర్రోల్ల సురేందర్ ఆధ్వర్యంలో ఘనంగ స్వాగతం పలికారు. అనంతరం పలువురితో కలిసి ప్రీతం దర్గాను దర్శించుకొని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాబాల ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఉపాధ్యక్షులు నేదునూరి శ్రీను, ఆయా మండలాల ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగిల్ల భాస్కర్, ఉమెంతల అనంతయ్య, కొస్గి యాదగిరి, రవి కుమార్, నాగి సాయిలు, ఎర్రోళ్ల జగన్, అనిల్, నరేందర్ సీనియర్ నేతలు కొమ్ము కృష్ణ, ఆగిర్ రవి కుమార్ గుప్తా, జితేందర్ రెడ్డి ప్రభు, జంగారి రవి, మాజీ సర్పంచ్ స్వామి, జానిగ శివ, రాజేందర్, కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం కోరారు. ఈ మేరకు శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో 'విశ్వవిద్యాలయాల్లో విద్యా ప్రమాణాలు-ఒప్పంద అధ్యాపకుల పాత్ర' అనే అంశంపై తెలంగాణ స్టేట్ యూనివర్సిటీస్ కాంట్రాక్టర్ అసిస్టెంట్ ప్రొఫెసర్స్ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 12 యూనివర్సిటీల్లోని కాంట్రాక్టు ఉద్యోగుల సదస్సు ఉపేందర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ, ప్రొ.కోదండరాం, ఎడ్యుకేషన్ కమిషన్ సభ్యులు ప్రొ.హరగోపాల్, ప్రొ.పీఎల్.విశ్వేశ్వరరావులు హాజరయ్యారు. ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా ఒప్పంద ఉద్యోగులు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ప్రొ.హరగోపాల్ మాట్లాడుతూ యూనివర్సిటీలు తీవ్ర సంక్షోభంలో నెట్టబడ్డాయన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయని పక్షంలో ఉద్యోగ భద్రత కల్పించాలని, ఉద్యోగ నోటిఫికేషన్లలో కాంట్రాక్టు ఉద్యోగులకు వెయిటేజ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డా.వేల్పుల కుమార్, డా.విజయేందర్ రెడ్డి, డా.తాళ్లపల్లె వెంకటేష్, రేష్మా రెడ్డి, కేయూ పాలక మండలి సభ్యులు డాక్టర్ చిర్ర రాజు, డా. సాదు రాజేష్, డా.దత్తాత్రేయ, డా.గంగ కిషన్, డా. స్వప్న, డా. రజని, కృష్ణవేణి, డా. సూర్యం, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లు

విశాలాంధ్ర - కాప్రా : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల జారీ ప్రక్రియ కోసం చేపట్టిన సర్వేలో మల్లాపూర్ డివిజన్ గ్రేటర్ కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ పాల్గొన్నారు. ప్రతి పేదింటి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డు అందుతుందని భరోసా కల్పించారు. రేషన్ కార్డుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని ప్రజలు ఆందోళన చెందకుండా వార్డు సభల్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సిఎం రేవంతన్న సర్కారు న్యాయం చేస్తుందని అభయం ఇచ్చారు.

ఉపాధి పనులు ప్రారంభించండి

- వలసలు ఆపండి...రోజు కూలీ రూ.700 ఇవ్వాలి
- జాబ్‌కార్డుతో నిమిత్తం లేకుండా 200 పనిదినాలు
- పథకం పక్కదారి పట్టకుండా చర్యలు
- జల్లి విల్సన్, సీహెచ్ కోటేశ్వరరావు, ఆవుల శేఖర్ డిమాండ్
- రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్లు, డ్వామా పీడీలకు వినతులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తీవ్రమవుతున్న వలసలు ఆపాలని, ఉపాధి హామీ పనులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం జిల్లా కలెక్టర్లు, డ్వామా పీడీలకు సంఘం నేతల నుంచి వినతులు పోటెత్తాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా రోజువారీ కూలి రూ.700 ఇవ్వాలని, జాబ్ కార్డుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరికీ 200 పనిదినాలు కల్పించాలని, రెండు పూటల పనివిధానం తీసివేయాలని, వేసవి భృతి పునరుద్ధరించాలని, మెటీరియల్ కాంపోనెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, ఉపాధిహామీ పనులు సకాలంలో కల్పించకపోతే ఉపాధి భృతి ఇవ్వాలన్న డిమాండ్లతో వినతులు అందజేశారు. వలసల నివారణలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని నాయకులు ధ్వజమెత్తారు. ఉపాధి హామీ నిధులు దారిమళ్లించకుండా వందశాతం ఉపాధి కూలీలకే వినియోగించి వలసలు నివారించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ జిల్లా డ్వామా పీడీ కార్యాలయం వద్ద ఉపాధికూలీలు భారీగా తరలివచ్చి ధర్నా నిర్వహించారు. అనంతరం డ్వామా పీడీ రాముకు జల్లివిల్సన్, సీహెచ్ కోటేశ్వరరావు అధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పె నరసింహారావు, చిలకూరి వెంకటేశ్వరరావు, గిరిజన సమాఖ్య నాయకులు భూక్యా దేశాయ్, ఉపాధి కూలీల సంఘం నాయకులు యం.గురవయ్య, సూరిబాబు, చింతయ్య, రవి, లావూరి తిరుపతమ్మ, మూర్తలక్ష్మీ, ఐ.బాలమ్మ, కె.భవాని, బి.రాధ, సూరిబాబు తదితర ఉపాధి కూలీలు పాల్గొన్నారు. కర్నూలు జిల్లా డ్వామా పరిపాలన అధికారి(ఏవో) విజయలక్ష్మీకి ఆవుల శేఖర్‌తోపాటు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సి.మహేశ్, బాబయ్య, శేషు, మధు వినతులు అందజేశారు.

జల్లి విల్సన్ మాట్లాడుతూ రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో పనులు లేకపోడంతో కూలీలు ఇతర ప్రాంతాలకు వలసబాట పడుతున్నారని చెప్పారు. రాయలసీమ జిల్లాల్లో ఇప్పటికే ఇళ్లకు తాళాలు వేసి గ్రామాలకు గ్రామాలు ఖాళీ చేస్తున్న పరిస్థితులు ఉండటం ఆందోళన కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దయనీయ పరిస్థితులను ప్రభుత్వం సకాలంలో గుర్తించి ఉపాధి హామీ పనులు ప్రారంభిస్తే ఈ దారుణ పరిస్థితులు వచ్చేవి కాదని అన్నారు. ఏడాదికి 200 రోజుల పనిదినాలను జాబ్‌కార్డుతో సంబంధం లేకుండా కుటుంబంలో ప్రతిఒక్కరికీ పనికల్పించి రోజుకు రూ.700 కూలీ గిట్టుబాటు అయ్యేలా నిబంధనలు మారిస్తే వలసలు పూర్తిగా నివారించవచ్చని చెప్పారు. ఈ పథకం పక్కదారి పట్టకుండా చూడాలన్నారు. సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినప్పుడల్లా రాజకీయ కక్షతో సిబ్బందిని తొలగించడం అత్యంత దారుణమని మండిపడ్డారు. చట్టవిరుద్ధంగా తొలగిస్తున్న సిబ్బందిని తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పనిలో ప్రమాదవశాత్తు మరణించడం, అంగవైకల్యం చెందిన ఉపాధి కూలీలకు కార్మిక పరిహార చట్టం ప్రకారం తగిన నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ఉద్యమాలను మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ కూలీలు, పేదలు, కౌలుదారులు గ్రామాలు వదిలి ఇతర ప్రాంతాలకు వలస వెళుతున్నారని, అయినా వలసల నివారణలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆవుల శేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లా డ్వామా పరిపాలన అధికారి(ఏఓ) విజయలక్ష్మీకి వినతిపత్రం అందజేసిన అనంతరం ఆవుల శేఖర్ మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో వలసలు పెరిగాయన్నారు. ఉపాధి సిబ్బంది అలసత్వమే ఇందుకు కారణమన్నారు. గ్రామాలకు గ్రామాలే ఖాళీ అయిపోతున్నా, ప్రభుత్వానికి, అధికారులకు చీమకుట్టినట్లు లేదని తీవ్రంగా దుయ్యబట్టారు. ఇప్పటికైనా ఉపాధి హామీ కూలీల వలసలు ఆపాలని, ఇప్పటికే వలస వెళ్లిన వారిని తిరిగి గ్రామాలకు రప్పించి ఉపాధి పనులు కల్పించాలని, లేకుంటే భవిష్యత్తులో పెద్దఎత్తున ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం కర్నూలు జిల్లా ఉపాధ్యక్షులు సి.మహేశ్, బాబయ్య, శేషు, మధు తదితరులున్నారు. నంద్యాల జిల్లాలో జిల్లా కార్యదర్శి కె.రాధాకృష్ణ, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ప్రతాప్, శ్రీనివాస్, కాకినాడ జిల్లాలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అప్పలరాజు, పప్పు ఆదినారాయణ, సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడికొండ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి తోకల ప్రసాద్, నక్కా శ్రీనివాసరావు వినతులిచ్చారు. అనంతపురము జిల్లా కలెక్టర్‌ను కలిసిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.రంగయ్య, బి.కేశవరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, పెద్దయ్య, చెంద్రాయుడు, సంగప్ప ఉన్నారు. శ్రీకాకుళం జిల్లాలో లండ వెంకట్రావు, బడ్డి త్రినాథ్, మన్యం జిల్లాలో ద్వామా పీడీకి సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మోహన్, గరుగుబిల్లి సూరయ్య, జీవా, పైడిశెట్టి, నెల్లూరు జిల్లాలో ద్వామా పీడీకి జిల్లా కార్యదర్శి రమణయ్య, సహాయ కార్యదర్శి కామేశ్వరరావు, లక్ష్మయ్య, విజయ, అజయ్‌కుమార్, చిత్తూరు జిల్లా కలెక్టర్‌కు సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామమూర్తి తదితరులు వినతిపత్రాలిచ్చారు.

'వక్ఫ్' సమావేశం రసాభాస

విపక్ష సభ్యుల సస్పెన్షన్

న్యూదిల్లీ: వక్ఫ్ సరవణ బిల్లుపై ఏర్పాటైన పార్లమెంటరీ ప్యానల్ భేటీ రసాభాస అయింది. అధికార-విపక్షాల మధ్య వాగ్వాదంతో ప్రతిపక్ష సభ్యులందరిపై సస్పెన్షన్ వేటు పడింది. చైర్మన్‌పై ఆరోపణలు, ప్రతిపక్ష సభ్యుల ఆందోళన క్రమంలో ఒక రోజు పాటు వారంతా సస్పెండ్ అయ్యారు. సస్పెన్షన్‌కు గురైన సభ్యుల్లో కల్యాణ్ బెనర్జీ, మహమ్మద్ జావేద్, ఎ.రాజా, అసదుద్దీన్ ఒవైసీ, నసీర్ హుస్సేన్, మొహిబుల్లా, మహమ్మద్ అబ్దుల్లా, అరవింద్ సావంత్, నదీమ్ ఉల్ హక్, ఇమ్రాన్ మసూద్ ఉన్నారు. ప్రతిపక్ష సభ్యులను సస్పెండ్ చేయాలని బీజేపీ సభ్యుడు నిశికాంత్ దూబే ప్రతిపాదించగా కమిటీ ఆమోదించింది. సమావేశానికి ఆటంకం కలిగించడం, చైర్మన్‌ను అనుచిత పదజాలంతో దూషించడం ద్వారా ప్రతిపక్ష సభ్యులు అసహ్యంగా ప్రవర్తించారని బీజేపీ సభ్యులు అపరాజిత సారంగి ఆరోపించారు. అయితే ముసాయిదా శాసనానికి ప్రతిపాదించిన సవరణలను అధ్యయనం చేసేందుకు తమకు సరిపడ సమయం ఇవ్వడం లేదని ప్రతిపక్ష సభ్యులు వాదించారు. దిల్లీ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా వక్ఫ్ సవరణ బిల్లుపై నివేదికకు వెంటనే ఆమోదించాలనే బీజేపీ ఒత్తిడి తెస్తున్నట్లు ఆరోపించారు. దీంతో సభ కొద్దిసేపు వాయిదా పడింది. తిరిగి భేటీ అయినప్పుడు మీర్వాయిజ్ ఉమర్ ఫరూక్ నేతృత్వ బృందం కమిటీ ఎదుట హాజరైంది. కల్యాణ్ బెనర్జీ (టీఎంసీ), నసీర్ హుస్సేన్ (కాంగ్రెస్) సమావేశాన్ని బహిష్కరించారు. వీరు విలేకరులతో మాట్లాడుతూ ఈ సమావేశం ఒట్టి బూకటమని విమర్శించారు. ప్రతిపాదిత సవరణలను క్లాజుల వారీగా పరిశీలించడానికి సోమవారం (27వ తేదీ) జరగాల్సిన సమావేశాన్ని ఈనెల 30 లేదా 31వ తేదీకి వాయిదా వేయాలని వారు డిమాండ్ చేశారు. కాగా, వక్ఫ్ (సవరణ) బిల్లు, 2024ను 2024, ఆగస్టు 8న సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి పంపారు. అంతకుముందు కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు దీనిని లోక్‌సభలో ప్రవేశపెట్టారు. వక్ఫ్ ఆస్తులకు సంబంధించిన నిబంధనలను మార్చేందుకుగాను 1995 నాటి వక్ఫ్ చట్టాన్ని సవరించే ఉద్దేశంతో ఈ బిల్లును ప్రవేశపెట్టడం విదితమే.

పెట్టుబడులకు ఏపీ అనుకూలం

దావోస్‌లో పారిశ్రామికవేత్తలతో లోకేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పెట్టుబడులు పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనుకూలంగా ఉంటుందని అంతర్జాతీయ స్థాయి పారిశ్రామికవేత్తలతో మంత్రి నారా లోకేశ్ అన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న విధానాల గురించి వారికి వివరించారు. ఏపీలో పెట్టుబడులు పెట్టాలని, పారిశ్రామికాభివృద్ధికి సహకరించాలని కోరారు. ప్రపంచ ఆర్థిక ఫోరం సందర్భంగా 30 మందికిపైగా గ్లోబల్ పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు. ఆయా రంగాల్లో అనుసరిస్తున్న విధానాలు, పెట్టుబడులుకు అనుకూలంగా ఉన్న పరిస్థితులను తెలిపారు. కృత్రిమ మేథ, క్లీన్ ఎనర్జీ వంటి రంగాల్లో తమ ప్రభుత్వ ప్రాధాన్యతలు, అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి వివరించారు. దావోస్ పర్యటనలో భాగంగా స్విట్జర్లాంట్ పారిశ్రామిక వేత్తలను కలిశారు. తెలుగు సంతతి ప్రజల సమావేశాలకు హాజరయ్యారు. ఎనిమిది రౌండ్ టేబుల్ సమావేశాలకు వెళ్లారు. వివిధ రంగాలకు చెందిన తొమ్మిది మంది అంతర్జాతీయ నిపుణులతో సమావేశమై ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న అవకాశాలపై చర్చించారు. సమయం ఉన్నప్పుడు ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ మీడియా సంస్థల ప్రతినిధులతో మాట్లాడారు. దావోస్‌లో బిజీబిజీగా గడిపిన లోకేశ్ శుక్రవారం అక్కడ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. అయితే మంచు వర్షాన్ని సైతం లెక్క చేయకుండా లోకేశ్... దావోస్ రోడ్లపై నడుచుకుంటూ వెళ్లే ఫోటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. తన పుట్టిన రోజు (గురువారం)న కూడా లోకేశ్ పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు. కాగా, లోకేశ్ తాను కలిసిన పారిశ్రామికవేత్తలందరినీ మంగళగిరి చేనేత శాలువాతో సన్మానించారు.

ఎన్‌పీఎఫ్‌ఏఎం వెనక్కి

సంయుక్త కిసాన్ మోర్చా డిమాండ్

8,9 తేదీల్లో ఎంపీలకు వినతులు

మార్చి 5 నుంచి పక్కా మోర్చాలు

న్యూదిల్లీ: వ్యవసాయ మార్కెటింగ్ కోసం జాతీయ విధాన కార్యాచరణ (ఎన్‌పీఎఫ్‌ఏఎం)ను సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) ఏకగ్రీవంగా తిరస్కరించింది. రైతాంగ పోరాటంతో రద్దు అయిన మూడు సాగు చట్టాలనే ఎన్‌పీఎఫ్‌ఏఎం రూపంలో తిరిగి అమలులోకి తేవాలని కేంద్రం యత్నిస్తోందని దుయ్యబట్టింది. ఎన్‌పీఎఫ్‌ఏఎంతో రైతులకు ప్రయోజనం శూన్యమని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. అది జరిగేంత వరకు విశ్రమించబోమని, ఉద్యమాన్ని ఉధృతంగా చేపడతామని కేంద్రాన్ని హెచ్చరించింది. సంయుక్త కిసాన్ మోర్చా సర్వసభ్య సమావేశం శుక్రవారం దిల్లీలోని హెచ్‌కేఎస్ సుర్జీత్ భవన్‌లో జరిగింది. 12 రాష్ట్రాల నుంచి 73 రైతు సంఘాలకు చెందిన 165 మంది ప్రతినిధులు హాజరయ్యారు. అధ్యక్షత వహించిన రైతు నాయకుల్లో రావుల వెంకయ్య, హన్నన్ మొల్లా, జోగిందర్ సింగ్ ఉగ్రాహన్, రాకేశ్ తికౌత్, సత్యవాన్, డాక్టర్ సునీలం ఉన్నారు. ఎన్‌పీఎఫ్‌ఏఎంను తిరస్కరిస్తూ విధాన సభల్లో తీర్మానాలు చేయాలన్న డిమాండ్‌తో రాష్ట్ర రాజధానాలు, జిల్లా, సబ్ డివిజన్ స్థాయిలో మార్చి 5 నుంచి పక్కా మోర్చాలు నిర్మించాలని, మహాపంచాయత్‌లు, సభలు నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు ఎస్‌కేఎం ప్రకటించింది. రాష్ట్ర సమన్వయ కమిటీలు ఇందుకోసం పనిచేస్తాయని తెలిపింది. ఫిబ్రవరి 8,9 తేదీల్లో ఎంపీల కార్యాలయాలు/నివాసాల వద్దకు జనాన్ని సమీకరిస్తామని, దేశం-రైతుల పక్షాన నిలవాలని ప్రజా ప్రతినిధులను కోరుతామని, ఎన్‌పీఎఫ్‌ఏఎం రద్దు అవసరాన్ని, తమ ఇతర డిమాండ్ల ప్రాముఖ్యతను వారికి తెలియజేస్తామని సంయుక్త కిసాన్ మోర్చా పేర్కొంది. నాలుగు కార్మిక కోడ్‌ల అమలు కోసం ఎన్‌డీఏ 3.0 ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను దుయ్యబట్టింది. దీని రద్దు కోసం శ్రామిక వర్గ పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించింది.

హంద్రి-నీవా సామర్థ్యం పెంచాలి

పంట కాల్వల నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు

ఈశ్వరయ్య డిమాండ్

విశాలాంధ్ర-రాయచోటి: హంద్రి-నీవా కాలువ సామర్థ్యాన్ని 10 వేల క్యూసెక్కులకు పెంచి, ఆయకట్టు భూములకు సాగునీరు ఇచ్చేందుకు, పంట కాల్వల నిర్మాణానికి అవసరమైన నిధులను రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సీపీఐ అధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ కరువు పీడిత ప్రాంతంగా ఉన్న రాయలసీమ పంటపొలాలకు నికర జలాలు తీసుకురావడానికి గతంలోనే అనేక ప్రతిపాదనలు చేశారని తెలిపారు. సాగులోని 30 శాతం భూమికి కనీస సాగునీటి వనరులు కల్పించాలని జాతీయ ఇరిగేషన్ కమిషన్ 1972లో సూచించిందన్నారు. 2004లో ఏర్పాటయిన జయతి ఘోష్ కమిషన్, 2009లో స్వామినాథన్ కమిటీ నివేదిక, 2012లో ఐకార్ న్యూదిల్లీ కమిటీ నివేదికతో పాటు రాష్ట్ర విభజన సందర్భంగా శ్రీకృష్ణ కమిషన్ నివేదిక ఈ ప్రాంతాల అభివృద్ధికి సాగునీటి అవసరాన్ని, అందుకు ప్రభుత్వాలు తీసుకోవలిసిన చర్యలను సిఫార్సు చేశాయని చెప్పారు. హంద్రి-నీవా ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి కర్నూలు జిల్లాలో 80 వేల ఎకరాలకు, అనంతపురం జిల్లాలో రెండు దశల కింద 3,45,000 ఎకరాలు, కడప జిల్లాలో 37,500, చిత్తూరు జిల్లాలో 1,40,000 ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వాల్సి ఉందన్నారు. అయితే ప్రస్తుత కాలువ సామర్థ్యం అందుకు అనుగుణంగా లేదన్నారు. వరద కాలంలో ఎక్కువ నీటిని తీసుకోవడానికి వీలుగా 10 వేల క్యూసెక్కుల సామర్థ్యానికి పెంచుతామని 2019లో అనంతపురం జిల్లా పామిడి బహిరంగ సభలో ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు ప్రకటించారని, అయితే తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం హంద్రి-నీవా కాలువ గురించి పట్టించుకోలేదని తెలిపారు. కాలువ వెడల్పు కోసం రైతులు, రైతు సంఘాలు, రాజకీయ పార్టీలు చేసిన ఆందోళనల తర్వాత 7-06-2021న జీవో నంబర్ 29 విడుదల చేసిందని చెప్పారు. దీని ప్రకారం, 6,300 క్యూసెక్కుల సామర్థ్యంతో కాలువ నిర్మాణం చేపడతామని, అందుకు రూ.6,182 కోట్లు ఖర్చు అవుతాయని అంచనా వేశారని వివరించారు. అయితే నిధులు విడుదల చేయకపోవడంతో పనులు జరగలేదని విమర్శించారు. రాయలసీమ జిల్లాలకు హంద్రి-నీవా ద్వారా దాదాపు 6 లక్షలకు పైగా ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. అయితే ప్రభుత్వాలు మారుతున్నప్పటికీ రాయలసీమ సాగునీటి వనరుల అభివృద్ధి ఆశించినంతగా జరగడం లేదన్నారు. కాలువ వెడల్పు చేయకుండా, లైనింగ్ చేయడానికి 404, 404 జీవోలను ప్రభుత్వం విడుదల చేసిందని, అలాగే రూ.930 కోట్ల నిధులను విడుదల చేసినప్పటికీ, ఇది సాధ్యమయ్యే పరిస్థితి లేదని ఈశ్వరయ్య చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పి.ఎల్.నర్సింహులు, సహాయ కార్యదర్శి మహేష్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు, సాంబశివ, సిద్ధిగాళ్ల శ్రీనివాసులు, శివరామకృష్ణ దేవరా, సుమిత్రమ్మ, మనోహర్ రెడ్డి, జ్యోతి చిన్నయ్య, మురళి, సుధీర్ కుమార్, వెంకటేష్, కోటేశ్వరరావు, సలీం బాషా, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టు అగ్రనేత చలపతికి కన్నీటి వీడ్కోలు

విశాలాంధ్ర- చింతూరు: మావోయిస్టు అగ్రనేత చలపతి అంత్యక్రియలు ముగిశాయి. శ్రీకాకుళం జిల్లా పలాస మండలం బొడ్డపాడులో అంతిమ సంస్కారాలు నిర్వహించారు. ప్రజా సంఘాల ప్రతినిధులు, మావోయిస్టు సానుభూతిపరులు హాజరయ్యారు. ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. చత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దులోజరిగిన ఎన్‌కౌంటర్‌లో ఆయన మృతి చెందారు. చలపతి మృతదేహాన్ని బొడ్డపాడుకు శుక్రవారం తరలించగా ఆయనకు అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు.

ఐసీసీ సభ్యులకు భద్రత ముఖ్యం: సుప్రీం

న్యూదిల్లీ: అంతర్గత ఫిర్యాదు కమిటీ (ఐసీసీ)ల సభ్యులకు ఉద్యోగ భద్రత, వేధింపుల నుంచి రక్షణ కల్పించడం చాలా ముఖ్యమని సుప్రీంకోర్టు పేర్కొంది. ఈ విషయంలో సొలిసిటర్ జనరల్ సాయాన్ని కోరింది. కేంద్ర ప్రభుత్వానికి నోటీసు ఇచ్చినప్పటికీ స్పందన కరువైందని ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్రం తరపున ఎవరూ రాకపోవడాన్ని ఆక్షేపించింది. ప్రస్తుతం పరిశీలనలో ఉన్నది ముఖ్యమైన అంశం. దీనిని పరిశీలించాలని భావిస్తున్నాం. సొలిసిటర్ జనరల్‌కు ఒక ప్రతిని పంపండి. తదుపరి విచారణకు ఎవరూ రాకపోతే అమికస్‌ను నియమిస్తాం' అని పిటిషనర్లు... ఐసీసీ కమిటీ మాజీ సభ్యురాలు జానకీ చౌదరి, పూర్వ జర్నలిస్టు ఓల్గా టెల్లిస్ తరపు న్యాయవాదికి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటేశ్వర్ సింగ్ ధర్మాసనం స్పష్టంచేసింది. తదుపరి విచారణ వచ్చే వారంలో జరుగుతుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రభుత్వ రంగంలోని ఐసీసీ సభ్యులకు ఏ స్థాయి భద్రత లభిస్తుందో ప్రైవేటు రంగంలో పనిచేసే ఐసీసీ మహిళా సభ్యులకు లేదని పిటిషనర్లు పేర్కొన్నారు. ప్రైవేట్ కార్యాలయంలోని సీనియర్ మేనేజ్‌మెంట్‌కు వ్యతిరేకంగా నిర్ణయం తీసుకుంటే ఏ కారణం చెప్పకుండానే వారిని (3 నెలల జీతంతో) సర్వీస్ నుంచి తొలగించే అంశాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న సుప్రీంకోర్టు... భారత సొలిసిటర్ జనరల్ జోక్యాన్ని కోరుతూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఆ 17 పట్టణాల్లో మద్యం బంద్

మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్

ఖర్గోన్: పుణ్యక్షేత్రాలుగా పరిగణించే రాష్ట్రంలోని 17 పట్టణాలలో మద్యం దుకాణాలు మూసివేస్తూ మధ్యప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఖర్గోనేలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ శుక్రవారం తెలిపారు. ఒక మున్సిపల్ కార్పొరేషన్, ఆరు నగర పాలికలు, ఆరు నగర పరిషత్‌లు, ఆరు గ్రామ పంచాయతీలున్న 17 పట్టణాలలో ఇకపై మద్యం అమ్మకాలు జరగబోవన్నారు. మద్యం దుకాణాలు మూసివేసే ప్రాంతాలు... దటియా, పన్నా, మాండ్ల, ముల్తాయ్, మాండసౌర్, మైహర్ మున్సిపాలిటీలతో పాటు ఓంకరేశ్వర్, మహేశ్వర్, మండలేశ్వర్, ఓర్చా, చిత్రకూట్, అమర్కాంతక్ నగర పరిషత్‌ల పరిధిలో ఉన్నట్లు తెలిపారు. అలాగే సంకర్పూర్, బర్మన్ కాలా, లింగా, కుండల్పూర్, బండక్పూర్, బర్మన్‌ఖుర్ద్ గ్రామ పంచాయతీల్లోనూ మద్యం దుకాణాలు మూసివేస్తామన్నారు. నర్మదా నది పరివాహక ప్రాంతాల్లో ఐదు కిలోమీటర్ల పరిధిలో మద్యం విక్రయాలపై నిషేధం కొనసాగుతుందని సీఎం యాదవ్ వెల్లడించారు.

క్రీడాస్ఫూర్తి పెంపొందాలి

జాతీయస్థాయి సెపక్ తక్రా పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 సెపక్ తక్రా బాల, బాలికల జాతీయస్థాయి పోటీలను సమగ్రశిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు శుక్రవారం పటమట జడ్పీ పాఠశాలలో అట్టహాసంగా ప్రారంభించారు. క్రీడామైదానంలో నాలుగు రోజులు పాటు జరిగే ఈ టోర్నమెంట్‌లో 12 రాష్ట్రాల జట్లు పాల్గొంటాయి. 120 కి పైగా ఆటగాళ్లు పోటీపడతారు. టోర్నమెంట్ లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో ఫ్లడ్ లైట్ల వెలుతురులో జరుగుతున్నాయి. ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తి పెంపొందించాలని ఆకాక్షించారు. త్వరలో క్రీడా కరికులం పాఠ్యాంశాలలో ప్రవేశపెట్టబోతున్నట్టు తెలిపారు. స్కూల్ గేమ్స్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తిరాజు మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఆటగాళ్లు, శిక్షణా సిబ్బందికి స్టార్ హోటళ్లలో వసతి అసౌకర్యం కల్పించామన్నారు. వైద్య సదుపాయం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. జిల్లా పాఠశాల విద్యాధికారి యు.వి.సుబ్బారావు, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ యలమంచిలి రవి, క్రీడలు, పాఠశాల పతాకం ఆవిష్కరించారు. తొలుత జేడీ దేవానందరెడ్డికి క్రీడాకారులను పరిచయం చేశారు.

హోరాహోరీగా...: సెపక్ తక్రా పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. బాలురు విభాగంలో తమిళనాడు- తెలంగాణ జట్ల మధ్య జరిగిన మొదటి మ్యాచ్‌లో 15-9,15-4,15-11 స్కోర్ తేడాతో తమిళనాడు, మహారాష్ట్ర-మణిపూర్ మధ్య జరిగిన రెండవ మ్యాచ్ లో 15-12,15-05,15-11 స్కోర్ తేడాతో మణిపూర్ విజయం సాధించాయి. బాలికల విభాగంలో దిల్లీ-మహారాష్ట్ర మధ్య జరిగిన పోటీలో 11-15,15-12,17-14 స్కోర్ తేడాతో దిల్లీ, తెలంగాణ- తమిళనాడు మధ్య జరిగిన మ్యాచ్‌లో 15-12,15-5,15-11 స్కోర్ తేడాతో తమిళనాడు విజయం సాధించాయి. రాష్ట్ర పాఠశాలల క్రీడాసమైక్య సహాయ కార్యదర్శి కేవీ రాధాకృష్ణ రాజు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పరిశీలకులు గౌతమ్, పోటీల కార్యనిర్వహణ కార్యదర్శి ఎస్.రమేష్, ఇంఛార్జి హెచ్ఎం జి.ఎస్తేర్ రాణి, జిల్లా కార్యదర్శి డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మానవత్వం మంటకలిసిన వేళ

అగర్తల: అప్పు తిరిగి చెల్లించలేదని ఓ మహిళ పట్ల అమానవీయంగా ప్రవర్తించారు. ఇంట్లో వంట చేసుకుంటున్న మహిళను బయటికి ఈడ్చుకొచ్చి మూకుమ్మడి దాడి చేశారు. అంతటితో ఆగక మరో అనాగరిక చర్యకు పాల్పడ్డారు. బలవంతంగా గుండు గీశారు. త్రిపుర రాష్ట్రం సెపహిజాలా జిల్లాలోని విశాల్‌గఢ్‌లోగల లాల్‌సింగ్‌మురా ప్రాంతంలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... లాల్‌సింగ్‌మురా ఏరియాకు చెందిన ఓ మహిళ స్వయం సహాయక సంఘం నుంచి కొంత డబ్బు అప్పుగా తీసుకుంది. ఆ డబ్బును కుటుంబ అవసరాలకు వినియోగించింది. ఆ తర్వాత కొన్నాళ్లకు ఆమె భర్త ఉద్యోగం పోయింది. దాంతో ఆ డబ్బు తిరిగి చెల్లించలేకపోయింది. దాంతో గ్రూపులోని మిగతా సభ్యులంతా ఆమెను డబ్బు తిరిగిచెల్లించాలని ఒత్తిడి చేశారు. కానీ ప్రస్తుతం తాను చెల్లించే పరిస్థితిలో లేనని ఆమె చెప్పింది. దీంతో గురువారం ఉదయం స్వయం సహాయక సంఘంలోని మిగతా మహిళలంతా కలిసి అప్పు తీసుకున్న మహిళ ఇంటికి వెళ్లారు. కిచెన్‌లో వంట చేస్తున్న ఆమెను బయటికి ఈడ్చుకొచ్చారు. దుర్భాషలాడుతూ తీవ్రంగా కొట్టారు. అంతటితో ఆగకుండా ఇంటి ముందు కూర్చోబెట్టి ఆమెకు బలవంతంగా గుండుగీశారు.

ఆగస్టులో విశాఖ పోర్ట్‌కు క్రూయిజ్ షిప్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: కార్డేలియా క్రూయిజ్ షిప్ ఆగస్టులో విశాఖపట్నం పోర్ట్‌కు రానుంది. ఈ క్రూయిజ్ షిప్... పుదుచ్చేరి, చెన్నై, విశాఖపట్నం మధ్య ఆగస్టు 4 నుంచి 22 వరకు మూడుసార్లు నడిపేందుకు సన్నాహాలు పోర్టు యాజమాన్యం చేసుకుంటోంది. ఈ సర్వీస్‌కు షిప్పింగ్ ఏజెంట్‌గా ఎంఎస్‌జీపీసీ షిప్పింగ్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ ఉంటుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రూయిజ్ టర్మినల్‌ను విశాఖపట్నం పోర్ట్ అభివృద్ధి చేసింది. ఇది ఒకేసారి 2,000 మంది ప్రయాణికులకు అవసరమైన అన్ని సేవలను అందించే విధంగా రూపొందింది. టర్మినల్‌లో ఇమిగ్రేషన్, క్లియరెన్స్ కౌంటర్లు, పార్కింగ్, డ్యూటీ ఫ్రీ షాపులు, ఫుడ్ కోర్టులు, లౌంజ్‌లు ఉన్నాయి. విశాఖ నగర సమీపంలోని పర్యాటక ప్రదేశాలకు సమీపంగా ఉండటంతో అంతర్జాతీయ పర్యాటకులకు అత్యంత అనువుగా ఉంటుంది. ఈ టర్మినల్ మొత్తం 3,530 చ.మీ విస్తీర్ణంలో నిర్మించబడింది. గ్రౌండ్ ఫ్లోర్ 2,750 చ.మీ విస్తీర్ణంలో ప్రయాణికుల రాకపోకల కోసం ఉపయోగించ బడుతుంది,మొదటి అంతస్తు 780 చ.మీ విస్తీర్ణంలో నిర్మించబడింది. టర్మినల్ 180 మీటర్ల పొడవు గల బర్త్‌ను కలిగి ఉంది. నాలుగు మూరింగ్ డాల్ఫిన్లతో కలిపి 330 మీటర్ల పొడవు, 37.6 మీటర్ల వెడల్పు, 8.1 మీటర్ల డ్రాఫ్ట్ గల పెద్ద క్రూయిజ్ షిప్‌లను నిర్వహణను చూసుకోగలదు. లగ్జరీ క్రూయిజ్ షిప్ 'ది వరల్డ్'ను ఇప్పటికే టర్మినల్ వద్ద బర్త్ చేశారు. ప్రాంతీయ పర్యాటకాన్ని అభివృద్ధి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం, అధికారులతో కలిసి వీపీటీ పని చేస్తోంది. ఇటీవల ఏపీటీడీసీ మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పర్యాయక ఆపరేటర్లకు, ఇతర పీఎస్‌యూలకు విశాఖపట్నం అంతర్జాతీయ క్రూయిజ్ టర్మినల్‌లో అందుబాటులో ఉన్న ఆధునిక సదుపాయాల గురించి వీపీటీ వివరించింది. ఈ టర్మినల్ ఆర్థికంగా పర్యాటక రంగానికి కలిగించే ప్రయోజనాల గురించి తెలిపింది. పర్యాటకాన్ని, ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించే కార్యక్రమాలను కొనసాగించడంలో విశాఖపట్నం పోర్ట్ అథారిటీ కృతనిశ్చయంతో ముందుకెళుతోంది. ఈ సమాచారాన్ని పోర్ట్ అథారిటీ కార్యదర్శి టి.వేణుగోపాల్ మీడియాకు తెలిపారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.